అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

www.navatelangana.com

శనివారం 23-11-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 277 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | 12 పేజీలు | వెల : 6.50

బెజ్జీ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్


10 మంది మావోయిస్టుల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో ఘటన



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా బందర్‌పదర్, కుర్రాజ్‌గూడ ప్రాంతాల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఇందులో ముగ్గురు మహిళలు ఉన్నారు. కాగా, వీరిలో ఆరుగురు మావోయిస్టులను పోలీస్ అధికారులు ...11లో



అదానీ లంచాలపై నాన్చుడే!

ఈడీ, సీబీఐ మౌనం.. సెబి రహస్య పరిశీలన

రెండు వారాల తర్వాత అధికారిక దర్యాప్తు

అంటూ కేంద్రం నీళ్లు చల్లే యత్నం

ముంబయి : గౌతం అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రభుత్వ విచారణ సంస్థలు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఈ), బీఎస్ఈలు ఈ అంశంపై మౌనంగా ఉన్నాయి. ప్రతిపక్ష పార్టీల ప్రతినిధులు, బీజేపీయేతర ప్రభుత్వాల్లోని వ్యక్తులపై రూ.100 కోట్ల మోసం ఆరోపణలు వస్తేనే అడ్డగోలు విచారణలు చేపట్టే ఈ ఏజెన్సీలు అదానీ వేల కోట్ల లంచాలు ఇచ్చారని స్పష్టమవుతోన్న నిశ్శబ్దంగా ఉండటం గమనార్హం. ప్రధానీ మోడీకి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపు పొందిన అదానీకి తాజా మోసంపైనా ఆయా సంస్థలు రక్షణ కల్పిస్తున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సెబీ కూడా..

అదానీ గ్రూపు లంచాల వ్యవహారంపై సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఎప్పటిలాగే నాన్చుడు దోరణిని అవలంభించే పనిలో ఉందని తెలుస్తోంది. అదానీ ఆర్థిక మోసాలు, కృత్రిమంగా షేర్ల ధరలను పెంచుకోవడం, మనీలాండరింగ్, లాబీయింగ్‌లకు ...3లో

సాగర్ అదానీయే కీలకం



రూ. వేల కోట్ల ముడుపుల యవ్వారం

ఆయన మొబైల్ ఫోన్లోనే 3లో..

న్యూస్ ఏజెన్సీ రాయిటర్స్ వెల్లడి

స్పీకర్‌కు డెడ్‌లైన్ పెట్టలేం

పిటిషన్లపై విచారణ బాధ్యత సభాపతిదే

ఎమ్మెల్యేల అనర్హత కేసులో హైకోర్టు తీర్పు

సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసిన డివిజన్ బెంచ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపై తగిన నిర్ణయం తీసుకోవాల్సింది స్పీకరేనని హైకోర్టు తేల్చి చెప్పింది. రాజ్యాంగం ప్రకారం స్పీకర్ తన విధులను నిర్వహించాలని పేర్కొంటూ కీలక తీర్పును వెలువరించింది. రాజ్యాంగం లోని పదో షెడ్యూల్ ప్రకారం ట్రిబ్యునల్ చైర్మెన్‌గా స్పీకర్‌కు లభించిన అధికార విధులను తగిన సమయంలోగా పూర్తి చేయాలని కోరింది. ఐదేళ్ల శాసనసభ్యుల పదవీ కాలాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని దృష్టిలో పెట్టుకుని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలనే పిటిషన్లపై విచారణ పూర్తి చేయాలని చెప్పింది. రాజ్యాంగ నిర్దేశాలను పరిగణనలోకి తీసుకుని అనర్హత పిటిషన్లపై తగిన సమయంలో విధిగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. ఐదేండ్ల అసెంబ్లీ గడువును కూడా దృష్టిలో ఉంచుకోవాలని సూచించింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టేందుకు షెడ్యూల్‌ను నాలుగు వారాల్లోగా ఖరారు చేయాలంటూ సెప్టెంబర్ 9న హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును ద్విసభ్య ధర్మాసనం కొట్టేసింది. స్పీకర్ ముందు పిటిషన్లు పెండింగ్‌లో ఉండగా కోర్టులు జోక్యం చేసుకోబోవని తేల్చి చెప్పింది. రాజ్యాంగపరంగా స్పీకర్‌ది అత్యున్నత స్థాయి పదవనీ, ఆ పదవిలో విధులు నిర్వహించే వారికి కోర్టులు ఉత్తర్వులు జారీ చేయబోవని స్పష్టం చేసింది. రాజ్యాంగ బద్ధంగా స్పీకర్ రూల్ ఆఫ్ లా మేరకే విధులు నిర్వహిస్తారనీ, అయితే, పిటిషన్లపై విచారణ పూర్తి చేసే బాధ్యత ఆయనదేనని వెల్లడించింది. స్పీకర్ ముందున్న ఆ పిటిషన్ల విషయంలో కోర్టులు జోక్యం చేసుకునేందుకు రాజ్యాంగం వీలుకల్పించలేదని స్పష్టం చేసింది. ఇప్పటి వరకు వేర్వేరు కేసుల్లో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు ప్రకారం కూడా స్పీకర్‌కు కోర్టులు ఆదేశాల జారీకి ఆస్కారమే లేదని వెల్లడించింది. ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్, స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి కడియం శ్రీహరి, భద్రాచలం నుంచి తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ తరఫున గెలిచి, కొద్ది రోజులకే కాంగ్రెస్‌లో చేరడాన్ని సవాలు చేస్తూ వేర్వేరుగా దాఖలైన పిటిషన్లపై శుక్రవారం హైకోర్టు 78 పేజీల తీర్పును వెలువరించింది. కడియం, తెల్లంలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఖైరతాబాద్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి పిటిషన్లు దాఖలు వేశారు. దానంను అనర్హుడిగా ప్రకటించాలనే పిటిషన్‌ను స్పీకర్‌కు ఇచ్చేందుకు ప్రయత్నిస్తే ఫలితం లేకపోయిందంటూ బీజేపీ శాసనసభా పక్ష నేత మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి, పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారనే అనర్హత పిటిషన్ల విచారణ షెడ్యూల్‌ను నాలుగు వారాల్లో ఖరారు చేయాలని సెప్టెంబర్ 9న తీర్పు వెలువరించిన సంగతి తెలిసిందే. ఈ తీర్పును రద్దు చేయాలని అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్లు రెంటింటిపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం శుక్రవారం తీర్పు వెలువరించింది.

మూడు నెలల్లో తేల్చాలి

బీఆర్ఎస్, బీజేపీ తరఫు న్యాయవాదులు 2లో..

న్యాయ సమీక్షకు వీల్లేదు : ప్రభుత్వం

స్పీకర్ తన ముందున్న పిటిషన్లపై నిర్ణయం వెలువరించిన తర్వాత కోర్టులు న్యాయ సమీక్ష జరపొచ్చు. కానీ, స్పీకర్ ఇంకా నిర్ణయం తీసుకోక ముందు కోర్టులు ఆయనపై ఒత్తిడి తేలేవు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం రాజ్యాంగ అధిపతి అయిన స్పీకర్ విధుల్లో కోర్టుల జోక్యం అతి స్వల్పం. అడ్మినిస్ట్రేటీవ్, లెజిస్లేటీవ్, ట్రిబ్యునల్ చైర్మెన్‌గా.. స్పీకర్ పలు కీలక విధులు నిర్వహిస్తారు. స్పీకర్ ముందున్న అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం, స్వేచ్ఛ ఆయనకు ఉంటుంది. స్పీకర్ నిర్ణయాల్లో జోక్యం చేసుకోలేమని గతంలో ఎర్రబెల్లి దయాకర్ రావు దాఖలు చేసిన పిటిషన్‌లో ఇదే హైకోర్టు స్పష్టం చేసింది. ఆయనకు ఆదేశాలు జారీ చేసే అధికార పరిధి కోర్టులకు లేదు. స్పీకర్‌కు కనీస గడువు ఇవ్వకుండానే న్యాయ సమీక్ష కోరడం చెల్లదు. తన వద్దకు వచ్చిన ఫిర్యాదులపై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ రాజ్యాంగం స్పీకర్‌కు ఇచ్చింది' అని ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి, న్యాయ శాఖ ముఖ్య కార్యదర్శి తరఫున రవీంద్ర శ్రీవాస్తవ, ఫిరాయింపు ఎమ్మెల్యేల తరఫున న్యాయ వాదులు శ్రీరఘురాం, మయూర్‌రెడ్డి, జంద్యాల రవిశంకర్ వాదించారు.



డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

పనులను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లోని డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని డిసెంబర్ 9న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆవిష్కరించనున్నారు. శుక్రవారం విగ్రహ ఏర్పాటుకు సంబంధించిన పనులను సీఎం పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న కూలీలను పలకరించారు. పనులు జరుగుతున్న తీరు, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని సౌత్ కరోలినా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్ జే.ఏ ఏరియల్ మూర్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

ఫార్మారంగంలో రూ.5,260 కోట్ల పెట్టుబడులు

ఆరు కంపెనీలతో ఎంవోయూ కుదుర్చుకున్న ప్రభుత్వం

12,490 మందికి కొత్తగా ఉద్యోగాలు వస్తాయంటూ అంచనా

వివరాలు 11లో

లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక

ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, అగ్రికల్చర్ కమిషన్ చైర్మెన్ కోదండరెడ్డి అందజేత

వివరాలు 11లో

ఫైళ్ల పంచాయితీ

నేరుగా సీఎస్‌కు పంపడంపై సుల్తానీయా నిలదీత





పలువురు ఐఏఎస్‌లతో భేటీ

సీఎంవో దృష్టికి తీసుకెళ్లిన

మరో సీనియర్ ఆఫీసర్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఫైళ్ల పంచాయితీ పలువురు ఐఏఎస్‌ల మధ్య భిన్నాభిప్రాయాలకు చోటుకల్పించింది. ప్రోటోకాల్‌ను పాటించకుండా ఫైళ్లు దాటించేయడమే ఇందుకు కారణమైంది. శుక్రవారం సచివాలయం వేదికగా ఇది చోటుచేసుకుంది. దీంతో పలువురు సీనియర్ ఐఏఎస్‌లు సచివాలయం నుంచి బయటకు వెళ్లి, వారి అసోసియేషన్ కార్యాలయంలో ఫైళ్ల సర్క్యులేషన్ గురించి చర్చించుకున్నట్టు సమాచారం. ప్రభుత్వంలో ఆర్థిక శాఖ కీలకం. అనేక లావాదేవీలకు సంబంధించి వ్యవహారాలను ఈ శాఖ పర్యవేక్షిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే సర్కారుకు వెన్నెముక లాంటిది. అప్పులు తేవడం, వడ్డీలు చెల్లించడం, ప్రాజెక్టులు, పథకాలకు నిధులు సమకూర్చడం, పెండింగ్ బిల్లులు మంజూరు చేయడం తదితర అనేక పనులు ఆర్థిక శాఖలో జరుగుతుంటాయి. ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి, ఉన్నతాధికారులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఓ కన్నేసి ఉంచుతారు. ప్రతిరోజూ సమీక్షిస్తారు. ఇలాంటి కీలకమైన శాఖలో ఫైళ్లు ప్రభుత్వ ముఖ్యకార్యదర్శిని వదిలేసి నేరుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వెళ్లడాన్ని తప్పుబడుతున్నారు. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అనారోగ్యంతో ఉన్నారు. దీంతో ముఖ్యకార్యదర్శిగా ఉన్న సందీప్‌కుమార్ సుల్తానీయా ఆర్థికశాఖ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆర్థిక శాఖపై సహజంగానే అనేక ఒత్తిళ్లు ఉంటాయి. ఈనేపథ్యంలో కొన్ని ఫైళ్లను ముఖ్యకార్యదర్శిని కాదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి దగ్గరకు నేరుగా పంపడంతో సుల్తానీయా కినుక వహించారు. ఈ విషయంలో తోటి ఐఏఎస్‌లతో సంప్రదింపులు చేశారు. చివరకు సన్నిహితులైన పలువురు ఐఏఎస్‌లతో భేటి అయ్యారు. ఐఏఎస్ ఆఫీసర్ల అసోసియేషన్ కార్యాలయంలో సుల్తానీయా ఆయా అంశాలపై చర్చించినట్టు తెలిసింది. ఇది తెలిసిన మరో సీనియర్ ఐఏఎస్ ముఖ్యమంత్రి కార్యాలయం దృష్టికి తీసుకుపోయినట్టు సమాచారం. దీంతో ఐఏఎస్‌ల మధ్య రగడ బయటకు పొక్కింది. అయితే ఇది టీ కప్పులో తుఫాన్‌లాంటిదేననీ, ఇప్పటికే సుఖాంతమైందనే ప్రచారం జరుగుతోంది.



కార్మికులకు మోడీ సర్కార్ ద్రోహం

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

ఎస్పీఈ చట్టాన్ని పరిరక్షించాలి :

సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్

మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ ర్యాలీ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కార్మికులకు మోడీ ప్రభుత్వం ద్రోహం చేస్తోందని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ విమర్శించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, ఎస్పీఈ చట్టాన్ని పరిరక్షించాలని, చట్టబద్ధమైన పని నియమాలను ఫ్రేమ్ చేయాలని, ఉద్యోగాలు, హక్కులను పరిరక్షించాలని తదితర డిమాండ్ల సాధనకు శుక్రవారం నాడిక్కడ జంతర్ మంతర్ వద్ద మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటీవ్స్ సమాఖ్య (ఎఫ్ఎంఆర్ఎఐ) భారీ ర్యాలీ నిర్వహించింది. ఈ సందర్భంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్‌లో పని చేసే అందరినీ వర్క్‌మెన్లుగా నిర్ణయించాలని ...11లో

జియోకు టారీఫ్‌ల సెగ

మరో 79 లక్షల మంది ఖాతాదారులు గుడ్‌బై

- ఎయిర్‌టెల్, వీఐలకూ తప్పని పోటు
- బీఎస్ఎన్ఎల్‌లో చేరిన 8.5 లక్షల మంది





హైదరాబాద్ : దిగ్గజ ప్రయివేటు టెల్కో రిలయన్స్ జియో టారీఫ్‌ల పెంపునకు ఖాతాదారులు రిటర్న్ గిఫ్ట్ ఇస్తున్నారు. అదే బాటలో భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా (వీఐ)లను లక్షలాది మంది వినియోగదారులు వీడారు. మరోవైపు ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్‌కు వలస కొనసాగుతోంది. వరుసగా మూడో మాసంలోనూ ప్రయివేటు టెల్కోలు తమ ఖాతాదారుల బేస్‌ను కోల్పోయాయి. ఆ సంస్థలకు సెప్టెంబర్‌లో దాదాపు కోటి మంది ఖాతాదారులు గుడ్‌బై చెప్పారు. ట్రాయ్ గణంకాల ప్రకారం.. గడిచిన సెప్టెంబర్‌లో రిలయన్స్ జియోను 79.69 లక్షల మొబైల్ ఖాతాదారులు వీడారు. భారతీ ఎయిర్‌టెల్‌ను 14.34 లక్షల మంది, విఐని 15.53 లక్షల మంది వద్దనుకున్నారు. మరోవైపు బిఎస్ఎన్ఎల్ మాత్రం కొత్తగా 8.49 లక్షల ఖాతాదారులను జోడించుకుంది. దీంతో బిఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య 9.18 కోట్లకు చేరింది. జియో ఖాతాదారుల సంఖ్య 46.37 కోట్లుగా, భారతీ ఎయిర్‌టెల్ 38.34 కోట్లు, విఐ 21.24 కోట్ల చొప్పున వినియోగదారులను కలిగి ఉన్నాయి.

ఈ ఏడాది జులైలో రిలయన్స్ జియో తొలుత భారీగా టారీఫ్‌లను పెంచడం.. ఆ బాటలోనే భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు 27 శాతం వరకు టారీఫ్‌లను పెంచేశాయి. దీంతో వినియోగదారులపై ఆర్థిక భారం నెలకొంది. చౌక ధరల్లో ప్లాన్లను అందిస్తున్న బిఎస్ఎన్ఎల్‌కు వలసలు పెరుగుతున్నాయి. ఇంతక్రితం జులై, ఆగస్టు నెలల్లోనూ బీఎస్ఎన్ఎల్‌లో కొత్తగా 55 లక్షల మంది పైగా చేరారు. ఇదే సమయంలో ప్రయివేటు టెల్కోలు ఏకంగా 1.21 కోట్ల ఖాతాదారులను పోగొట్టుకున్నాయి. బీఎస్ఎన్ఎల్‌కు ప్రయివేటు టెల్కోల ఖాతాదారుల వలస మరింత కొనసాగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో 16 బిల్లులు



అందులో సహకార యూనివర్సిటీతో సహా ఐదు కొత్తవి

వక్ఫ్‌బిల్లు కూడా..

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

సోమవారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఐదు కొత్త బిల్లులతో సహా 16 బిల్లులను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఈ మేరకు కేంద్రం వక్ఫ్ బిల్లుతో సహా 16 బిల్లులకు జాబితాను సిద్ధం చేసింది. ఈ సమావేశాల్లో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) తన నివేదికను సమర్పించిన తరువాత, ఉభయ సభల పరిశీలన, ఆమోదం కోసం వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లుకూ జాబితా చేసింది. ఐదు కొత్త బిల్లులతో పాటు సహకార యూనివర్సిటీ ఏర్పాటుకూ బిల్లును ప్రవేశపెట్టనుంది. అయితే గత వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో ప్రవేశపెట్టిన తరువాత జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపిన వక్ఫ్(సవరణ) బిల్లుపైనే అందరి దృష్టి ఉండనుంది. శీతాకాల సమావేశాల మొదటి వారం చివరి రోజున ప్యానెల్ తన నివేదికను సమర్పించడం తప్పనిసరి. వక్ఫ్ బిల్లును పరిశీలిస్తున్న జేపీసీ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే కోరడంతో ప్రస్తుత సెషన్‌లో గందరగోళం నెలకొనే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ బిల్లులో ప్రతిపాదించిన అనేక సవరణలను ప్రతిపక్షాలు, ముస్లిం సంస్థలు వ్యతిరేకించాయి. ఈ శీతాకాల సమావేశాల్లో 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' బిల్లును ప్రవేశపెడతారని ఊహాగానాలు ఎక్కువగా వినిపించినా ఆ జాబితాలో చోటు దక్కలేదు. 11 పెండింగ్ బిల్లులతో సహా మొత్తం 16 బిల్లులు ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభ సెక్రటేరియట్‌లకు సమర్పించిన జాబితాలో భాగంగా ఉన్నాయి. మొత్తం మూడు బిల్లులు రాజ్యసభలోనూ, ఎనిమిది బిల్లులు లోక్‌సభలో పెండింగ్ ఉన్నాయి. వీటితో పాటు ఐదు కొత్త ...11లో

అదానీని అరెస్టు చేయాలి



జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలి

బాధ్యత వహిస్తూ మోడీ రాజీనామా చేయాల్సిందే : మహేష్ కుమార్ గౌడ్ 11లో..

అదానీతో అన్ని ఒప్పందాలనూ రద్దు చేయాలి



స్కిల్ యూనివర్సిటీకి ఆయన ఇచ్చిన రూ.100 కోట్లను తిరిగి ఇచ్చేయాలి : కేటీఆర్ డిమాండ్ 11లో..

నేడు మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలు

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం..ఫలితాలపై ఉత్కంఠ



న్యూఢిల్లీ : మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. శనివారం ఉదయం 8 గంటలకు రెండు రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలుకానుంది. వీటితోపాటు దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లోని 46 అసెంబ్లీ స్థానాలకు, నాందేడ్, వాయనాడ్ ...2లో

కుటుంబ సర్వే @ కోటి

ఏడు జిల్లాల్లో నూటికి నూరు శాతం పూర్తి



16 రోజుల్లోనే లక్ష్యానికి చేరువలో

సర్వే విధుల్లో లక్ష మందికి పైగా ఉద్యోగులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో చేపట్టిన సమగ్ర సర్వే శుక్రవారం నాటికి కోటి కుటుంబాల మైలురాయిని దాటింది. 16 రోజుల్లో 90 శాతానికి పైగా కుటుంబాల లెక్కలను సర్కార్ తేల్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాలకు గాను శుక్రవారం నాటికి ఎనిమిది జిల్లాల్లో సర్వే దాదాపు పూర్తయింది. ములుగు, జనగాం జిల్లాల్లో వందకు వంద శాతం పూర్తి కాగా నల్లగొండ, మెదక్‌లలో 99.9, యాదాద్రి భువనగిరి, జగిత్యాల, గద్వాలలో 99 శాతం సర్వే పూర్తయింది. కామారెడ్డిలో 98.5, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిజామాబాద్, సిరిసిల్ల జిల్లాల్లో 98 శాతం సర్వే జరిగింది. జోగుళాంబ గద్వాల్, జగిత్యాల, యాదాద్రి భువనగిరి, కామారెడ్డి, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, మహబూబ్ నగర్, ఖమ్మం, నారాయణపేట, మహబూబాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, వనపర్తి, సూర్యాపేట, కరీంనగర్, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్, నిర్మల్, వరంగల్, సిద్దిపేట జిల్లాల్లో 90 శాతం సర్వే పూర్తయింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, హన్మకొండ జిల్లాల్లో 80 శాతం, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 75.1 శాతం సర్వే పూర్తయింది. వేరే ప్రాంతాల్లో నివాసముంటున్న వారు, ఇండ్లకు తాళాలున్నవి మినహాయిస్తే ...11లో

కార్మికులకు ప్రమోషన్లు ఇవ్వాలి

- సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు

నవతెలంగాణ-గోదావరిఖని



కార్మికులకు రావాల్సిన ప్రమోషన్లను బ్యాక్‌డేట్‌తో ఇప్పించాలని సీఐటీయూ అనుబంధ సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సింగరేణి స్థాపించినప్పటి నుంచి బొగ్గు ఉత్పత్తిలో ప్రత్యక్ష పాత్రలో ఉన్న ఆనాటి కోల్ ఫిల్లర్స్ కాలక్రమేనా నేటి ఆపరేటర్స్‌గా మారి సంస్థను కాపాడుకోవడంలో ముందు వరుసలో ఉన్నారని చెప్పారు. అలాంటి కార్మికులకు యాజమాన్యం సమయానికి గ్రేడ్ ఇవ్వక ఆర్థికంగా కడుపుపై కొట్టడం సరికాదని అన్నారు. ఆపరేటర్‌గా ట్రెనింగ్‌లో ఉన్నప్పటి నుంచే బేసిక్ మిషనరీ ఏ గ్రేడ్ నడుపుతున్న ఈపీ ఆపరేటర్స్‌ని చిన్నచూపు చూడటం వారి మనోభావాలను దెబ్బతీసినట్టేనన్నారు. సమయానికి ఇవ్వాల్సిన ప్రమోషన్లు ఇవ్వకుండా తాత్సర్యం చేసినట్లయితే రాబోయే రోజుల్లో సింగరేణి ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. వెంటనే వారికి ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ ఆత్మహత్య

- సీఎం సోదరుల వేధింపులే కారణమంటున్న కుటుంబీకులు

నవ తెలంగాణ- వంగూరు

నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సాయిరెడ్డి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన రాసిన సూసైడ్ నోట్ లభ్యమైంది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. 40 సంవత్సరాల కిందట ఒక గుంత బావిని సొంత ఖర్చులతో పూడ్చి తన ఇంటికి వెళ్లేందుకు దారి ఏర్పాటు చేసుకున్నారు. ఇప్పుడు ఆ దారి లేకుండా చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సోదరులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఇబ్బందులకు గురిచేస్తుండటంతో మనస్తాపానికి గురై సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడు.

సాయిరెడ్డిది ఆత్మహత్య కాదు

- సీఎం సోదరులు చేసిన హత్యనే :కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



సీఎం స్వగ్రామమైన కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ పాముకుంట్ల సాయిరెడ్డిది ఆత్మహత్య కానే కాదు.. ముఖ్యమంత్రి సోదరులు చేసిన హత్యనే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆత్మహత్యకు ముందు సూసైడ్ నోట్‌లో చాలా స్పష్టంగా ముఖ్యమంత్రి బ్రదర్స్ తనపై కక్ష కట్టడం వల్లే చనిపోతున్నానని సాయిరెడ్డి స్పష్టం చేసిన నేపథ్యంలో.. దీనికి సీఎం రేవంత్ రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని పేర్కొన్నారు. పోలీసులు సూసైడ్ నోట్ ఆధారంగా అనుముల బ్రదర్స్ పై కేసు నమోదుచేసి సమగ్ర దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బ్రదర్స్ అరాచకాలు తట్టుకోలేక సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆరు నెలల క్రితం ఒక యూట్యూబ్ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారనే కక్షతో.. 40 ఏళ్ల క్రితం కట్టుకున్న ఇంటి ముందు పశువుల దవాఖానాను కట్టడమే కాకుండా, సీఎం ఆదేశాలతో ఇంటికి దారి కూడా లేకుండా అడ్డంగా గోడ కట్టేందుకు పూనుకోవడంతోనే సాయిరెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారని తెలిపారు.కొండారెడ్డిపల్లికి రెండుసార్లు సర్పంచ్‌గా ఎన్నో సేవలందించిన వ్యక్తిని గౌరవించాల్సింది పోయి, 85 ఏళ్ల వయస్సున్న పెద్దాయన అని కూడా చూడకుండా గత కొన్ని నెలలుగా వేధింపులకు గురిచేయడంతో తట్టుకోలేకే పురుగుల మందుతాగి బలవన్మరణానికి పాల్పడ్డారని ఆవేదనవ్యక్తం చేశారు. ఇటీవల సొంత నియోజకవర్గం కొడంగల్‌లో గిరిజన ఆడబిడ్డలపై దమనకాండను దేశం మరిచిపోకముందే.. సీఎం సొంత గ్రామంలో మాజీ సర్పంచ్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చూస్తుంటే.. రాష్ట్రంలో సీఎం, ఆయన సోదరుల ఆరచకాలకు అంతేలేకుండా పోయిందని స్పష్టమవుతోందని పేర్కొన్నారు. ఇది ప్రజాపాలన కాదు.. అరాచక పాలన, నియంత పాలన, దుర్మార్గపు పాలన అని విమర్శించారు.

నేడు మహారాష్ట్ర, జార్ఖండ్ ఫలితాలు

(మొదటిపేజీ తరువాయి)

లోక్‌సభ స్థానాల (ఉపఎన్నికల) ఓట్లను లెక్కించనున్నారు. మహారాష్ట్రలో అసెంబ్లీ పోరు హోరాహోరీగా సాగగా.. సీఎం ఎవరు కానున్నారనే విషయంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రికార్డుస్థాయి పోలింగ్..

మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలతోపాటు నాందేడ్ లోక్‌సభకు ఇటీవల ఓటింగ్ జరిగింది. రాష్ట్రంలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో 61.1శాతం పోలింగ్ నమోదు కాగా.. తాజా ఎన్నికల్లో 66.05శాతం పోలింగ్ నమోదైంది. ఈ స్థాయిలో పోలింగ్ నమోదు కావడం మూడు దశాబ్దాల్లో ఇదే తొలిసారి కావడం విశేషం. గతంలో 1991లో మహారాష్ట్రలో అత్యధికంగా 71.7శాతం నమోదైంది.

ఉదయం 8గంటలకు కౌంటింగ్..

శనివారం ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభం కానుండగా.. 9 గంటల నుంచి ఫలితాల సరళి తెలిసే అవకాశం ఉంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకరు చొప్పున 288 మంది అబ్జర్వర్లతో పర్యవేక్షణ కొనసాగనుంది. నాందేడ్ లోక్‌సభ లెక్కింపును ప్రత్యేకంగా ఇద్దరు అబ్జర్వర్లు పర్యవేక్షించనున్నారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం 1732 టేబుళ్లు, ఎలక్ట్రానిక్ పోస్టల్ బ్యాలెట్ (ఈటీపీబీఎస్)ల కోసం 592 టేబుళ్ల ఏర్పాటు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మహారాష్ట్రలో విజయంపై అధికార మహాయుతి, విపక్ష ఎంవీఏలు కూటములు ధీమాగా ఉన్నాయి.

జార్ఖండ్‌లో 81 స్థానాలకు..

జార్ఖండ్‌లో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగగా.. తొలిసారిగా 67.74శాతం పోలింగ్ నమోదయ్యింది. నవంబర్ 15, 2000లో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఈస్థాయిలో పోలింగ్ నమోదు కావడం ఇదే తొలిసారి. ఇక్కడ నవంబర్ 13, 20 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరిగాయి. అధికార జేఎంఎం మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేస్తుండగా, విపక్ష ఎన్డీయే కూడా తమదే విజయం ఖాయమని చెబుతోంది. ఇటీవల వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ జార్ఖండ్‌లో ఎన్డీయేవైపు మొగ్గు చూపాయి. ఈ రెండు రాష్ట్రాలతోపాటు కేరళలోని వాయనాడ్ లోక్‌సభ సహా 13 రాష్ట్రాల్లో 46 అసెంబ్లీ స్థానాల (ఉప ఎన్నికల) ఓట్ల లెక్కింపు కూడా శనివారం జరగనుంది.

మూడు నెలల్లో తేల్చాలి

(మొదటిపేజీ తరువాయి)

పదో షెడ్యూల్‌ను ఉల్లంఘించిన వ్యక్తులను అనర్హులుగా ప్రకటించాలనే రాజ్యాంగ లక్ష్యానికి కట్టుబడి ఉండాలంటే, ఫిర్యాదు చేసిన తేదీ నుంచి మూడు నెలల వ్యవధిలో స్పీకర్ ముందు దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై తప్పనిసరిగా నిర్ణయం తీసుకోవాలి. సాధారణంగా లోక్‌సభ, శాసనసభల జీవితకాలం ఐదేండ్లు మాత్రమే. ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా నిర్దిష్ట సమయంలో తీర్పు వెలువరించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఇక్కడ 8 నెలలైనా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. శాసనసభ్యుల పార్టీ ఫిరాయింపుల అంశంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీళ్లు దాఖలు చేసే అర్హత అసెంబ్లీ కార్యదర్శికి లేదు'అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల తరపున న్యాయవాది గండ్ర మోహన్‌రావు, జె.రామచందర్‌రావు, బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తరపున సీనియర్ లాయర్ జె.ప్రభాకర్ వాదించారు.

గెలవటం మన జన్మహక్కు

కవి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ

- తెలంగాణ బాలోత్సవం 4వ పిల్లల జాతర
- ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గెలవడం మన జన్మహక్కు అని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ అన్నారు. స్వాతంత్ర్యం రాకమునుపు స్వాతంత్ర్యం మన జన్మహక్కు అని నినదించే వారమనీ, ప్రస్తుతం మనమంతా గెలవడం జన్మహక్కు అని గుర్తించాలని కోరారు. ఆ విషయం చెప్పేందుకే బాలోత్సవం అని తెలిపారు. బాలోత్సవం కోసం తాను రాసిన రెండు పాటల నేపథ్యాన్ని వివరించారు. శుక్రవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద మాజీ ఐఏఎస్ అధికారి, తెలంగాణ రాష్ట్ర పూర్వ సలహాదారులు కె.వి.రమణాచారి అధ్యక్షతన జరిగిన తెలంగాణ బాలోత్సవం 4వ పిల్లల జాతర ప్రారంభ సభలో సుద్దాల అశోక్ తేజ మాట్లాడారు. తన 35 ఏండ్ల సినీ జీవితంలో నేలమ్మ గేయాలు, మానవీయ గీతాలే ఎక్కువగా రాశానని గుర్తుచేశారు. పేదరికం, అనేక సమస్యలున్నా... పాటకు బాటసారిగా, పాటసారిగా ప్రయాణం మొదలు పెట్టి రాష్ట్రపతి ఉండే విజ్ఞాన్ భవన్ వరకు వెళ్లగలిగానని తన అనుభవాలను వివరించారు. ప్రతి జననంలో ఒక కళ ఉంటుందని తెలిపారు. పిల్లలు ఒత్తిడి తగ్గించుకునేందుకు ' తన కోపమే తన శత్రువు' పద్యాన్ని గుర్తుపెట్టుకోవాలని సూచించారు. సినీ జీవితంలో తనను ఒకరు అవమానిస్తే తిరిగి వెనక్కి వెళ్లిపోవాలా? అనుకున్న సమయంలో తన కోసం తాను రాసుకున్న 'ఒకటే జననం.. ' పాటను పాడి పిలల్లో ఉత్సాహం నింపారు. ప్రతి ఒక్కరిలో ఒక కళ ఉంటుందనీ, దాన్ని వెలికి తీసేందుకే బాలోత్సవ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. 4వ పిల్లల జాతర 10 వేల మందితో నిర్వహించారనీ, ఐదో బాలోత్సవం 25 వేల మందితో జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రముఖ కవి, రచయిత నందిని సిధారెడ్డి మాట్లాడుతూ మంచి మాటకు మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. చదువుల్లో ఎన్ని మార్కులొచ్చినా మానవత్వం లేకపోతే వృథా అని హితవు పలికారు. నేటితరం పిల్లల్లో ఉత్సాహం కనిపించకపోవడం ప్రమాద సంకేతమని హెచ్చరించారు. పెద్దవారిలా వేదాంతం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్సాహం ఉంటే ఎంత దూరమైన ప్రయాణం చేయవచ్చని సూచించారు. జీవిత ప్రయాణం ఉత్సాహంతో మొదలుపెట్టి ఉత్సాహంతోనే ముగించాలన్నారు.

బాల సాహిత్య, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో బాలల అకాడమీ ఉండేదని గుర్తుచేశారు. జవహర్ బాలభవన్‌లో థియేటర్ పోటీలుండేవని తెలిపారు. ప్రస్తుతం బాలభవన్ ఉన్నా... కార్యక్రమాలు లేవని విమర్శించారు. ఆ కొరతను బాలోత్సవ్ తీరుస్తున్నదని కొనియాడారు. ప్రతి మనిషి కమ్యూనికేషన్ స్కిల్స్ ముఖ్యమైనవనీ, ఆ స్కిల్స్‌ను బాలోత్సవ్ పెంచుతున్నదని చెప్పారు. కళలు కూడా విద్యలో భాగమేనని తెలిపారు.

కె.వి.రమణాచారి మాట్లాడుతూ వినయం లేని విద్య వృథా అని తెలిపారు. తల వంచి చదివితే జీవితంలో తలెత్తుకుని తిరుగుతారని సూచించారు. చదువుతో పాటు వస్త్రధారణ, దేహం, వాక్కు ముఖ్యమంటూ శ్లోకాలను ఉటంకించారు. ఈ కార్యక్రమానికి బాలోత్సవ్ నిర్వహణ కమిటీ కార్యదర్శి సుజావతి వందన సమర్పణ చేశారు. కార్యక్రమంలో బాలోత్సవ్ నిర్వహణ కమిటీ అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి సోమయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి, విజ్ఞాన దర్శినీ రమేశ్, భారత్ విద్యా సంస్థల చైర్మెన్ సి.హెచ్. వేణుగోపాల్ రెడ్డి, ఎల్ఐసీ కమ్యూనికేషన్ విభాగం మేనేజర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. సభా కార్యక్రమానికి ముందు పిల్లలు ఉత్సాహంగా ఆటపాటలతో అలరించారు. అనంతరం వివిధ కళావిభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారు. బాలోత్సవ్ జాతర కార్యక్రమం శనివారం ముగియనున్నది.

నూలుతో తయారైన యూనిఫార్మ్స్ ప్రవేశపెట్టాలి : బాలోత్సవ్ తీర్మానం

బడి పిల్లలకు నూలుతో తయారైన యూనిఫార్మ్స్‌ను ప్రవేశపెట్టాలని ప్రభుత్వాలను కోరుతూ తెలంగాణ బాలోత్సవం 4వ పిల్లల జాతర -2024లో కమిటీ తీర్మానం చేసింది. పాలియెస్టర్‌కు బదులు సహజ సిద్ధ వస్త్రాలైన లినెన్‌తో పత్తితో తయారయ్యే చేనేత వస్త్రాల యూనిఫాంలనే వాడాలని ప్రతి విద్యార్థికి, ప్రతి ప్రధానోపాధ్యాయురాలికి ఉత్తరాలు రాయాలని నిర్ణయించింది. ప్రస్తుతం పిల్లలు వేసుకుంటున్న యూనిఫార్మ్స్ పాలియెస్టర్ కలిపిన పోగులతో తయారు చేస్తున్నందున భవిష్యత్తులో ఆరోగ్యపరంగా హానీ కలిగి ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేసింది.

పాలియెస్టర్ దుస్తులను ఎక్కువ కాలం వేసుకునే పిల్లలకు థైరాయిడ్ వంటి హార్మోన్స్ సమస్యలు వస్తు న్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నా యని గుర్తు చేసింది. కాటన్ వాడకం తగ్గడం తో అనేక దుష్పరిణాలు న్నాయని హెచ్చరించింది.

లగచర్ల భూములు లాక్కోవడం సరికాదు

- తొండలు గుడ్లు పెట్టే భూములు కాదు.. సారవంతమైనవి : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం
- వెంటనే అఖిలపక్షాన్ని పిలవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



నవతెలంగాణ-మునగాల

ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్రభుత్వం లగచర్లలో గిరిజనుల భూములను లాక్కోవాలని అనుకోవడం సరికాదని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని గణపవరం గ్రామంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. లగచర్లలోని గిరిజన భూములు తొండలు గుడ్లు పెట్టే భూములని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఆ భూములను వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 21న స్వయంగా పరిశీలించామని చెప్పారు. ఆ భూములు మంచి సారవంతమైనవని తెలిపారు. బోర్లు, లిఫ్టు ఇరిగేషన్లు ఏర్పాటు చేసుకుని వరితోపాటు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారని చెప్పారు. ఆ గ్రామంలో 150 వరకు బిల్డింగ్‌లు వున్నాయన్నారు. ఎస్టీ, బీసీ, గిరిజన పిల్లలు పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారన్నారు. అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన ఈ ప్రాంతాన్ని బూడిద చేయటానికి పూనుకోవడం సరికాదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం.. పంట భూములను ఫ్యాక్టరీలకు, ప్రాజెక్టులకు, విషం వెదల్లే ఫార్మాసిటీలకు ఇచ్చేది లేదని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని, అక్రమ కేసులను ఎత్తి వేయాలని అన్నారు. బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయటంలో పూర్తిగా విఫలమైందన్నారు. రైతులకు 2లక్షల రుణ మాఫీ పూర్తిగా అమలు కాలేదన్నారు. ఎన్నికల ముందు హామీలు అటుంచితే తెరపైకి కొత్త విషయాలు వచ్చాయని చెప్పారు. సమస్యలపై చర్చించేందుకు వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ల లెక్క తేలింది

- ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా
- వచ్చిన దరఖాస్తులు 28698
- 22,554 ఆమోదం, 6144 తిరస్కరణ

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితా లెక్క తేలింది. ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీకాలం 2025 మార్చి 29న పూర్తి కానుంది. దీంతో ఆ స్థానం ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా రూపొందించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకటించింది. ఓటర్ల నమోదు సెప్టెంబరు 30 నుంచి ప్రారంభం కాగా.. నవంబర్ 6 వరకు దరఖాస్తులు స్వీకరించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో మొత్తం 28698 ఫారాలు వచ్చాయి. అందులో 22554 ఆమోదించబడగా, 6144 తిరస్కరణకు గురయ్యాయి. ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు శుక్రవారం విడుదల చేశారు. ఓటర్ల జాబితాను డీఈవో, కలెక్టర్లు, ఆర్డీఓ, ఇతర అన్ని కార్యాలయాల్లో పెట్టారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ జిల్లాల వారీగా ఓటర్లు ఇలా ఉన్నారు. డ్రాఫ్ట్ ప్రకారం జిల్లాల వారీగా ఓటర్లు - ఈ క్రమంలో 12 జిల్లాలు, 191 మండలాల్లో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు హక్కుఫారం 18, 19 ద్వారా నమోదు చేసుకున్నారు.

ఆమోదించిన దరఖాస్తులు ఇలా...

సిద్దిపేట జిల్లాలో నాలుగు మండలాలకుగాను 149, నల్లగొండ 33 మండలాల పరిధిలో 4178, సూర్యాపేట 23 మండలాల పరిధిలో 2467, యాదాద్రి భువనగిరి జిల్లా 17 మండలాల పరిధిలో 826, జనగామ జిల్లా పరిధిలో 12 మండలాల్లో 810, మహబూబాబాద్ జిల్లాలో 18 మండలాలకు 1473, వరంగల్ జిల్లా పరిధిలో 13 మండలాల్లో 1923, హనుమకొండ జిల్లాలో 11 మండలాలకు చెందిన 4424, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఏడు మండలాల్లో 264, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23 మండలాల్లో 2125 మంది, ఖమ్మం జిల్లాలో 21 మండలాల్లో 4174, ములుగు జిల్లాలో 9 మండలాలకుగాను 572 మంది దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 28698 మంది ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోగా, 22554 మంది ఉదరఖాస్తులను ఆమోదించారు. ఇందులో పురుషులు 13498, మహిళలు 9056 మంది ఉన్నారు.

2019లో తుది జాబితాలో 20888 మంది ఓటర్లు

2019లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 12 జిల్లాలకుగాను 191 మండలాల్లో 20888 మంది ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం ఈ ఏడాది 22554 దరఖాస్తులను ఆమోదించారు.

టైగర్ రిజర్వులో గ్రామాల తరలింపు పకడ్బందీగా చేపట్టండి



- కవ్వాల్, అమ్రాబాద్ టైగర్ రిజర్వులు రాష్ట్రానికి ప్రత్యేకం
- ప్రజలకు విశ్వాసం కల్పించేలా పునరావాస చర్యలుండాలి
- అక్కమహాదేవి గుహలకు భూ, జలమార్గాల్లో యాత్రపై పరిశీలించండి
- సలేశ్వరం జాతరను అటవీశాఖ సర్క్యూట్‌లో చేర్చేలా కార్యాచరణ చేపట్టండి
- వన్యప్రాణుల దాడుల్లో మరణించిన వారికి పరిహారం రూ.20 లక్షలకు పెంపుపై పరిశీలన : సమీక్షలో మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల పరిధిలోని గ్రామాల తరలింపు ప్రక్రియ భావోద్వాగాలతో ముడిపడి ఉందనీ, ప్రభుత్వం పట్ల ప్రజలకు విశ్వాసం కలిగేలా పునరావాస ప్రక్రియను చేపట్టాలని అధికారులను రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. ఉత్తర, దక్షిణ సరిహద్దులుగా విస్తరించిన అవి మన రాష్ట్రానికి ప్రత్యేకతను చేకూర్చాయన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వుల గవర్నింగ్ బాడీల సమావేశాన్ని నిర్వహించారు. అందులో ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, వెడ్మా బొజ్జు, ఆర్. భూపతిరెడ్డి, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ (హెచ్‌ఓఎఫ్ఎఫ్) ఆర్ఎం.డోబ్రియాల్, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలూసింగ్, డీసీసీఎఫ్ ఆంజనేయులు(హెడ్ ఆఫీస్), ఓఎస్డీ శంకరన్, సీఎఫ్, ఎఫ్‌డీపీటీ రాంబాబు (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్), సీఎఫ్, ఎఫ్ డిపిటి శాంతారాం (కవ్వాల్ టైగర్ రిజర్వ్), డిఎఫ్ఓలు రోహిత్ (నాగర్ కర్నూల్), బాజీరావ్ పాటిల్ (ఆదిలాబాద్), రాజశేఖర్ (నల్లగొండ), శివాశిష్(మంచిర్యాల్), ఎఫ్‌డిఓ రామ్మూర్తి(మున్ననూర్) తదితరులు పాల్గొన్నారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు సంబంధించిన వివరాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రాజెక్టు డైరెక్టర్, డీఎఫ్ఓలు వివరించారు. దాని పరిధిలో 26 కోర్ (కేంద్రీకృత) గ్రామాలుండగా నాలుగు గ్రామాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామని వివరించారు. ఆ రిజర్వు పరిధిలోని 20 శాతం ప్రాంతాన్ని పర్యాటక అవసరాలకు వినియోగిస్తున్నామనీ, మన్ననూర్, మద్దిమడుగు, సోమశిల, దోమలపెంట ఎకో టూరిజం సర్క్యూట్లలో ప్రస్తుతం పర్యాటక సేవలు అందిస్తున్నామని చెప్పారు. స్థానికులకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు.

సోమశిల, అమరగిరి, దోమలపెంట-శ్రీశైలం ఎకో టూరిజం సర్క్యూట్‌లను రాబోయే రోజుల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. అమ్రాబాద్ టైగర్ రిజర్వు దేశంలోనే అతిపెద్ద రెండో కోర్ ఏరియా రిజర్వుగా గుర్తింపు పొందటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. పులుల ఆహారలభ్యతకు అనుగుణంగా జింకల సంఖ్యను పెంచిన అధికారులను ప్రశంసించారు. పట్టుపురుగుల పెంపకంపై స్థానికులకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను కల్పించాలని సూచించారు. దోమలపెంట-శ్రీశైలం ఎకో టూరిజం సర్క్యూట్‌లో భాగంగా అక్కమహాదేవి గుహలకు భూ, జలమార్గాల్లో యాత్రా సౌకర్యం కల్పించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. తెలంగాణ అమర్‌నాథ్‌గా ప్రసిద్ధిగాంచిన సలేశ్వరం జాతరకు వెళ్లేందుకుగానూ మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.

వన్యప్రాణుల దాడుల ఘటనల్లో మరణించిన వారికిచ్చే నష్టపరిహారాన్ని రూ. 10 లక్షల నుంచి రూ. 20 లక్షలకు పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌కు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ప్రాజెక్టు డైరెక్టర్ శాంతారాం వివరించారు. ఆ రిజర్వు పరిధిలో తొలి విడత కింద మైసంపేట్, రాంపూర్ గూడేలను ఖాళీ చేయించామని తెలిపారు. పునరావాసం కోసం తరలించిన కుటుంబాలకు శాశ్వత పట్టాలందిం చాలనీ, రాకపోకల నిమిత్తం గ్రీన్ పాసులు ఇవ్వాలని మంత్రిని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు కోరారు. స్కూల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అటవీ ఉత్పత్తులు సేకరించే స్థానికులపై మానవత్వం చూపాలని సూచించారు.

దేశంలో అగ్రగామిగా తెలంగాణ మత్స్యశాఖ

- ఉత్తమ అంతర్గత మత్స్యకారుల జాతీయ అవార్డు రావటం గర్వకారణం : మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 2024 సంవత్సరానికి గాను ఉత్తమ అంతర్గత మత్స్యకారుల జాతీయ అవార్డును గెలుచుకోవటం గర్వంగా ఉందని మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, డైరెక్టర్ ప్రియాంక అల తెలిపారు. మత్స్యశాఖ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, అభివృద్ధి దృష్టికోణాన్ని గుర్తించి, ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా కేంద్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారని పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి వారు శుక్రవారం అధికారికంగా అందించారు. తెలంగాణ మత్స్యశాఖ దేశంలో అగ్రగామిగా నిలిచింది. రాష్ట్రంలో 5,901 మత్స్య సహకార సంఘాలు 4,13,120 సభ్యులతో పనిచేస్తున్నాయి. డిసెంబర్ 2023 నుంచి 225 కొత్త సంఘాలను ఏర్పాటు చేసి, 8,069 కొత్త సభ్యులను చేర్చడం ద్వారా సహకార సంఘాల విస్తరణను బలోపేతం చేసింది. బీమా పథకంలో భాగంగా 4.16 లక్షల మత్స్యకారుల జీవితాలను కాపాడటానికి రూ.139.77 లక్షల ప్రీమియం చెల్లించి ఆదర్శంగా నిలిచింది. కొత్త మత్స్య కుంటల నిర్మాణం కోసం రూ.2145.44 లక్షల వ్యయంతో 195.94 హెక్టార్లకు అనుమతులు మంజూరు చేసింది. మంచిర్యాల జిల్లా ఎల్లంపల్లి జలాశయం వద్ద కొర్రమీను చేపల సంరక్షణ కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఐసీఏఆర్-సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫ్రెష్‌వాటర్ అక్వాకల్చర్ (సీఐఎఫ్ఏ) సహకారంతో ఏర్పాటు చేయనున్నారు. రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో ఆధునిక మత్స్య మార్కెట్ నిర్మాణం జరుగుతోంది. "ఇందిరా మహిళ శక్తి" పథకంలో 32 మొబైల్ ఫిష్ రిటైల్ అవుట్‌లెట్లను 60శాతం సబ్సిడీతో మహిళా సంఘాలకు అందచేయనున్నది. ఈ ఏడాది 4.56 లక్షల టన్నుల మత్స్య ఉత్పత్తితో రూ.7059.04 కోట్ల ఆదాయాన్ని సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మత్స్యరంగం కీలక పాత్ర పోషించింది. ఈ విజయాలతో మన రాష్ట్రం దేశంలో మత్స్యరంగంలో నూతన ఒరవడులను సృష్టించి అగ్రస్థానంలో నిలిచింది.

హైకోర్టు తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు

- మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహబూబాబాద్‌లో మహాధర్నాకు అనుమతిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు సీఎం రేవంత్ రెడ్డికి చెంపపెట్టు అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రేవంత్ రెడ్డి రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. సీఎం సొంత నియోజకవర్గంలో లగచర్లలో రైతులు తిరగబడటంతో సీఎం ఖంగు తిన్నారనీ, రాష్ట్రమంతా చర్చించుకుంటున్నారని తెలిపారు. ఫార్మా విలేజ్‌ను రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. 25న మహబూబాబాద్‌లో గిరిజన, దళిత రైతులతో మహాధర్నా చేపడుతున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం భూములు తీసుకున్నా.. గిరిజనులకు నష్టపరిహారం ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రయివేటు కంపెనీల కోసం రేవంత్ రెడ్డి పేద రైతుల వద్ద భూములు లాక్కుంటున్నారని విమర్శించారు. ఫార్మాకు కేటాయించిన భూములను ఫోర్త్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. అరెస్టులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పోచం పల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్‌లో పోలీసులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉంటున్నదని తెలిపారు. 144 సెక్షన్ ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. మాజీ ఎంపి మాలోత్ కవిత మాట్లాడుతూ లగచర్లలో గిరిజనులపైన దౌర్జన్యకాండకు నిరసనగా ధర్నా నిర్వహించాలని నిర్ణయించినచ్చు చెప్పారు. అన్ని గిరిజన సంఘాల ఆహ్వానం మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధర్నాకు వస్తున్నారని తెలిపారు.

త్వరలో కాంగ్రెస్‌లోకి చేరికలుంటాయి

- టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పార్టీ ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు వెలుడిన నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ స్పందించారు. కాంగ్రెస్‌లోకి త్వరలో చేరికలుంటాయని తనను కలిసి విలేకర్లతో చెప్పారు. బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్‌కు అత్యంత సన్నిహితగా ఉన్న ఎమ్మెల్యేలు సైతం తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. పార్టీ ఫిరాయింపులను తొలుత ప్రోత్సహించింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు.

సాగర్ అదానీయే కీలకం

రూ. వేల కోట్ల ముడుపుల యవ్వారం ఆయన మొబైల్ ఫోన్లోనే : రాయిటర్స్



న్యూఢిల్లీ : భారత అపర సంపన్నుడు అదానీ, ఆయన మేనల్లుడు సాగర్‌తో పాటు మరో ఆరుగురిపై మోసం, లంచం ఆరోపణలపై అమెరికాలో కేసు నమోదైంది. అయితే, ఈ వ్యవహారంలో సాగర్ అంబానీనే కీలకంగా వ్యవహరించాడని తెలుస్తున్నది. లంచాలకు సంబంధించి ఎవరికి ఎంత ఇవ్వాలన్న సమాచారాన్ని ఆయన తన ఫోన్లో డాక్యుమెంట్ చేసి పెట్టుకున్నాడని సమాచారం. ఈ విషయాన్ని ప్రముఖ న్యూస్ ఏజెన్సీ రాయిటర్.. కోర్టు ఫైలింగ్స్ ఆధారంగా పేర్కొన్నది. తరచూ వాట్సప్ సందేశాల్లో ఇది ఉన్నదని వివరించింది. యూఎస్ ప్రాసిక్యూటర్లు దీనిని 'బ్రైబ్ నోట్స్'గా ఆరోపించారు.

ఎవరీ సాగర్ అదానీ?

భారత సంపన్న కుటుంబంలో పుట్టిన సాగర్ అదానీ(30).. గౌతమ్ అదానీకి మేనల్లుడు. అదానీ గ్రూపులో ఆయన కీలకంగా ఉన్నాడు. 2015లో అదానీ గ్రూపులో చేరాడు. ఆ తర్వాత అనతి కాలంలోనే సంస్థలో అనేక ర్యాంకులను అధిరోహించాడు. ముఖ్యంగా, అదానీ గ్రీన్ ఎనర్జీ విషయంలో వ్యూహాలు, ఆర్థిక వ్యవహారాల్లో ఆయన కీలకంగా ఉన్నారు. అయినప్పటికీ, ఆయన పేరు బయటకు అంతగా వినబడేది కాదు. అయితే, ప్రస్తుత వ్యవహారంలో ఆయన పేరు బయటకు రావటంతో సాగర్ అదానీ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఆర్థిక వ్యవహారాల్లోనూ అయన కీలకంగా వ్యవహరించేవాడని తెలుస్తున్నది.

గౌతమ్ అదానీతో అత్యంత దగ్గరగా పని చేశాడనీ, పవర్ కంపెనీలతో సమావేశాలకు హాజరయ్యేవాడనీ, సీనియర్ ఎగ్జిక్యూటీవ్‌లతో ముడుపుల గురించి చర్చించేవాడని కోర్ట్ ఫైలింగ్స్ ప్రకారం రాయిటర్స్ పేర్కొన్నది.

అమెరికాలో మదుపర్లను మోసం చేయటం, భారత్‌లో అధికారులకు ముడుపులు ఇవ్వజూపటం వంటి ఆరోపణల విషయంలో గౌతమ్ అదానీ, సాగర్ అదానీలపై యూఎస్ అరెస్ట్ వారెంట్‌ను జారీ చేసిన విషయం విదితమే. గురువారం ఆరోపణలు వచ్చిన తర్వాత వాటిని కొట్టిపారేసిన అదానీ గ్రూపు.. న్యాయపరంగా ముందుకు వెళ్తామని చెప్పింది. అయితే, అరెస్ట్ వారెంట్ జారీ కావటంతో అదానీ వ్యవహారం ఆసక్తికరంగా మారిందని విశ్లేషకులు చెప్తున్నారు.



అదానీ సంక్షోభాన్ని అధిగమిస్తాం వైట్‌హౌస్

వాషింగ్టన్ : భారత్, అమెరికా మధ్య సంబంధాలు బలమైన పునాదులపై నిర్మించబడ్డాయని వ్యాఖ్యానిస్తూ భారత్ శతకోటీశ్వరుడు గౌతమ్ అదానీపై వచ్చిన ముడుపుల వ్యవహారాన్ని అధిగమిస్తామని వైట్‌హౌస్ విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. అదానీపై అమెరికా కోర్టులో నమోదైన అభియోగ పత్రంపై స్పందించాల్సిందిగా కోరగా వైట్‌హౌస్ పత్రికా కార్యదర్శి కరినె జేన్ పియర్రె గురువారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అదానీపై వచ్చిన ఆరోపణల గురించి ప్రభుత్వానికి తెలుసా అని ప్రశ్నించగా తెలుసునని చెప్పారు. ఈ విషయంలో తాను చెప్పగలిగేది ఒక్కటేనన్నారు. భారత్, అమెరికాల మధ్య ధృఢమైన బంధం వుందని అన్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య నెలకొన్న సంబంధాలు, పలు అంతర్జాతీయ అంశాలపై సహకారం పునాదిగా ఈ బంధం ఏర్పడిందన్నారు. ఈ సంక్షోభం నుండి గట్టెక్కగలమని తాము విశ్వసిస్తున్నట్లు పియర్రె చెప్పారు.

అదానీ లంచాలపై నాన్చుడే!



(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి గతేడాది అమెరికన్ రీసెర్చ్ సంస్థ హిండెన్‌బర్గ్ విడుదల చేసిన రిపోర్ట్‌పైనా సెబీ పక్షపాత విచారణ జరిపిందనే తీవ్ర విమర్శలను ఎదుర్కొంది. అదే తరహాలో ఇప్పుడు కూడా అదానీ గ్రీన్ ఎనర్జీ ముడుపుల వ్యవహారంపై విచారణ సాగే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తం అవుతోన్నాయి. భారత్‌లో సౌర విద్యుత్ కాంట్రాక్టుల కోసం అదానీ రూ.2వేల కోట్ల పైగా లంచాలు ఇచ్చారని అమెరికన్ కోర్టులో అభియోగాలు నమోదయిన విషయం తెలిసిందే.

దీనిపై పెట్టుబడుల రెగ్యూలేటర్ సెబీ రహస్య విచారణను చేపట్టే అంశాన్ని పరిశీలిస్తుందని జాతీయ మీడియాలో రిపోర్టులు వస్తున్నాయి. అదానీ గ్రూప్ నిబంధనలను ఉల్లంఘించిందా లేదా అనే దానిపై విచారణ చేయనుందని ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వ్యక్తులు పేర్కొన్నట్టు బ్లూమ్‌బర్గ్ రిపోర్ట్ చేసింది. అదానీ ముడుపుల అభియోగంపై ప్రాథమిక నిజనిర్ధారణ ప్రక్రియ రెండు వారాల పాటు కొనసాగుతుందని, ఆ తర్వాత అధికారికంగా దర్యాప్తు ప్రారంభించాలని సెబీ భావిస్తోన్నట్లు తన పేరు చెప్పుకోవడానికి ఆసక్తి చూపని ఓ అధికారి పేర్కొన్నారు.భారత్‌లో ఇంధన ప్రాజెక్టులను తమకు అనుకూల విధానాలతో అదానీ కంపెనీలు, ఆ సంస్థ ఛైర్మన్ పొందుతున్నారని.. ఇందులో అధికారుల ప్రమేయం కూడా ఉందని మార్చి 15న బ్లూమ్‌బర్గ్ న్యూస్ రిపోర్ట్ చేసింది. దీనిపై మార్చి 19న అదానీ గ్రీన్ ఖండనను విడుదల చేస్తూ.. తాము ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని ప్రకటించింది. బుధవారం అమెరికా కోర్టులో దీనిపై అభియోగాలు నమోదు కావడం గమనార్హం.

అదానీ కంపెనీల పరపతికి కోత

అదానీ మోసాలపై అంతర్జాతీయ ఏజెన్సీలు మాత్రం నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మూడు అదానీ గ్రూప్ సంస్థల పరపతికి గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పి కోత పెట్టింది. అదానీ ఎలక్ట్రిసిటీ, అదానీ పోర్ట్స్‌కు ప్రతికూల రేటింగ్‌ను ఇచ్చింది. ఈ రెండు కంపెనీల రేటింగ్‌ను బిబిబి మైనస్‌కు తగ్గించినట్టు పేర్కొంది. అదానీ గ్రీన్ ఎనర్జీకి కూడా నెగిటివ్ రేటింగ్‌ను ఇచ్చింది. ఇంతక్రితం వీటికి బిబి ప్లస్ రేటింగ్ ఉంది. ఎస్అండ్‌పి తాజా నిర్ణయంతో ఆయా కంపెనీలకు నిధుల సమీకరణ క్లిష్టంగా మారనుంది. అదానీ గ్రూపు కంపెనీల డైరెక్టర్ల బోర్డుల్లో సీనియర్ మేనేజ్‌మెంట్ (సిఇఒలతో సహా)లో అదానీ కుటుంబ సభ్యులు ఉండటం వల్ల వారు వ్యాపార వ్యూహం, వృద్ధి ప్రణాళికలు, ఆర్థిక విధానాలు, రిపోర్టింగ్, నిర్వహణ అంశాలను గణనీయంగా ప్రభావితం చేయగలరని ఎస్అండ్‌పీ పేర్కొంది. వివిధ గ్రూప్ కంపెనీలు ట్రెజరీ, ఫైనాన్స్, టెక్నికల్ విభాగాలలో ఒకే రకమైన సమాచారాన్ని పంచుకుటున్నాయని విమర్శించింది. ఇది అదానీ గ్రూపు సంస్థల నిర్వహణ, పాలనపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతున్నాయని తెలిపింది. అదానీ లంచాలపై ఆరోపణలు రుజువైతే, అది కాలక్రమేణా కంపెనీ కార్యకలాపాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని ఎస్అండ్‌పీ పేర్కొంది.

అమెరికా కంటే భారత్‌కే ఎక్కువ ఆసక్తి వుండాలి

- తక్షణ దర్యాప్తు అవశ్యం
- అదానీ కేసుపై పలు పత్రికల సంపాదకీయాల వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : అదానీ కేసు విచారణపై అమెరికా కన్నా భారతదేశమే ఎక్కువ ఆసక్తి చూపాలని, చొరవ తీసుకోవాలని పలు జాతీయ మీడియాలు తమ సంపాదకీయాల్లో పేర్కొన్నాయి. తక్షణమే ఈ అభియోగాలపై దర్యాప్తు చేపట్టాల్సిన ఆవశ్యకతను ముక్త కంఠంతో స్పష్టం చేశాయి. సౌర విద్యుత్ కాంట్రాక్టులను దక్కించుకోవడం కోసం గౌతమ్ అదానీతో పాటు ఆ గ్రూప్‌నకు చెందిన మరో ఆరుగురు ఎగ్జిక్యూటివ్‌లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వ్యక్తులకు రూ.2.029 కోట్ల ముడుపులు ఇవ్వజూపడం లేదా ఇస్తామని వాగ్దానం చేయడం వంటివి జరిగాయని అమెరికా న్యాయశాఖ అక్కడి కోర్టుకు తెలిపింది. ఇందుకు సంబంధించి 54పేజీల నేరాభియోగపత్రాన్ని న్యాయవాదులు కోర్టులో దాఖలు చేశారు.

ఈ కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ప్రభుత్వ సౌర విద్యుత్ కాంట్రాక్టులపై తాజా వివాదం రేగింది. అదానీతో ప్రధాని మోడీ సంబంధాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి.

ఈ నేపథ్యంలో అదానీ చుట్టూ రేగిన వివాదంపై పత్రికల సంపాదకీయాలు ఏమన్నాయో చూద్దాం :

అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్ఛేంజ్ కమిషన్ (ఎస్ఇసి) అభియోగాలు, నిధుల సమీకరణపై గల ప్రభావాల దృష్ట్యా ఈసారి అదానీలు మరింత క్లిష్టమైన సమయాన్ని ఎదుర్కొనాల్సి వుంటుందని టైమ్స్ ఆఫ్ ఇండియా తన సంపాదకీయంలో పేర్కొంది. చాలా తక్కువ సమయంలోనే ఇన్ని వివాదాల్లో ఒక బడా కార్పొరేట్ సంస్థ చిక్కుకోవడం చాలా అరుదని వ్యాఖ్యానించింది. పలు దేశాల్లో కార్యకలాపాలు నిర్వహించే అదానీ గ్రూపు వంటి సంస్థకు అంతర్జాతీయంగా ఇది మంచిది కాదని పేర్కొంది. సమీప భవిష్యత్తులో అమెరికాలో ఈ సంస్థ నిధులు సమీకరించడం ఇక క్లిష్టతరమవుతుందని వ్యాఖ్యానించింది. భారత్‌లో కూడా ఈ గ్రూపు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిన వారు మరోసారి తీవ్రంగా దెబ్బ తిన్నారు. దీంతో స్వదేశంలో ఈ గ్రూపు పట్ల ఇన్వెస్టర్లు, రుణదాతల్లో కచ్చితంగా ఒక అప్రమత్తత నెలకొంటుంది. వివిధ రంగాల్లో మౌలిక వసతుల రూపకల్పన,నిర్మాణ కార్యకలాపాలే అదానీ కీలక వ్యాపారమైనందున వీటికి నిధుల దాహం కూడా అధికమే, అందువల్ల పెద్ద మొత్తంలో నిధుల సమీకరణ కోసం ఆధారపడక తప్పదు. అయితే విదేశాల్లో బిజినెస్ చేయాలనుకుంటున్న అమెరికన్ కంపెనీలకు సక్రమంగా లేదంటూ ఎఫ్‌సిపిఎ (విదేశీ అవినీతి కార్యకలాపాల నిరోధక చట్టం) ను రద్దు చేయాలని ట్రంప్ తన మొదటి పదవీ కాలంలోనే భావించారు. ఇక ట్రంప్ తన తాజా పదవీ కాలంలో ఈ రద్దుతో ముందుకు సాగాలనుకోవడం మంచి వ్యూహం కాకపోవచ్చునని వ్యాఖ్యానించింది.

ఈ అభియోగాల్లోని వాస్తవాలను వెలికి తీయడంలో అమెరికా సంస్థల కన్నా భారత సంస్థలే మరింత వేగంగా, ఆసక్తిగా, చొరవ తీసుకుని పని చేయాల్సి వుందని డెక్కన్ హెరాల్డ్ పత్రిక తన సంపాదకీయంలో పేర్కొంది. "ప్రధాని మోడీ, బిజెపి అదానీకి సన్నిహితంగా వున్నప్పటికీ.. ఈ గ్రూపు దుర్వినియోగం అభియోగాల నేపథ్యంలో రక్షణ కల్పించకూడదు. ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తిరస్కరించింది. అయితే మొత్తంగా అభియోగాలన్నింటినీ స్థూలంగా తిరస్కరించడమనేది విశ్వసనీయ ప్రతిస్పందన కాబోదు. అదానీ గ్రూపుపై ఆరోపణలు వచ్చినప్పుడల్లా బిజెపి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థించాలనే చూస్తోంది. కానీ, ఇప్పుడు 'చట్టం తన పని తాను చేసుకుపోతుంది' అని పార్టీ వ్యాఖ్యానిస్తోంది. అయితే అది జరిగేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే వుంది.' అని ఆ సంపాదకీయం పేర్కొంది.

ఈ విషయంపై స్పష్టత రావాలంటే సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ అవసరమని ట్రిబ్యూన్ సంపాదకీయం వ్యాఖ్యానించింది. విచారణ చేపట్టాల్సిన ఆవశ్యకత గురించి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సంపాదకీయం కూడా స్పష్టం చేసింది. భారతీయ మార్కెట్లను దెబ్బతీయడానికి అంతర్జాతీయంగా పన్నిన కుట్రలో భాగమే ఇది అంటూ బిజెపి ప్రతినిధి వ్యాఖ్యానించడం చూస్తుంటే భారతీయ ఇన్వెస్టర్ల తెలివితేటలను అవమానించడమే అవుతుందని పేర్కొంది. ముడుపులు ఇతరులకు అందాయా లేదా, సెబీ కేవలం ఒక సాధనంగా మాత్రమే వుందా లేదా అన్న విషయాలను భారత పౌరులు కచ్చితంగా తెలుసుకోవాల్సి వుందని ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ సంపాదకీయం పేర్కొంది.

ప్రముఖంగా ఫ్రంట్ పేజీల్లో ఆంగ్ల పత్రికల పతాక శీర్షికలు

ప్రపంచ కుబేరుల్లో ఒకరైన గౌతమ్ అదానీపై అమెరికా న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలైన వార్తను దేశవ్యాప్తంగా పలు ఆంగ్ల దినపత్రికలు ప్రముఖంగా ఫ్రంట్ పేజీలో ప్రచురించాయి. 'అమెరికా సౌర తుపానులో చిక్కుకున్న అదానీ' అనే పతాక శీర్షికతో ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ ఈ వార్తను ప్రముఖంగా ఇచ్చింది. ఈ పరిణామాలతో అదానీ గ్రూపు స్టాక్‌లు ఎలా భారీగా పతనమయ్యాయో, మార్కెట్‌లో రూ.26లక్షల కోట్లు కంపెనీ నష్టపోయిన వైనాన్ని వివరించింది. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతి బాగోతాన్ని కూడా ఇచ్చింది.

'సౌర విద్యుత్ కుంభకోణం దర్యాప్తులో అదానీని అభిశంసించిన అమెరికా' అనే శీర్షికతో మింట్ ఈ వార్తను ప్రముఖంగా ఇచ్చింది. అదానీ ఇచ్చిన ముడుపుల వివరాలను కూడా ఇచ్చింది. అలాగే ఈ ఆరోపణలకు ప్రతిగా తాము చట్టపరమైన మార్గాలను అన్వేషిస్తామంటూ అదానీ గ్రూపు చేసిన ప్రకటన కూడా ఇచ్చింది.

టెలిగ్రాఫ్ తనదైన శైలిలో హెడ్డింగ్‌ను 'జస్టిస్ ఫర్ అ(ల్)దాని' అని పెట్టింది. బిజెపిని గౌతమ్ గ్లాడియేటర్స్‌గా వ్యాఖ్యానించింది.

'అదానీ, ఆయన మేనల్లుడుపై అమెరికాలో అరెస్టు వారంట్లు' అన్న శీర్షిక ట్రిబ్యూన్‌లో వచ్చింది. 'అదానీని కదిలించిన అమెరికా అభియోగాలు' అన్న శీర్షికతో ఎకనామిక్ టైమ్స్ వార్త ఇచ్చింది. విదేశాల్లో నిధులు సమీకరించడం ఈ గ్రూపునకు కష్టమైందని వ్యాఖ్యానించింది.

విద్యుత్ రంగంలో 'విధానపరమైన అవినీతి'

పబ్లిక్ సెక్టార్, పబ్లిక్ సర్వీసెస్ పీపుల్స్ కమిషన్ ఆందోళన

కేంద్రం నిర్ణయాలతో వినియోగదారులపై భారాలు, ప్రయివేట్ సంస్థలకు లాభాలు : సమగ్ర విచారణకు డిమాండ్

న్యూఢిల్లీ : విద్యుత్ రంగంలో విధానపరమైన అవినీతిపై పీపుల్స్ కమిషన్ ఆన్ పబ్లిక్ సెక్టార్ అండ్ పబ్లిక్ సర్వీసెస్ (పీఎస్‌పీఎస్‌పీఎస్) ఆందోళన వ్యక్తం చేసింది. అదానీ గ్రీన్‌తో సహా అనేక కంపెనీలు భారత సోలార్ పవర్ ప్రాజెక్టుల్లో వేల కోట్ల లంచాలు వెదజల్లాయనే ఆరోపణలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయని పేర్కొంది. భారత విద్యుత్ రంగానికి చెందిన అధికారులు, కార్పొరేట్ ప్రతినిధులు బాధ్యతాయుతంగా ఉండాలని విజ్ఞప్తి చేసింది. ఈ అవినీతిపై సమగ్ర విచారణ చేసిన ఆరునెలల్లో పార్లమెంట్ ముందు ఉంచాలని డిమాండ్ చేసింది. ఈమేరకు పీఎస్‌పీఎస్‌పీఎస్ శుక్రవారం ఒక మీడియా ప్రకటన విడుదల చేసింది. అదానీ గ్రూపుపై అమెరికాలో నమోదైన కేసు కార్పొరేట్ అవినీతి గురించి మాత్రమే కాకుండా ఎంత మోసపూరిత విధానాలను అవలంభిస్తున్నారో అనే విషయాన్ని కూడా పేర్కొందని తెలిపింది. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ అనుసరిస్తున్న వ్యాపార విధానాలు దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ వినియోగదారులను ఎంతగానో మోసం చేస్తున్నాయని విమర్శించింది.ఈ అవినీతికి దారితీసిన పరిస్థితులపై స్వతంత్ర న్యాయపరమైన పర్యవేక్షణలో సీబీఐ, ఈడీ, సీబీడీటీ వంటి దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ జరిపించాలని, యూఎస్ ఎస్ఈసీ, ఎఫ్‌బీఐ నుంచి సాక్ష్యాధారాలను సేకరించాలని డిమాండ్ చేసింది. కేంద్ర విద్యుత్ శాఖ ఇటువంటి తప్పుదారి పట్టించే విధానాలను అవలంబించడం, రాష్ట్రాలకు చట్ట విరుద్ధమైన ఆదేశాలు జారీ చేయడం, ఇందులో భారత బడా వ్యాపారుల పాత్ర, వారు ఎంత లాభం పొందారు?, పీపీఏల ఏకపక్ష విధానం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర, దేశంలో విద్యుత్ వినియోగదారులకు ఎంత నష్టం జరిగింది?, అనే అంశాలపైనా దర్యాప్తు చేయాలని కోరింది. అమెరికా నమోదు చేసిన కేసులో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత నాయకులు, అధికారులు, వ్యాపారులు, ప్రమోటర్లు భారతదేశ విద్యుత్ రంగంలో కార్యాకలాపాలు చేపట్టకుండా బ్లాక్ లిస్ట్ చేయాలని పీఎస్‌పీఎస్‌పీఎస్ డిమాండ్ చేసింది. కేంద్ర విద్యుత్ శాఖ 2003 విద్యుత్ చట్టంలోని సెక్షన్ 11ను ఏ విధంగా ఉల్లంఘిస్తుందో, దుర్వినియోగం చేస్తుందో గతంలో తాము విడుదల చేసిన 2022 జూన్ 2, జూన్ 30, ఈ ఏడాది ఆగస్టు 16న విడుదల చేసిన ప్రకటనల్లో పదేపదే ఎత్తిచూపామని పీఎస్‌పీఎస్‌పీఎస్ గుర్తు చేసింది. సౌర విద్యుత్ కేంద్రాల నుంచి రాష్ట్రాలు తమ మొత్తం విద్యుత్ అవసరాల్లో 10 శాతాన్ని కొనుగోలు చేయాలని కేంద్రం ఆదేశించిందని, రాష్ట్రాలు తమ ఆర్థిక స్థితి, యూనిట్ ధర వంటి అంశాలతో సంబంధం లేకుండా ఈ కొనుగోలు బాధ్యతను నిర్దేశించిందని పీఎస్‌పీఎస్‌పీఎస్ విమర్శించింది. కేంద్రం దేశవ్యాప్తంగా కావాలనే బొగ్గు పరిస్థితిని సృష్టించి, బొగ్గు కొరతను ఎదుర్కొవడానికి విదేశీ సంస్థల నుంచి బొగ్గును కొనుగోలు చేయాలని రాష్ట్రాలను ఆదేశించిందని గుర్తుచేసింది. కేంద్రం తీసుకున్న ఈ రెండు చర్యలు దేశవ్యాప్తంగా వినియోగదారులపై ఆర్థిక భారం మోపడమే కాకుండా, అధికార పార్టీకి సన్నిహితంగా ఉండే కొన్ని దేశీయ ప్రయివేట్ వ్యాపార సంస్థలకు ప్రయోజనం చేకూర్చాయని విమర్శించింది.

సోలార్‌లో అగ్రగామిగా సన్‌టెక్ ఎనర్జీ

'సన్‌టెక్' ట్రూజోన్ సోలార్‌కు ప్రచారకర్తగా సూపర్‌స్టార్ మహేశ్‌బాబు

ఉజ్వల భవిష్యత్ అందించే లక్ష్యం

నవతెలంగాణ-సిటీబ్యూరో

భారతదేశ సోలార్ ఎనర్జీ సెక్టార్లో 2008 నుంచి అగ్రగామిగా కొనసాగుతున్న సన్‌టెక్ ఎనర్జీ సిస్టమ్స్ ప్రయివేటు లిమిటెడ్‌కు సూపర్ స్టార్ మహేష్ బాబు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నారు. అత్యాధునిక పునరుత్పాదక ఇంధన వనరులను ప్రోత్సహించడంలో భాగంగా కంపెనీ నూతన బ్రాండ్ 'ట్రూజోన్ సోలార్' కోసం మహేశ్ బాబు ప్రచారం చేయనున్నారు. ఉజ్వలమైన, పచ్చటి భవిష్యత్ కోసం సౌరశక్తిని అందించేందుకు సన్‌టెక్ ఎనర్జీ లక్ష్యంగా ముందుకెళ్తోంది. పర్యావరణ ప్రేమికుడైన సినీ హీరో మహేశ్‌బాబుతో కలిసి భారతీయ సోలార్ మార్కెట్లో తన వ్యాపారాన్ని విస్తరించాలనుకుంది. భారతదేశ పునరుత్పాదక ఇంధన వనరుల్లో వచ్చే ఐదేండ్లలో 10రెట్లు వృద్ధిని సాధించాలని 'సన్‌టెక్' లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా ఇటీవల మహేశ్‌బాబుతో ఈ బ్రాండ్ తొలి కమర్షియల్ యాడ్ షూటింగ్ పూర్తయింది. ఈ యాడ్ షూటింగ్‌కు చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి దర్శకత్వం వహించారు. కంపెనీ ఇప్పటికే నివాస గృహాలు, పరిశ్రమలు, వాణిజ్య సంస్థల వినియోగదారులకు రెండు లక్షలకు పైగా సోలార్‌ను అందిస్తోంది. ఆన్‌గ్రిడ్, హైబ్రిడ్ రూఫ్‌టాప్, గ్రౌండ్‌మౌంటెడ్ సోలార్ సిస్టమ్స్, అనుబంధ ఉత్పత్తుల్లో అగ్రగామిగా నిలిచింది.

భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయోగం

పర్యావరణానికి, సుస్థిరాభివృద్ధికి కృషిచేస్తున్న సన్‌టెక్ ఎనర్జీ ప్రయివేటు లిమిటెడ్ వారి 'ట్రూజోన్ సోలార్'కు పనిచేయడం ఎంతో గౌరవంగా ఉందని హీరో మహేశ్ బాబు అన్నారు. భవిష్యత్ తరాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సన్‌టెక్ ఎనర్జీ సంస్థ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ సిహెచ్.భవానీ సురేశ్ మాట్లాడుతూ.. సూపర్ స్టార్ మహేశ్‌బాబు భాగస్వామ్యంతో సోలార్ రంగంలో 'ట్రూజోన్ సోలార్' సౌరశక్తి వినియోగంపై ప్రజలకు విస్తృతమైన అవగాహన ఏర్పడుతుందన్నారు. ప్రపంచస్థాయిలో సౌరశక్తిని విస్తరించాలనే తమ నిబద్ధతను మరింత బలపరుస్తుందన్నారు. నాణ్యతతో కూడి, ప్రత్యేక డిజైన్‌తో 'ట్రూజోన్ సోలార్'ను ఏర్పాటు చేశామని, మిగతా పరిశ్రమలకు భిన్నంగా ఉంటుందని ఎండీ తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ ఇన్‌స్టలేషన్‌లో 2025 మార్చి నాటికి దేశంలో అగ్రగామిగా నిలుపుతామన్నారు. మొదటిదశలో మధ్యప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్నాటక, మహారాష్ట్ర మొదలైన రాష్ట్రాల్లో పూర్తిస్థాయిలో కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో తమ డీలర్ల నెట్‌వర్క్‌ను విస్తరిస్తామన్నారు. సౌరశక్తి ఉత్పత్తి చేసే సంస్థలకు ఆర్థిక సహకారం, రాయితీలను అందించే 'పీఎం.సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన' వంటి పథకాలతో 'ట్రూజోన్ సోలార్' ముందుకెళ్తోందన్నారు. వినియోగదారులు తమ సౌర వ్యవస్థల పనితీరు, పొదుపును ఎప్పటికప్పుడూ రిమోట్ విధానంలో పర్యవేక్షించడానికి కంపెనీ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులో తీసుకొస్తుందన్నారు. ట్రూజోన్ సోలార్ ఇప్పటికే 'సన్‌టెక్ రెఫర్ అండ్ ఎర్న్ యాప్'ను ప్రారంభించిందన్నారు. ఈ యాప్ వినియోగదారుల నుంచి ప్రశంసలు పొందుతోందని తెలిపారు.



దుర్భరంగా చేనేత కార్మికుల బతుకులు

- 10న చేనేత కార్మికుల సమస్యలపై సెమినార్ : చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చెరుపల్లి సీతారాములు
- చేనేత కార్మికుల సమస్యలపై అధ్యయన యాత్ర ప్రారంభం

నవతెలంగాణ-హయత్ నగర్

చేనేత కార్మికుల బతుకులు దుర్భరంగా ఉన్నాయని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు చెరుపల్లి సీతారాములు అన్నారు. రంగారెడ్డి జిల్లా మన్సూరాబాద్‌లోని సహారా ఎస్టేట్స్ వద్ద శుక్రవారం గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చేనేత కార్మికుల సమస్యలపై అధ్యయన యాత్ర జీపుజాతను ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత కార్మికుల సమస్యలను తెలుసుకునేందుకు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనం శాంతికుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్, సహాయ కార్యదర్శి నరహరి ఈ పర్యటన చేపట్టినట్టు చెప్పారు. సమస్యలపై అధ్యయనం అనంతరం వచ్చే నెల 10న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెమినార్ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో చేనేత కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి గత ప్రభుత్వం అందించిన సబ్సిడీలు కొనసాగించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే ఇప్పటి వరకు 16 మంది చేనేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని త్రిప్టు, యారన్ పథకాలకు సబ్సిడీలు యథావిధిగా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో రూ.1200 కోట్ల బడ్జెట్ కేటాయిస్తే.. ఈ ప్రభుత్వం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించిందని అన్నారు. హ్యాండ్లూమ్, పవర్ లూంను వేర్వేరు చేయాలని కోరారు. చేనేత కార్మికుల సమస్య పరిష్కారానికి గ్రామాల్లో పర్యటన చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌరవ సలహాదారు కురపాటి రమేష్, పెంటయ్య, కోశాధికారి శేఖర్, సహాయ కార్యదర్శి మూషం నరహరి, జిల్లా అధ్యక్షులు చెరుక స్వామి తదితరులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వమే మన బలం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'భిన్నత్వంలో ఏకత్వం గురించి మాట్లాడతాం. పాటిస్తాం. ఇదే మన బలం. ఇదే మన స్థైర్యం. ఇన్ని భిన్న సంస్కృతులు ఒకేచోట ఉండటం నిజంగా చాలా గొప్ప విషయం. ఇవన్నీ కలిసిన సుందరమైన ఇంద్రధనస్సు లాంటి దేశం మనది. వనవాసి, నగరవాసి అని తేడా లేకుండా మనమంతా భారతవాసులం అనే విషయాన్ని మరవొద్దు' అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పారామంలో లోక్‌మంథన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..దేశ సంస్కృతి, సాంప్రదాయాలను బలోపేతం చేసే గొప్ప కార్యక్రమమని కొనియాడారు. భారతదేశ సంస్కృతి, ఆచార వ్యవహారాలు, మన పరంపర చాలా ఘనమైనవని చెప్పారు. విదేశాల్లో భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పాటిస్తుండటం అభినందనీయమనీ, ఇండొనేషియా సహా వివిధ దేశాల ప్రతినిధులు ఈ వేదిక ద్వారా తమ సంస్కృతిని ప్రదర్శించడాన్ని అభినందిస్తున్నానని అన్నారు. విదేశీ శక్తులు శతాబ్దాలుగా మన దేశం మీద జులూం ప్రదర్శించాయనీ, భారతీయుల మధ్య ఐక్యమత్యాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన తీరును వివరించారు. మనలో బానిస మూలాలను జొప్పించారని చెప్పారు. భారతదేశం బానిసత్వ మూలాలను తొలగించుకునే ప్రయత్నం చేస్తోందనీ, అందులో భాగంగానే రాజ్‌పథ్‌పేరును కర్తవ్యపథ్‌గా, దర్బార్‌హాల్ పేరును గణతంత్ర మండప్‌గా మార్చుకున్నామని తెలిపారు. ఇటీవల.. ఓ హైకోర్టులో మహిళా జడ్జి విగ్రహాన్ని ప్రారంభించారనీ, ఆ విగ్రహం కండ్లకు నల్లని గంతల కట్టకపోవడం మనం సాధిస్తున్న మార్పునకు సంకేతమని చెప్పారు. ఐకమత్యం, సమరసతే మన సభ్యత, మన భవిష్యత్తు అనీ, ఆ దిశగా ప్రతిఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

జాతీయ ఐక్యతకు కుంభమేళా లాంటిది : కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

లోక్‌మంథన్ కార్యక్రమం జాతీయ ఐక్యతకు కుంభమేళా లాంటిదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దేశమే అన్నింటికన్నా శ్రేష్ఠం అనే భావనతో ఆ సంస్థ పనిచేస్తున్నదని చెప్పారు. లోక్ మంథన్‌లో భారతీయ పరంపర, సంస్కృతి, కళలు, ఆదివాసీల జీవనవిధానం, సామాజిక ఐక్య, భారతీయ జ్ఞాన-విజ్ఞాన సంపద, విద్య, వైద్య, విధానం, ఆహార విజ్ఞాన, మందిర విజ్ఞానం, పర్యావరణ పరిరక్షణ, తదితర అంశాలపై లోతుగా చర్చలు జరుగుతున్నాయనీ, దేశ భవిష్యత్తుకి ఈ చర్చలు దోహదపడతాయని ఆకాంక్షించారు. గిరిజన జీవన విధానంపై చర్చ జరగాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు.

తనకై తాను మంచి విద్యార్థి కాలేనివాడు, ఎన్నటికీ మంచి ఉపాధ్యాయుడు కాలేడు - లాలాలజపతిరాయ్

సంపాదకీయం

అదానీ అవినీతి



మోడీకి అత్యంత ప్రియతముడు, అచిర కాలంలోనే అపర కుబేరుడైన గౌతమ్ అదానీ వ్యాపార సామ్రాజ్యాన్ని ఒక భారీ సంక్షోభం చుట్టుముట్టింది. అమెరికా జస్టిస్ డిపార్ట్‌మెంట్, సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (సెక్)లు సివిల్ సెక్యూరిటీల మోసంపై మోపబడిన అభియోగాలపై చేసిన విచారణలో సోలార్ కాంట్రాక్ట్‌ల కోసం ప్రభుత్వ అధికారులకు రూ.2,200 కోట్లకు పైగా చెల్లించినట్టు తేలింది. ఇరవైయేండ్లలో రూ.15వేల కోట్ల పన్ను అనంతర లాభాలను ఆర్జిస్తుందని అంచనా వేయబడిన రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టులను పొందేందుకు ఈ పథకం ఉద్దేశించబడిందని ప్రాసిక్యూటర్లు ఆరోపించారు.

ఈ నేరారోపణలో భారత ప్రభుత్వ అధికారులకు రూ.2,200 కోట్లకు పైగా లంచాలు చెల్లించడం, పెట్టుబడిదారులకు, బ్యాంకులకు అబద్ధాలు చెప్పి అనేక బిలియన్ల డాలర్లను సమీకరించడం, న్యాయాన్ని అడ్డుకోవడం వంటి ఆరోపణలు న్నాయని డిప్యూటీ అసిస్టెంట్ అటార్నీ జనరల్ లిసా మిల్లర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లంచం కేసును క్లుప్తంగా ఇలా వివరించవచ్చు... అదానీ గ్రూప్‌కు చెందిన గ్రీన్ ఎనర్జీ కంపెనీ అమెరికన్ స్టాక్ మార్కెట్లలో లిస్టు అయిన మారిషస్‌కు చెందిన అజూర్ పవర్ అనే కంపెనీతో భాగస్వామిగా ఉంది. భారతదేశంలో సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులను నిర్మించాలనే ప్రణాళికతో అమెరికన్ పెట్టుబడిదారులను పెద్ద ఎత్తున ఆకర్షించి, వారి నుండి రూ.25వేల కోట్లు సేకరించింది. అయితే, సోలార్ విద్యుత్తు ఖరీదైనది కావటంతో ఏ ప్రభుత్వమూ దానిని కొనుగోలు చేయడానికి ఇష్టపడలేదు. దానితో భారతదేశంలో సౌరశక్తి ఒప్పందాలను పొందడంలో సమస్యలు తలెత్తాయి. ఆ సమస్యను పరిష్కరించడానికి భారతదేశంలో రాజకీయ నాయకులకు, బ్యూరోక్రాట్లకు రూ.2,200 కోట్లు లంచంగా ఇచ్చారు. ఈ నగదు అమెరికన్ పెట్టుబడిదారుల నుండి సేకరించిన నిధుల నుండి వచ్చింది. ఇక్కడే అసలు కథ మొదలైంది. కార్పొరేట్ రంగంలో కుంభకోణాలను అరికట్టేందుకు 1977లో ఫారిన్ కరప్ట్ ప్రాక్టీసెస్ యాక్ట్ (ఎఫ్‌సిపిఏ) పేరిట అమెరికా ప్రభుత్వం ఒక చట్టం చేసింది. ఈ చట్టం ప్రకారం అమెరికా పెట్టుబడిదారుల ప్రమేయం వున్న, అమెరికా స్టాక్ ఎక్స్ఛేంజీలలో నమోదైన విదేశీ కంపెనీలు లంచం ఇవ్వటం, ఇస్తామని ఆశ చూపటం, ప్రభుత్వాధినేతలకు, అధికారులకు లంచం ఇవ్వటం నేరం.

> సోలార్ విద్యుత్తు కోసం నిధులను సేకరించిన అదానీ గ్రీన్ ఎనర్జీ, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన అజూర్ పవర్ సహజంగానే ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ కేసును అమెరికా ప్రభుత్వ నేరపరిశోధక సంస్థ ఎఫ్ బి ఐ, మార్కెట్ రెగ్యులేటర్ సెక్ దర్యాప్తు చేసినప్పుడు భారతదేశంలో లంచాలు ఇచ్చినట్టు, అమెరికన్ పెట్టుబడిదారులను మోసం చేసినట్టు తేలింది. దానితో అమెరికన్ డిపార్ట్ మెంట్ ఆఫ్ జస్టిస్ కి చెందిన గ్రాండ్ జ్యూరీ గౌతమ్ అదానీకి, మరో ఏడుగురికి వ్యతిరేకంగా అభియోగాలను దాఖలు చేసి, వారెంట్‌ను జారీ చేసింది. రెండేండ్లుగా కొనసాగుతున్న ఈ దర్యాప్తులో అదానీ భారతదేశ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీని తప్పుదారి పట్టించారని కూడా వెల్లడైంది.

సోలార్ విద్యుత్తు కోసం నిధులను సేకరించిన అదానీ గ్రీన్ ఎనర్జీ, న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన అజూర్ పవర్ సహజంగానే ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ కేసును అమెరికా ప్రభుత్వ నేరపరిశోధక సంస్థ ఎఫ్‌బిఐ, మార్కెట్ రెగ్యులేటర్ సెక్ దర్యాప్తు చేసినప్పుడు భారతదేశంలో లంచాలు ఇచ్చినట్టు, అమెరికన్ పెట్టుబడిదారులను మోసం చేసినట్టు తేలింది. దానితో అమెరికన్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ జస్టిస్ కి చెందిన గ్రాండ్ జ్యూరీ గౌతమ్ అదానీకి, మరో ఏడుగురికి వ్యతిరేకంగా అభియోగాలను దాఖలు చేసి, వారెంట్‌ను జారీ చేసింది. రెండేండ్లుగా కొనసాగుతున్న ఈ దర్యాప్తులో అదానీ భారతదేశ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీని తప్పుదారి పట్టించారని కూడా వెల్లడైంది. ఈ కుంభకోణంలో భాగం ఇచ్చిన లంచంలో సింహ భాగం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రికి చేరినట్టు అమెరికన్ ప్రభుత్వ సంస్థల విచారణలో వెల్లడైంది. గౌతమ్ అదానీ జగన్‌ను స్వయంగా రెండు, మూడు సార్లు కలవడం జరిగిందని, అలా కలిసిన తర్వాత రూ.1750 కోట్లు లంచంగా ఇవ్వటానికి అంగీకారం కుదిరాకే ఒప్పందాలు ఖరారయ్యాయని అదానీ గ్రూపు కంపెనీల అంతర్గత సందేశాలలో వివరణలు ఉన్నట్టు విచారణలో తేలింది. 2023 ప్రారంభంలో వెలువడిన హిండెన్‌బర్గ్ పరిశోధన నివేదిక కంటే తాజా సంక్షోభం ప్రభావం తీవ్రత చాలా ఎక్కువగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. అదానీ గ్రూప్ ఫ్లాగ్‌షిప్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ గురువారం అత్యంత ముఖ్యమైన నష్టాన్ని చవిచూసింది. మార్కెట్ ప్రారంభమైన కొద్దిసేపటికే రూ.61వేల కోట్లు లేదా దాని విలువలో 20 శాతం నష్టపోయింది. గ్రూప్ మొత్తం నష్టాలు రూ.2.60 లక్షల కోట్లకు చేరుకున్నాయి. కెన్యా దేశం అదానీతో చేసుకున్న వ్యాపార ఒప్పందాలన్నీ రద్దు చేసుకుంది.

పార్లమెంటు సమావేశాలు జరుగుతున్నందున, అదానీ గ్రూపుపై మోపబడిన నేరారోపణలకు మోడీ ప్రభుత్వం సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. అదానీ గ్రూపు యాజమాన్యంలో ఓడరేవులు, విమానాశ్రయాలు, విద్యుత్, సిమెంట్ తో సహా అనేక రంగాలు ఉన్నాయి. ఈ పరిశ్రమలకు సంబంధించిన నియంత్రణాధికారులందరూ ఇప్పుడు లేవనెత్తిన ఆరోపణలను పారదర్శకంగా, ఒక నిర్ణీత సమయంలో పరిశోధించాల్సిన అవసరం ఉంది. భారతీయ మార్కెట్లను అణగదొక్కడానికి ఇది ఒక "అంతర్జాతీయ కుట్ర"లో భాగమని బీజేపీ ప్రతినిధి చేసిన వాదన ఎవ్వరినీ ఒప్పించజాలదు. ఇటువంటి వాదన భారత ప్రజల సాధారణ జ్ఞానాన్ని అవమానించడానికే పనికివస్తుంది. అత్యంత ప్రియతమ స్నేహితుడి లంచావతరంపై మోడీ తప్పించుకోవడం ఇప్పుడు సాధ్యం కాదు. ఆదానీని వెంటనే అరెస్టు చేయకపోతే, ఆ అవినీతిలో ప్రభుత్వమూ భాగస్వామి అయినట్లే.


అడ్డగోలు వాదనలు తప్ప 'అచ్చేదిన్' జాడేది?

- సత్య

చిల్లర ద్రవ్యోల్బణం పద్నాలుగు నెలల గరిష్టం అక్టోబరు నెలలో 6.21శాతానికి చేరింది. ఆహార ద్రవ్యోల్బణం అంతకు మించి 15నెలల గరిష్టం 10.87శాతానికి చేరింది. ఏడాది క్రితం అక్టోబరు నెలలో 6.61శాతమే ఉంది. ఈ అంకెలను మోడీని వ్యతిరేకించే వారు చెప్పలేదు, కేంద్ర ప్రభుత్వ జాతీయ గణాంక సంస్థ(ఎన్ఎస్ఓ) వెల్లడించినవే. ప్రతినెల 12వ తేదీన ధరలు, ద్రవ్యోల్బణం సంబంధిత అంశాలను ఎన్ఎస్ఓ విడుదల చేస్తుంది. గతంలో మోడీ మంత్రదండపు విజయగాధలను గానం చేసిన వారు ఇప్పుడు మాట్లాడటం లేదు. దేవునిబిడ్డ అతీంద్రియ శక్తులు ఏమైనాయో తెలియటం లేదు.. పాలకులు, పార్టీలు ఎలాబోతే మనకేం గుల్లవుతున్నది మన జేబులే అనుకోవటం జనంలో ఇప్పుడే ప్రారంభమైనట్లు తాజా లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెల్లడించాయి. సావిత్రీ నీ పతి ప్రాణంబు తప్ప వేరే కోరికలు కోరుకొమ్మని యమ ధర్మరాజు చెప్పాడన్న కథ మాదిరి నరేంద్ర మోడీ గతంలో చెప్పిన వాటిని తప్ప కొత్తకొత్త అంశాలను మాత్రమే జనానికి చెబుతున్నారు. మాటల మాంత్రికుడు మరి. పదేండ్ల క్రితం ధరల పెరుగుదలతో జనాలకు చచ్చే రోజులు దాపురించటాన్ని నరేంద్రమోడీ చక్కగా వినియోగించుకున్నారు. తనకు అధికారమిస్తే అచ్చేదిన్ తెస్తానని చెప్పారు. ఇప్పుడా మాట కలలో కూడా ప్రస్తావించటం లేదు.

తమ మోడీ హయాంలో ద్రవ్యోల్బణం లేదా ధరల పెరుగుదల రేటు తగ్గిందని, అది ఆయన గొప్పతనమే అని భక్తులు పారవశ్యంతో ఊగిపోతారు. 2014 మార్చి నెలలో వినియోగదారుల (వస్తువుల) సాధారణ సూచిక 138.1 ఉంటే 2024 అక్టోబరు నెల అంచనా 196.8గా ఉంది. దీన్ని సులభంగా చెప్పుకోవాలంటే నిత్యావసర వస్తువుల ఒక కిట్ ధర పదేండ్లలో రూ.138.10 నుంచి రూ.196.80కి పెరిగింది. విడివిడిగా అంటే కేవలం ఆహార వస్తువులనే తీసుకుంటే రూ.140.70 నుంచి రూ.209.40కి చేరింది. అచ్చేదిన్ అని నరేంద్రమోడీ చెప్పినపుడు అంతకు ముందున్న ధరలను తగ్గిస్తారని జనం అనుకున్నారు. భజనపరులు ధరల తగ్గింపు అంటే పెరుగుదల రేటు అని టీకా తాత్పర్యాలను చెబుతున్నారు. ఇది వాస్తవమా ? మోడీ తొలిసారి అధికారానికి వచ్చిన సమయంలో మనం దిగుమతి చేసుకొనే ముడి చమురుధరలు ఆకాశాన్నంటాయి. వెంటనే అంతర్జాతీయ మార్కెట్లో పతనంతో దిగుమతి బిల్లు తగ్గి ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. దీన్ని తన విజయంగా చెప్పుకున్నారు. 2014 జనవరి నుంచి 2019 జనవరి వరకు చూస్తే 22 నిత్యావసర వస్తువుల్లో పదింటి ధరలు పదిశాతం పెరిగాయి. పెసరపప్పు, బంగాళాదుంపలు, ఉల్లి ధరలు అంతకు ముందు ఉన్నవాటి కంటే కాస్త తగ్గాయి. తొమ్మిది వస్తువుల ధరలు పది నుంచి 40శాతం వరకు పెరిగాయి. శెనగపప్పు, పాల ధరలు 33,21శాతం చొప్పున పెరిగాయి. అదే 2019 జనవరి నుంచి 2024 జనవరి వరకు అన్ని వస్తువుల ధరలు 15శాతం పైగా పెరిగాయి తప్ప తగ్గలేదు. పన్నెండు సరకుల ధర 40శాతంపైన, ఏడింటి ధర 50శాతం పైగా పెరిగింది.కందిపప్పు 110, ఉల్లి 107శాతం పెరిగింది. పప్పుధాన్యాల ధరల సూచిక 2014 మార్చి నెలలో 120.1 ఉంటే ఈ ఏడాది అక్టోబరులో 216.8గా ఉంది. ఇదంతా అచ్చేదిన్ కాలపు నిర్వాకం. ధరల పెరుగుదల యూపిఏ పాలన చివరి సంవత్సరాల నాటి స్థాయికి చేరే బాటలో ఉంది. గ్రామీణ ప్రాంతాలలో సాధారణ ద్రవ్యోల్బణం రేటు ఎక్కువగా ఉంది. అక్టోబరులో ఆహార వస్తువుల ధరల సూచిక ప్రకారం పట్టణాల్లో 10.69శాతం ఉంటే పట్టణాల్లో 11.09శాతం ఉంది.ఆహార ధరల పెరుగుదల ఇలా ఉన్న కారణంగానే జనం అవసరమైన మేరకు పోషకాహారం తీసుకోలేకపోతున్నారు.అలాంటి జనాలు రోగాల పాలు కావటం దాని మీద ఖర్చు మరొక భారం.మొత్తంగా ధరల పెరుగుదల కారణంగా వస్తువుల మీద విధిస్తున్న జీఎస్టీ ఏడాదికేడాది పెరుగుతున్నది. తమ ప్రభుత్వం సాధించిన అభివృద్ధే దీనికి నిదర్శనం అంటూ పాలకులు తప్పుదారి పట్టిస్తున్నారు.

మనదేశంలో అత్యధికులు తమ ఆదాయాల్లో సగం మొత్తాన్ని ఆహారం కోసమే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆహార వస్తువుల ధరల పెరుగుదల పతనంలో ప్రకృతిలో వచ్చే మార్పుల ప్రభావం ఒక వాస్తవం. కానీ పెరిగినపుడల్లా తమకేం సంబంధం లేదు అంతా



> మోడీ తొలిసారి అధికారానికి వచ్చిన సమయంలో మనం దిగుమతి చేసుకొనే ముడి చమురుధరలు ఆకాశాన్నంటాయి. వెంటనే అంతర్జాతీయ మార్కెట్లో పతనంతో దిగుమతి బిల్లు తగ్గి ద్రవ్యోల్బణం గణనీయంగా తగ్గింది. దీన్ని తన విజయంగా చెప్పుకున్నారు. 2014 జనవరి నుంచి 2019 జనవరి వరకు చూస్తే 22 నిత్యావసర వస్తువుల్లో పదింటి ధరలు పదిశాతం పెరిగాయి. పెసరపప్పు, బంగాళాదుంపలు, ఉల్లి ధరలు అంతకు ముందు ఉన్నవాటి కంటే కాస్త తగ్గాయి. తొమ్మిది వస్తువుల ధరలు పది నుంచి 40శాతం వరకు పెరిగాయి. శెనగపప్పు, పాల ధరలు 33,21శాతం చొప్పున పెరిగాయి. అదే 2019 జనవరి నుంచి 2024 జనవరి వరకు అన్ని వస్తువుల ధరలు 15శాతం పైగా పెరిగాయి తప్ప తగ్గలేదు.

ప్రకృతి, దేవుడే చేశాడన్నట్లుగా చెప్పటం, తగ్గినపుడు అదంతా తమ ఘనతే అని జబ్బలు చరుచుకోవటం తెలిసిందే. ప్రభుత్వాలు, అవి రూపొందించే విధానాల వైఫల్యాల గురించి కావాలని దాచివేస్తున్నారు. నూనె గింజల ఉత్పత్తికి అవసరమైన అధికదిగుబడి వంగడాలను రూపొందించటంలో అధికారంలో ఎవరున్నా అన్ని పార్టీలు విఫలమయ్యాయి. ఇటీవలనే కేంద్ర ప్రభుత్వం దిగుమతి చేసుకొనే వంటనూనెలపై గరిష్టంగా 30శాతం వరకు దిగుమతి పన్ను విధించింది. ఆ మేరకు దిగుమతి చేసుకొనేవాటితో పాటు స్థానికంగా తయారయ్యే వాటి ధరలు కూడా పెరిగాయి. కొన్ని ఔషధాల ధరలను కేంద్ర ప్రభుత్వం 50శాతం పెంచింది, ఎందుకంటే జనానికి అవసరమైన వాటిని ఉత్పత్తి చేయాలంటే కంపెనీలకు గిట్టుబాటు కావటం లేదు, పెంచకపోతే ఉత్పత్తి మానివేస్తే జనానికే నష్టం అని చెబుతున్నారు. ఆహార ధాన్యాలు కూడా జనానికి అవసరమే. వ్యవసాయ ఉత్పత్తి పట్ల కూడా అదే విధంగా వ్యవహరిస్తున్నదా? 2014లో క్వింటాలు సాధారణ రకం ధాన్య కనీస మద్దతు ధర రూ.1,310 కాగా ఇప్పుడు రూ.2,183కు పెంచారు. మరోవైపు ధాన్య ఉత్పత్తి ఖర్చు ఇదే కాలంలో రూ.644 నుంచి రూ.1,911కు పెరిగిందని వ్యవసాయ పంటల ధరల,ఖర్చుల కమిషన్ చెప్పింది. ఈ ఖర్చుతో పోల్చుకుంటే మద్దతు ధరల పెరుగుదల ఎంత తక్కువో చెప్పనవసరం లేదు. ఆహారం లేకుండా ఔషధాలతోనే జన జీవితాలు గడుస్తాయా? వ్యవసాయం ప్రభుత్వం చేయలేదు గానీ సరసమైన, అవసరమైన ధరలకు ఔషధాలను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వాలకు పూర్తి అవకాశం ఉంది.

యుపిఏ పాలనా కాలంలో ధరల పెరుగుదలను బీజేపీ రాజకీయంగా సొమ్ము చేసుకుంది. తమకు అధికారమిస్తే ధరలను తగ్గిస్తామని నమ్మబలికింది. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోడీ 2012మే 23,24 తేదీలలో మూడు ట్వీట్లు చేశారు. పార్లమెంటు సమావేశాలు ముగిసిన తరువాత పెట్రోలు ధరల పెంపు ప్రకటన పార్లమెంటు గౌరవాన్ని భంగపరచటమే అన్నారు. పెద్ద మొత్తంలో ధరల పెంపుదల యుపిఏ ప్రభుత్వ వైఫల్యం, గుజరాత్ మీద వందల కోట్ల భారం పడుతుందన్నారు. కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు పాలిస్తున్న రాష్ట్రాలలో కంటే గుజరాత్‌లో పెట్రోలియం ఉత్పత్తుల మీద విధిస్తున్న వ్యాట్ తక్కువ అన్నారు. గ్యాస్ ధర పెరగ్గానే సిలిండర్ పట్టుకొని మీడియా ముందుకు పరుగుపరుగున వచ్చిన బీజేపీ నాయకురాలు స్మృతి ఇరానీ గురించి చెప్పనవసరం లేదు. " గ్యాస్ ధర యాభై రూపాయలు పెంచి కూడా తమది పేదల సర్కార్ అని చెప్పుకుంటున్నారు సిగ్గులేదు,యుపిఏ పాలనలో జీడీపీ అంటే గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ కాదు గ్యాస్, డీజిల్, పెట్రోలు ధరలు, ఆరోసారి పెట్రోలు ధరలు పెంచారు, ఇదేమాత్రం సమర్ధనీయం కాదు, దీని వలన ద్రవ్యోల్బణం పెరుగుతుంది. యుపిఏ ప్రభుత్వ తప్పుడు విధానాల ఫలితంగానే పెట్రోలు ధరలు, గృహరుణాల వడ్డీ పెరుగుతున్నదని, కంపెనీల కోసమే పెట్రోలు ధరలు పెంచుతున్నారని, చైనా చొరబాట్లు, పెట్రోలు ధరలు పెరుగుతున్నాయని, రూపాయి విలువ పడిపోయిందని, 60శాతం దేశపౌరులు ఆహారం కోసం ఇబ్బందులు పడుతుంటే లౌకిక వాదం గురించి మాట్లాడుతున్నారంటూ" 2010-13 సంవత్సరాలలో ట్వీట్లు చేశారు.

అదే బీజేపీ పెద్దలు ఇప్పుడు గద్దెమీద ఉన్నారు. స్మృతి ఇరానీ లేదా ఆమె చేతిలో సిలిండర్‌గానీ ఎక్కడా కనిపించటం లేదు. ప్రతిపక్షంలో ఉండగా చెప్పిందేమిటి ఇప్పుడు చేస్తున్నదేమిటి?ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చమురు ధరల పెరుగుదలను సమర్ధించుకొనేందుకు జవహర్‌లాల్ నెహ్రూ పేరును ఉపయోగించుకున్నారు.కొరియా యుద్ధం భారత ద్రవ్యోల్బణం మీద ప్రభావం చూపుతుందని 1951లోనే పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెప్పారు. ప్రపంచమంతా ఒకటిగా ఉన్న ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధం ప్రభావితం చేస్తున్నదని మేం చెబుతున్నాం, దాన్ని అంగీకరించరా ? చమురు కంపెనీలు అధిక ధరలకు కొనుగోలు చేస్తే దాన్ని మనం భరించాల్సిందే అని లోక్‌సభలో సమర్థించుకున్నారు. పోనీ ఈ తర్కానికైనా కట్టుబడి ఉన్నారా? జనం పట్ల, ద్రవ్యోల్బణం తగ్గింపు పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందా అన్నదే ప్రశ్న. అంతర్జాతీయ మార్కెట్లను బట్టి చమురు ధరలు నిర్ణయిస్తామని ప్రకటించి అమలు జరిపిన పెద్దలు రెండున్నరేండ్లుగా ఎందుకు నిలిపివేసిందీ నరేంద్రమోడీ ఎప్పుడైనా చెప్పారా? 2022 ఏప్రిల్ నుంచి ఒకే ధరలను వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ముడి చమురు ధర 20శాతం తగ్గింది. ఆ మేరకు చూసుకుంటే పెట్రోలు, డీజిల్ ధరలు కనీసం దానిలో సగం కూడా ఎందుకు తగ్గించలేదు. జనం జేబులు కొల్లగొట్టి ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీల రూపంలో కట్టబెడుతున్నది.చమురుపై పెంచిన సెస్సుల పేరుతో మోడీ సర్కార్ ఇప్పటి వరకు రూ.26.74లక్షల కోట్లు వినియోగదారుల నుంచి వసూలు చేసింది. ఈ భారం రవాణా రంగం, ఇతర వాటి మీద పడి అనేక వస్తువుల ధరలు పెరగటానికి దారి తీసింది. అందువలన ధరల పెరుగుదలకు ప్రకృతి మీదో మరొకదాని మీదో నెపం మోపితే కుదరదు.ద్రవ్యోల్బణాన్ని నాలుగుశాతానికి పరిమితం చేస్తామని ఆర్‌బిఐ పదే పదే చెప్పటం తప్ప ఆచరణలో అమలు జరగలేదు. జనం ఇబ్బందులు పడుతుంటే లౌకికవాదం గురించి కబుర్లు చెప్పారని విమర్శించిన బీజేపీ పెద్దలు రోజూ మాట్లాడుతున్నదేమిటి ? హిందూమతానికి ప్రమాదం వచ్చింది, హిందూత్వను, సనాతన ధర్మాన్ని పరిరక్షించుకోవాలనే కదా! కనీసం హిందువులు, సనాతన వాదులమని ప్రకటించుకున్న జనసేన వారికైనా హిందూమతం ధరలను తగ్గిస్తుందా? జనాల కడుపు నింపుతుందా?

> అంతర్జాతీయ మార్కెట్లను బట్టి చమురు ధరలు నిర్ణయిస్తామని ప్రకటించి అమలు జరిపిన పెద్దలు రెండున్నరేండ్లుగా ఎందుకు నిలిపివేసిందీ నరేంద్రమోడీ ఎప్పుడైనా చెప్పారా? 2022 ఏప్రిల్ నుంచి ఒకే ధరలను వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు ముడి చమురు ధర 20శాతం తగ్గింది. ఆ మేరకు చూసుకుంటే పెట్రోలు, డీజిల్ ధరలు కనీసం దానిలో సగం కూడా ఎందుకు తగ్గించలేదు. జనం జేబులు కొల్లగొట్టి ప్రభుత్వం కార్పొరేట్లకు రాయితీల రూపంలో కట్టబెడుతున్నది.చమురుపై పెంచిన సెస్సుల పేరుతో మోడీ సర్కార్ ఇప్పటి వరకు రూ.26.74లక్షల కోట్లు వినియోగదారుల నుంచి వసూలు చేసింది. ఈ భారం రవాణా రంగం, ఇతర వాటి మీద పడి అనేక వస్తువుల ధరలు పెరగటానికి దారి తీసింది.

చమురు మీద పెంచిన పన్నులను అడ్డగోలుగా సమర్థించుకున్నారు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరుగుతున్నారు. నరేంద్రమోడీ అధికారానికి వచ్చిన 2014 మే నెలలో ముడిచమురు పీపా ధర 113 డాలర్లు ఉంది, తరువాత 2015 జనవరిలో 50, 2016 జనవరిలో 29 డాలర్లకు పడిపోయినపుడు ధరలు తగ్గించకపోగా పెద్ద మొత్తాలలో సెస్ విధించారు. తరువాత ధరలు పెరిగినప్పటికీ సెస్ రద్దు చేయలేదు. ఇప్పుడు 70 డాలర్లకు అటూ ఇటూగా ఉంటోంది.సెస్ ఎందుకు విధించారయ్యా అంటే 'కరోనా వాక్సిన్ ఉచితంగా కావాలంటారు దానికి డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది' అని పెట్రోలియం శాఖా మంత్రిగా పనిచేసిన రామేశ్వర్ తేలీ వాదించారు. తరువాత ఎత్తివేశారా అంటే లేదు, దేశ రక్షణకయ్యే ఖర్చుకు డబ్బు ఎక్కడి నుంచి తేవాలని మరొకవాదన చేశారు. సెస్ ఎత్తివేత సంగతి తరువాత గత ఆరునెలల్లో తగ్గిన మేరకైనా ధర ఎందుకు తగ్గించటం లేదంటే నోరు విప్పటం లేదు. దీని సంగతేమిటో ప్రశ్నించాలా వద్దా? లేక జేబులను కొల్లగొడుతుంటూ గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోవాలా!

ఢిల్లీలో డెంజర్ బెల్స్

ప్రపంచంలో నివాసయోగ్యం కాని నగరం ఏదైనా ఉందంటే అది ఢిల్లీ అని చెప్పకతప్పదు. ఎందుకంటే దేశ రాజధానిలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 500 దాటింది. గత ఎనిమిదేండ్లుగా ఇదే పరిస్థితి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, హర్యానా, పంజాబ్ రాష్ట్రాల్లో పరిశ్రమల నుంచి వెలువడే విషవాయువులే ఈ దుస్థితికి ప్రధాన కారణం. ఢిల్లీలో వాయు కాలుష్యం స్థాయి పెరగడంపై కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్ మెంట్ (సీఏక్యూఎం) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే పలు ఆంక్షలు విధించగా, తాజాగా ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో 'గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జీఆర్ఏపీ)-4' కింద మరిన్ని నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చింది. ఢిల్లీలో నిత్యావసర వస్తువులు, సర్వీసులు అందించే ట్రక్కులు మినహా అన్ని ట్రాన్స్‌పోర్ట్ వాహనాల ప్రవేశాన్ని



నిలిపివేయాలని సీఏక్యూఎం ఆదేశించింది. ఎల్ఎన్‌జీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్, బీఎస్-4 డీజిల్ ట్రక్కులను మాత్రమే అనుమతించింది. ఢిల్లీ వెలుపల రిజిస్ట్రేషన్‌తో ఉన్న తేలికపాటి కమర్షియల్ వెహికిల్స్, అలాగే ఢిల్లీ రిజిస్ట్రేషన్ తో ఉన్న బీఎస్-4 అంతకన్నా పాత డీజిల్ రవాణా వాహనాల ప్రవేశాన్ని నిషేధిస్తున్నట్టు ప్రకటించింది. ఢిల్లీలో వాయు నాణ్యత సూచి రాత్రి ఏడు గంటల సమయానికి 457కి పెరగడం గమనార్హం. పరిస్థితిని సమీక్షించిన సీఎం అతిశీ తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఢిల్లీలోని పాఠశా లల్లో కేవలం ఆన్‌లైన్ తరగతులే నిర్వహించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు.

చలికాలం వచ్చిందంటే చాలు, ఢిల్లీలో పీల్చే గాలి విషంగా మారుతోంది. ప్రభుత్వాలు అవలంబిస్తున్న పారిశ్రామిక, సాంకేతిక విధానాలు ప్రకృతి విధ్వంసానికి కారణమవుతున్నాయి. దీనికితోడు మానవ కార్యకలాపాలు, సహజ ప్రక్రియలు ఈ రెండు వాయు కాలుష్యాన్ని సృష్టిస్తున్నాయి. పరిశ్రమలు, రవాణా మొదలైన ప్రజల కార్యకలాపాల ద్వారా తయారైన విష పదార్థాలు సమాజాన్ని చుట్టే గాలిని కలుషితం చేస్తున్నాయి. రుతుపవనాల తిరోగమన అనంతరం ఉత్తరాదిన ఏర్పడే ప్రత్యేక వాతావరణ పరిస్థితులు ఒక కారణమైతే , మానవ తప్పిదాలు ఈ వాయు కాలుష్యం స్థాయిలను మరింత పెంచి పీల్చేగాలిని విషతుల్యం చేస్తున్నాయి. ఢిల్లీ నగరంలోని వాహన ఉద్గారాలు, పరిశ్రమల కాలుష్యం శీతాకాలంలో సహజసిద్ధంగా ఏర్పడే పొగమంచులో కలిసిపోయి ప్రజల్ని ఊపిరి పీల్చుకో లేనంతగా ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భవన నిర్మాణ పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోని కారణంగా ఏర్పడే దుమ్మూధూళి అన్నీ కలగలిపి గాలి నాణ్యతను దారుణంగా దెబ్బతీస్తున్నాయి.

ఆక్సిజన్, నైట్రోజన్, కార్బన్ డయాక్సైడ్, ఆర్గాన్‌తో పాటు నీటి ఆవిరి సమతుల్యంగా ఉంటేనే వన్యప్రాణి, వ్యవసాయం, మానవ అభివృద్ధికి తోడ్పడుతుంది. వాయువులు, కణాలు, జీవ అణువులతో సహా హానికరమైన లేదా అధిక పరిమాణంలో ఉన్న పదార్థాలను భూమి వాతావరణంలో ప్రవేశపెట్టినప్పుడు వాయు కాలుష్యం సంభవిస్తుంది. ఇది మానవులకు వ్యాధులు, అలర్జీలు రావడమే కాదు, చివరికి మరణాలకు కూడా దారితీసే ప్రమాదముంది. ఇది ఆహార పంటలు, జంతువులు, ఇతర జీవులకు కూడా హాని కలిగించవచ్చు. ఇంకా సహజమైన లేదా నిర్మించిన వాతావరణాన్ని కూడా దెబ్బతీస్తుంది. వాయుకాలుష్యంతో ప్రపంచవ్యాప్తంగా ఏటా 80లక్షల మంది మరణిస్తున్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక పేర్కొంది. ఢిల్లీలో గాలి నాణ్యత క్షీణిస్తున్న నేపథ్యంలో ప్రజలు ముఖ్యంగా వయోజ నులు, పిల్లల విషయంలో అప్రమ త్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. శ్వాసకోశ సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. దీంతో ఢిల్లీ సహా పరిసర ప్రాంత ప్రజలు గడపదాటి బయటకు రావాలంటే మాస్కు ధరించక తప్పని పరిస్థితి నెలకొంది.

- డా.యం.అఖిలమిత్ర,
9949262231

కార్మికుల కల సాకారమైన వేళ...




దర్శనాల మల్లేష్
8500700333

కార్మికవర్గం చేయిచేయి కలిపింది. శ్రేయోభిలాషుల మమకారం తోడైంది. ఇంకేముంది పదేండ్ల నిరీక్షణ ఫలించింది. శ్రామికుల కల సాకరమైంది. ఆదిలాబాద్ జిల్లాలో సీఐటీయూ భవన నిర్మాణం పూర్తయింది. ఈనెల 28న సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు కామ్రేడ్ బృందాకారత్ చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఆ రోజున కార్మికులు కదం తొక్కేందుకు సిద్ధమవుతున్నారు. ఎదులాపురం ఇక ఎరుపెక్కనుంది. తమ హక్కుల సాధనతో పాటు కార్మిక, కర్షక, సామాజిక ఐక్య పోరాటాలను ముమ్మరం చేయడానికి భవనం వేదిక కానుంది. పాలకుల విధానాలపై పోరాడే ఎవరికైనా ఇది నిలయంగా ఉంటుంది.

సరిగ్గా పదేండ్ల కిందట 2014 సెప్టెంబర్ 22న ఈ భవనానికి శంకుస్థాపన జరిగింది. ఆ ఏడాదిలోనే భవనం పూర్తి చేయడానికి ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేదు. నాటి పరిస్థితుల్లో ఒక ఫ్లోర్ పూర్తిచేసుకుని రెండు ఆఫీస్ రూములు నిర్మించి కార్యాలయాన్ని పనిలోకి తీసుకురాగలిగాం. జిల్లాల విభజనతో ఉమ్మడిగా ఉన్న ఉద్యమం నాలుగు జిల్లాలుగా విడిపోవడం.. తదనంతరం జరిగిన వివిధ పరిణామాల నేపథ్యంలో భవన నిర్మాణం అనుకున్న విధంగా పూర్తి కాలేకపోయింది. అయినప్ప టికీ ఈ భవనం ఆర్టీసీ కార్మికుల యాభైరోజుల సమ్మెకు వేదికైంది. పోరుబాట పట్టిన కుండిషేకుగూడ ఆదివాసులను అక్కున చేర్చుకుంది. సీసీఐ సాధన పోరాట కమిటీ ఇక్కడే రూపుదాల్చింది. కార్మిక, కర్షక పోరాటాలకు కేంద్ర బిందువైంది. ఈ మధ్యకాలంలో జిల్లా పర్యటనకు వచ్చిన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, సీఐటీయూ ఆల్ ఇండియా కోశాధికారి కామ్రేడ్ ఎం.సాయిబాబు ప్రోత్స హించిన తీరు మాలో స్థైర్యాన్ని నింపింది. మరోమారు బిల్డింగ్ నిర్మాణం వైపు దృష్టి సారించేందుకు ఊతమిచ్చింది. పార్టీ జిల్లా ఇన్‌చార్జి కామ్రేడ్ బండారు రవికుమార్ ప్రతినిధ్యం వహిస్తూ, అందిస్తున్న సలహాలు, సూచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ రోజువారిగా ఆన్‌లైన్ సమావేశం నిర్వహించి ప్రోత్సాహం అందించడం పనిచేయడానికి దోహదం చేశాయి. యావత్తు జిల్లా ఆఫీస్‌బేరర్స్ అందరూ బిల్డింగ్ నిర్మాణం తమ భుజ స్కందాలమీద వేసుకొని పూర్తి చేయడానికి సంకల్పించారు. సహజంగానే పోరాటాల్లో అందరికీ ఆద ర్శంగా నిలిచే అంగన్వాడీ యూనియన్ బిల్డింగ్ నిధుల సేకరణలో కూడా అదే స్ఫూర్తిని కన బరిచింది. తదుపరి ఆశా యూనియన్ అండగా నిలిచింది. మహిళలకు అవకాశాలిస్తూ..ప్రోత్సాహం అందిస్తే పట్టుదలతో ఎంతటి కఠిన ఫలితాలైనా అవలీలగా సాధిస్తారనడానికి ఈ రెండు రంగాల్లోని మహిళా కామ్రేడ్స్ ఉదాహరణగా నిలిచారు. గ్రామపంచాయతీ, రిమ్స్ తదితర సంఘాలు అన్ని తమ శక్తికి తగ్గట్టు ఆర్థిక సహకారమందించాయి. కార్మికవర్గాన్ని అక్కున చేర్చుకున్న దాతల సహకారం తోడై భవన నిర్మాణం పూర్తి చేసుకోగలిగాం.

కామ్రేడ్ 'బాశెట్టి' భవనంగా నామకరణం

చివరి శ్వాసవరకు ఎర్రజెండానే ఆయువుపట్టుగా జీవించి అమరుడైన కామ్రేడ్ బాశెట్టి మాధవ రావు పేరు ఈ భవనానికి పెట్టాలని నిర్ణయించాం. ఈ భవనాన్ని పోరాటాలకు నిలయంగానే కాకుండా ఒక విజ్ఞాన కేంద్రంగా నడపాలని సీఐటీయూ భావించింది. బాశెట్టి మాధవరావు 1978లో ఆదిలాబాద్‌లో కార్మిక సంఘాన్ని స్థాపించారు. కట్టెలు మోసేవారి నుండి మొదలుకొని సినిమా కార్మికులు, హమాలీ, రిక్షా తదితర సంఘాల్ని నిర్మించారు. అగ్రకులంలో పుట్టినా అణగారిన ప్రజల హక్కుల కోసం ఉద్యమించారు. నిరాడంబర జీవితానికి మారుపేరుగా నిలిచి మరణించే వరకు సైకిల్‌పైనే తన ప్రయా ణం సాగించారు. వ్యాపార కుటుంబం నుండి వచ్చినా ఆయన అటువైపు వెళ్లకుండా పేదల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించారు. దోపిడీలేని



సమసమాజ స్థాపనే తన లక్ష్యంగా మరణించే వరకు ఎర్ర జెండాను వదల్లేదు. సమాజాన్ని రాజకీయ చైతన్యం చేయాలనే సంకల్పంతో ప్రజాశక్తితో పాటు ఇతర పత్రికలు, మ్యాగ్జిన్‌లను అభ్యుదయ వాదులు, పాఠకులు, ప్రజలకు చేరవేశారు. ఈ వృత్తినే తన ఇంటి పేరుగా మార్చుకొని 'పేపర్ మాధవరావు'గా పేరు గడించారు. అందుకే అయన విజ్ఞాన ప్రధాత కాబట్టే ఈ కార్యాలయానికి కామ్రేడ్ బాశెట్టి మాధవరావు విజ్ఞాన కేంద్రం అని నామకరణం చేశాం. ఆయన ఆశ యాలకు అనుగుణంగా భవిష్యత్తులో ఈ కార్యాలయం పనిచేయనుంది. ఆయన ఉద్యమ సహచరుడు ఏడు పదుల వయసులోనూ నవయువకుడిలా ఉద్యమ రణం సాగిస్తున్న కామ్రేడ్ బండి దత్తాత్రి కార్యా లయ నిర్మాణ పనులు దగ్గరుండి పూర్తిచేయించారు. మరో ఉద్యమ సహచరుడు కామ్రేడ్ లంక రాఘవులు తనవంతు సహకారమందించారు. ఈ కార్యాలయం ప్రారంభానికి విచ్చేస్తున్న మాజీ ఎంపీ మిడి యం బాబురావు, సాయిబాబు, మాజీ ఎమ్మెల్సీ చెరుపెల్లి సీతారాములు, పాలడుగు భాస్కర్, బండారు రవికుమార్‌లకు కామ్రేడ్ మాధవరావుతో ప్రత్యక్ష ఉద్యమ అనుబంధం ఉంది. ఉద్యమాలే ఊపిరిగా.. ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా జీవిస్తున్న ఇలాంటి నాయకులు కార్యాలయం ప్రారంభోత్స వానికి రావడం జిల్లాలో భవిష్యత్తు ఉద్యమాలకు మరింత ఊతమిస్తుంది.

శ్రామికుల సంకల్పం..

కొండలను సైతం పిండి చేయగల సామర్థ్యం కలిగిన శ్రామికులు తలుచుకుంటే కానిది ఏముంటుంది..? ఖర్చుతో కూడుకున్న పని మనతో సాధ్యం అవుతుందా? అని ఆలోచిస్తున్న సందర్భంలో కార్మికవర్గం తామున్నామంటూ భరోసా కల్పించింది. బిల్డింగ్ నిర్మాణం ప్రారంభించాలని నిర్ణయించినప్పుడు సీఐటీయూ దగ్గర రోజువారి కార్యకలాపాలకు సైతం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. కానీ, కార్మికుల మీద ఉన్న ప్రగాఢ విశ్వాసమే నాయకత్వాన్ని ముందుకు నడిపించింది. కార్మికులు చేస్తున్న రంగాల్లో నెలల తరబడి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న దుస్థితి. ఇలాంటి సమయంలో కూడా భవన నిర్మాణం తమదిగా భావించి విరివిగా విరాళాలు అందించారు. వారి దగ్గర లేకుంటే ఇతరుల దగ్గర అప్పు తీసుకుని మరీ బిల్డింగ్‌కు తమ వంతు చేయూతనందించారు. అందరి కృషితో ఐక్య పోరాటాలకు కేంద్రబిందువైన సీఐటీయూ కార్యాలయ నిర్మాణం పూర్తయింది. కార్మికుల కల సాకారమైంది. ఇక భవిష్యత్తు ఉద్యమాలకు వేదికగా మారనుంది. భవవ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు, విప్లవ జేజేలు.

> కొండలను సైతం పిండి చేయగల సామర్థ్యం కలిగిన శ్రామికులు తలుచుకుంటే కానిది ఏముం టుంది..? ఖర్చుతో కూడుకున్న పని మనతో సాధ్యం అవుతుందా? అని ఆలోచిస్తున్న సందర్భంలో కార్మికవర్గం తామున్నామంటూ భరోసా కల్పించింది. బిల్డింగ్ నిర్మాణం ప్రారంభించాలని నిర్ణయించి నప్పుడు సీఐటీయూ దగ్గర రోజువారి కార్యకలాపాలకు సైతం ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. కానీ, కార్మికుల మీద ఉన్న ప్రగాఢ విశ్వాసమే నాయకత్వాన్ని ముందుకు నడిపించింది. కార్మికులు చేస్తున్న రంగాల్లో నెలల తరబడి వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్న దుస్థితి. ఇలాంటి సమయంలో కూడా భవన నిర్మాణం తమదిగా భావించి విరివిగా విరాళాలు అందించారు.

శిథిలావస్థలో కల్వర్టు..

ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?

నవతెలంగాణ - ఇల్లందకుంట



శిథిలావస్థలో ఉన్న రాచపల్లి, నాగంపేట ప్రధాన రహదారి కల్వర్టు

ఇల్లందకుంట మండలం రాచపల్లి నుండి నాగంపేట మధ్యన ఉండే ప్రధాన రహదారిపై కల్వర్టు శిథిలావస్థకు చేరింది. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఏదైనా ప్రమాదం జరుగుతేనే పట్టించుకుంటారా అని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ కల్వర్ట్ మీదుగా ప్రధానంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత సంవత్సరం వర్షాల వరదల తాకిడికి ఈ కల్వర్టు పూర్తిగా కుంగి ధ్వంసమైంది. ఈ మార్గం ప్రధానంగా నాగంపేట, రాచపల్లి మీదుగా వంతడుపుల, వావిలాల, బుజునూర్, సీతంపేటను కలుపుతుంది. స్కూల్ బస్సులు కూడా ఈ మార్గం గుండానే వెళ్తుంటాయి. ఇంత రద్దీగా ఉండే కల్వర్టును ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం పోవడం ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఈ కల్వర్టును తొలగించి కొత్తది నిర్మించి అందుబాటులోకి తేవాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉమ్మడి కరీంనగర్ ఓటర్లే కీలకం



పట్టభద్రుల ఎన్నికల్లో ఓటేసే వాళ్లలో 45.6శాతం ఇక్కడి నుంచే నమోదు

- నాలుగు ఉమ్మడి జిల్లాల పరిధిలో 316665మంది ఓటర్లు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అత్యధికంగా 1,45,043 ఓట్లు
- ఇందులోనూ కేవలం కరీంనగర్ జిల్లాలోనే 65058మంది..
- అత్యల్పంగా 2220 ఓటర్లున్నది జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోనే!
- మొత్తం 3,55,496 దరఖాస్తుల్లో కేవలం 3వేల అప్లికేషన్లే రిజక్ట్
- గతంతో పోలిస్తే 40శాతం పెరిగిన ఓటర్ల సంఖ్య

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓటర్లే కీలకంగా వ్యవహరించనున్నారు. మొత్తం ఓటర్లలో 45.6శాతం ఇక్కడి నుంచే ఉన్నారు. మొత్తం 3,16,665ఓటర్లలో ఈ ఉమ్మడి జిల్లా నుంచే 1,45,043 మందిఓటర్లు ఉండగా కేవలం కరీంనగర్ జిల్లా నుంచే 65,058 మంది ఉన్నారు. అయితే గత ఎన్నిల్లో కేవలం లక్షా 96వేలా 321 మంది ఓటరుగా నమోదు చేసుకోగా ఈసారి ఏకంగా 40శాతం అధికంగా దరఖాస్తులు చేసుకోవడం, అందులోనూ కేవలం 3వేల అర్జీలు మాత్రమే రిజక్టకావడం గమనార్హం. ఏదేమైనా ఈ ఎన్నికల్లో పోటీపడుతున్న అభ్యర్థుల్లో ఎక్కువ మంది కరీంనగర్ జిల్లా నుంచే ఉండగా.. ఓటర్లూ ఇక్కడి నుంచే సింహభాగంగా ఉండటం గమనార్హం.

కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే ప్రజల్లో తిరుగున్నారు. టిక్కెట్ ఎవరిని వరిస్తుందో ఇంకా తెలియనప్పటికీ అప్పుడే తమ ప్రచారాలను మాత్రం ముమ్మరం చేశారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, మెదక్, నిజామాబాద్ ఓటర్లను కలుస్తున్నారు. లాయర్లు, వైద్యులు, ఇతర ఉన్నత విద్యావంతులను కలుస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. తాము గెలిస్తే ఏమేం చేస్తామో కూడా ప్పటి నుంచే హామీలు ఇస్తూ వస్తున్నారు.

గతం కంటే పెరిగిన ఓటర్లు

2019లో జరిగిన ఎన్నికల్లో ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో గెలిచిన కాంగ్రెస్ సీనియర్ నేత టి.జీవన్‌రెడ్డి పదవీకాలం వచ్చే మార్చితో ముగియనున్నది. ఈ పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న ఎన్నికల సంఘం ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను చేపట్టింది. ఈనెల 6వ తేదీతో గడువు కూడా ముగిసింది. కరీంనగర్-మెదక్, నిజామాబాద్- ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసిన నాటి గడువు ముగిసే లోపు ఓటర్ ఎన్‌రోల్‌మెంట్ చూస్తే..గతం కంటే నమోదు పెరిగింది. 2019లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల సమయంలో 17 మంది అభ్యర్థులు పోటీ పడగా లక్షా 96వేలా 321 మంది పట్టభద్రులు ఓటు నమోదు చేసుకున్నారు. ఆ ఎన్నికల్లోనే చాలా మంది పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసుకోకపోగా..ఈ సారి కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందని అందరూ భావించారు. తీరా నవంబర్ 6తేదికి రెండు రోజుల ముందు వరకు 2,35,576 దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. రెండు రోజుల్లో ఆ సంఖ్య ఏకంగా 3,58,579కి పెరిగాయి. అంటే ఏకంగా రెండు రోజుల వ్యవధిలోనే లక్షా 23వేలు అర్జీలు సమర్పించారు. మొత్తంగా ఆన్‌లైన్‌లో 3,55,496 అర్జీలురాగా ఆఫ్‌లైన్‌లో 3083మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓటర్ విద్యార్హతలు, గుర్తింపుకార్డులను పరిశీలించిన ఎన్నికల సంఘం అందులో ఆన్‌లైన్ అర్జీల్లో 3,13,674,ఆఫ్‌లైన్‌లో 2989ని అర్హత కల్పించారు. దరఖాస్తుల్లో పొరపాట్లు, సరైన ధ్రువీకరణ పత్రాలు సమర్పించని 41,822 మంది దరఖాస్తులను రిజక్ట్ చేశారు. ఆఫ్‌లైన్‌లో కేవలం 94 మాత్రమే రిజక్ట్ అయ్యాయి.

ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఓటర్లే కీలకం

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో వచ్చిన 3,55,496 దరఖాస్తుల్లో కేవలం ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచే 1,62,975 ఉన్నాయి. ఇందులో 1,45,043మంది ఓటర్ల దరఖాస్తులకు ఓటు హక్కు కల్పించారు. కేవలం కరీంనగర్ జిల్లా వరకే చూస్తే ఏకంగా 65058మంది ఓటర్లు ఉన్నారు. ఉమ్మడి జిల్లా వరకు పరిశీలిస్తే మొత్తం ఓటర్లలో 45శాతం మంది ఇక్కడి నుంచే ఉన్నారు. మిగతా జిల్లాలు చూస్తే ఉమ్మడి ఆదిలాబాద్‌లో 63,390, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 41,343, ఉమ్మడి మెదక్, సిద్దిపేట జిల్లాలో 40636ఓటర్లు, హన్మకొండ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో కలిపి 6201మంది ఓటర్లు ఉన్నాయి. అయితే ఈ రెండు జిల్లాల పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన 9 మండలాల ఓటర్లు మాత్రమే ఉంటారు. మొత్తంగా 29 జిల్లాలు, 271 మండలాల పరిధిలోని ఓటర్లు ఈ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌లో సీపీ తనిఖీ



నవతెలంగాణ - చిగురుమామిడి

చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తనిఖీ చేశారు. సిబ్బందితో మాట్లాడారు. పట్టుబడిన వాహనాలపై ఆరా తీశారు. పెండింగ్ కేసులపై సమీక్షించారు. విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ, స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరుచూ సందర్శించాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులపై సమీక్ష చేశారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని సూచించారు. పాత నేరస్థులపై నిఘా ఉంచాలన్నారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఆక్సిడెంట్ జోన్‌లుగా, బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా పరిధి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామ ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. గంజాయి, ఇసుక, పీడీఎస్ బియ్యం తరలించేవారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తిమ్మాపూర్ సీఐ స్వామి, చిగురుమామిడి ఎస్సై రాజేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాంటి బయోటిక్స్ దుర్వినియోగంపై ఐఎంఏ పోస్టర్

ఆవిష్కరించిన కరీంనగర్ కలెక్టర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఇండియా పిలుపుమేరకు యాంటి మైక్రోబియాల్ రెసిస్టెన్స్ వారంలో భాగంగా ఐఎంఏ కరీంనగర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో యాంటి మైక్రోబియాల్ రెసిస్టెన్సికి కారణాలు, తగ్గించడానికి కారణాలను వివరిస్తూ వారు తయారు చేసిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పోస్టర్స్‌ను హాస్పిటల్‌లో ప్రదర్శించడమే కాకుండా ప్రజలకు పాంప్లెట్స్ ద్వారా కూడా విరివిగా తీసుకెళ్తామని ఐఎంఏ కరీంనగర్ జిల్లా ప్రెసిడెంట్ డాక్టర్ ఎనమల్ల నరేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2019 ఒకే సంవత్సరంలో 49లక్షల మంది డైరెక్టుగా, ఇన్‌డైరెక్ట్‌గా ఈ యాంటి బయోటిక్స్ రెసిస్టెన్సి వల్ల చనిపోయారని తెలిపారు. తరచుగా అవసరం లేకున్నా ఆంటి బయోటిక్స్ వాడడం, మాములు జలుబు లాంటి వాటికి కూడా ఆంటి బయోటిక్స్ వాడడం, జబ్బుకు సరిపడు ప్రత్యేకమైన ఆంటి బయోటిక్స్ వాడకపోవడం, జబ్బుకు సరిపడే డోసులు, రోజులు వాడకపోవడం, కనీసం అలోపతి వైద్యంలో ఎంబీబీఎస్ డిగ్రీ కూడా లేని వ్యక్తులు విచ్చలవిడిగా అవగాహన లేకుండా విచ్చలవిడిగా ఆంటి బయోటిక్స్ ఇవ్వడం లాంటివి ఈ ఆంటి బయోటిక్స్ రెసిస్టెన్సికి ముఖ్య కారణాలు అని వివరించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే తరచుగా ఇన్‌ఫెక్షన్స్ రాకుండా ఉండడమే కాకుండా ఆంటి బయోటిక్స్ వాడాల్సిన అవసరం కూడా తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ కరీంనగర్ సెక్రటరీ డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ రాం కిరణ్, డాక్టర్ విజయ మోహన్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

యాంటీ బయాటిక్స్ అతిగా వాడొద్దు

హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పాపక్కపల్లి గ్రామంలో డాక్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో యాంటీ మైక్రో బయల్ రెసిస్టెన్స్ (ఏయంఆర్) వీక్ క్యాంపెయిన్‌పై గ్రామస్తులకు, గ్రామపంచాయతీ సిబ్బందికి, అంగన్వాడీ టీచర్స్‌కి, పాఠశాల ఉపాధ్యాయులు, ఆరోగ్య మహిళా కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి శుక్రవారం అవగాహన నిర్వహించారు. అనవసరంగా యాంటీ బయాటిక్స్ వాడోద్దని సూచించారు. అతిగా వినియోగించడంవల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమములో గ్రామ పంచాయతీ కార్యదర్శి పోరెడ్డి నరేందర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సదానందం, ఏఎన్ఎం రమ, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

కొరిమి వెంకటస్వామి



నవతెలంగాణ - శంకరపట్నం

ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్ పచ్చి బూటకమని.. దీనిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సామాజిక కార్యకర్త కొరిమి వెంకటస్వామి అన్నారు. శుక్రవారం శంకరపట్నం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా కనుసన్నల్లోనే ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయని ఆరోపించారు. నక్సలైట్లది శాంతిభద్రతల సమస్య కాదని సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. చర్చలు జరపాల్సిన అవసరం ఉందని అన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి : సీడీపీఓ కస్తూరి

నవతెలంగాణ - చొప్పదండి



బాలికలు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సీడీపీఓ కస్తూరి అన్నారు. మండలంలోని వెదురుగట్ట అంగన్వాడి కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషకాహార ప్రాముఖ్యత, రక్తహీనత, ఆరోగ్య మహిళ ప్రోగ్రాం, మొబైల్ వాడకంచ గుడ్ టచ్ బ్యాడ్ టచ్, స్కూల్ విద్య చైల్డ్ హెల్ప్ లైన్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్స్ శశికుమారి, రమాదేవి, మహిళా సాధికారిక జెండర్ స్పెషలిస్ట్ శైలజ, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్వాడీ టీచర్స్ రమాలక్ష్మి, నరసమ్మ రామలక్ష్మి పాల్గొన్నారు.

గంగిపల్లిలో శుక్రవారం సభ

నవతెలంగాణ - మానకొండూర్



మండలంలోని గంగిపల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిడిపిఓ శ్రీమతి హాజరై మాట్లాడారు. పోషకాహారం, అంగన్వాడి కేంద్రంలో అందిస్తున్న సేవలు, సాధారణ ప్రసవాలు, పరిసరాల పరిశుభ్రత, రక్తహీనత వంటి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అరుణ, హెల్త్ సూపర్వైజర్ సరోజన, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఏఎన్ఎం యాద, జయమని అంగన్వాడి టీచర్లు శారద, ఉమా, రాజకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

24న విశ్రాంత అటవీ అధికారుల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ - భగత్‌నగర్



మానకొండూర్‌లో ఈ నెల 24న నిర్వహించే జరుగబోయే విశ్రాంత అటవీ అధికారుల సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేందర్ రాజు అన్నారు. నగరంలోని ప్రెస్‌భవన్‌లో రిటైర్డ్ అధికారులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతి ఏటా మొదటి విడత వరంగల్‌లో, రెండవ విడత కరీంనగర్‌లో సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యవర్గ ఎన్నికలు నిర్వహించుకోవడంతోపాటు సీనియర్ సిటిజన్స్ సమస్యలపై చర్చించి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అడవుల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సలహాలు సూచనలు అందించనున్నామని చెప్పారు. రిటైర్డ్ ఫారెస్ట్ గెజిటెడ్ ఆఫీసర్స్ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అడ్వైజర్ బుచ్చిరెడ్డి, చక్రపాణి, రాజగోపాల్‌రెడ్డి, రాజేందర్, రాజేశ్వర్, మధుసూదన్, రిటైర్డ్ ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

ప్రయివేటు ఆస్పత్రుల్లో డిప్యూటీ డీఎంహెచ్ఓ తనిఖీ

సౌకర్యాల లేమిపై ఆగ్రహం

నవతెలంగాణ - హుజూరాబాద్



ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

ప్రభుత్వ నియమ నిబంధనల పాటించని ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటామని హుజూరాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చందు హెచ్చరించారు. శుక్రవారం హుజూరాబాద్ పట్టణంలోని సూపర్‌బజార్ రోడ్డులో గల పలు ప్రయివేటు ఆస్పత్రుల్లో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆస్పత్రులకు వచ్చే డాక్టర్లు ఎవరు, వారి సర్టిఫికెట్లు, వారికి ఆస్పత్రికి మధ్య జరిగిన ఒప్పంద పత్రాలు, నడిపించుకోవడానికి అనుమతి తీసుకున్నారా అన్న విషయాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలో మెడికల్ షాప్ ఉంటే దాని రిజిస్ట్రేషన్ పత్రాలు తనిఖీలు చేశారు. పలు ఆస్పత్రుల ముందు అక్కడికి రానటువంటి డాక్టర్ల పేర్లు ఉండడాన్ని ఆయన తప్పు పట్టారు. ఈ విధంగా చేయడం ప్రజలను మోసం చేయడం కాదా అని నిర్వాహకులను ప్రశ్నించారు. వెంటనే ఆస్పత్రుల ముందు ఉన్న బోర్డులను తొలగించి కేవలం మీ ఆస్పత్రికి వచ్చే వైద్యుల పేర్లు ఉండే బోర్డులు మాత్రమే ప్రదర్శించాలని లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామన్నారు. ఆస్పత్రి ప్రారంభించాలంటే తప్పనిసరిగా వైద్య ఆరోగ్యశాఖ నుండి అనుమతి పొందాలని స్పష్టం చేశారు. హుజూరాబాద్ పట్టణంలో ఉన్న పలు ఆస్పత్రులపై ఫిర్యాదులు వచ్చాయని అన్నారు. వెంటనే ఆయా ఆస్పత్రులు తమ లోపాలను సరిదిద్దుకోకపోతే నోటీసులు ఇవ్వడమే కాకుండా కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. ఒక పాలీ క్లినిక్‌లో కాలం చెల్లిన ప్రెగ్నెన్సీ టెస్ట్ పరికరాలు ఉండడాన్ని ఆయన తీవ్రంగా పరిగణించి ఇలాంటివి ఎందుకు కలిగి ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు తప్పనిసరిగా ఉండాలని, పరిశుభ్రత లేకపోతే ఎలా అని యాజమాన్యాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలోనే మరోసారి ఆస్పత్రుల తనిఖీ చేస్తామని, లోపాలను మార్చుకోకపోతే కేసులు తప్పవని హెచ్చరించారు.

పార్టీ విధేయతకు పట్టం

హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కంది తిరుపతిరెడ్డి

- చిగురుమామిడి మండలానికి తొలిసారి దక్కిన గౌరవం

నవతెలంగాణ - చిగురుమామిడి



మార్కెట్ కమిటీ చైర్మన్
కంది తిరుపతిరెడ్డి

హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ చిగురుమామిడి మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వైస్ చైర్మన్‌గా పార్టీ హుస్నాబాద్ మండల అధ్యక్షుడు బంక చందును నియమించింది. వీరితో పాటు మరో 16 మంది సభ్యులతో పాలకవర్గాన్ని ప్రకటించింది. హుస్నాబాద్ మార్కెట్ పరిధిలో హుస్నాబాద్, చిగురుమామిడి, అక్కన్నపేట మండలాలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా చిగురుమామిడి మండలానికి చైర్మన్ పదవి వరించింది. అలాగే చైర్మన్‌తో పాటు మండలంలోని కాంగ్రెస్ మహిళా నాయకురాలు ఓరుగంటి భారతి దేవి, ఎండి కుతుబుద్దీన్, బోడిగె పరుశు రాములుకు మార్కెట్ కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించారు. చిగురుమామిడి మండలానికి చైర్మన్ పదవి దక్కడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన చైర్మన్‌గా నియమితులైన కంది తిరుపతిరెడ్డికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతిరెడ్డి మొదటి నుంచి కాంగ్రెస్‌లోనే ఉన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ చురుకైన పాత్ర పోషించారు. ఆ సమయంలో మండలంలో టీఆర్ఎస్ బలంగా ఉన్నా.. కాంగ్రెస్‌ను మాత్రం వీడలేదు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ.. వారి అభిమానాన్ని చూరగొన్నారు. ఫలితంగా ఆయనకు పార్టీ మండక అధ్యక్షుడిగా అవకాశం కల్పించింది. అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ విజయానికి ఎంతగానో తోడ్పడ్డారు. ఆయన సేవలను గుర్తించిన అధిష్టానం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా అవకాశం కల్పించింది.

రాష్ట్రస్థాయి పోటీలకు చొప్పదండి విద్యార్థులు ఎంపిక



నవతెలంగాణ - చొప్పదండి : వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జిఎఫ్ నెట్‌బాల్ చాంపియన్షిప్ (అండర్ 17) పాల్గొని ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టుకు చొప్పదండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.అరవింద్, కె.యశ్వంత్, బి.వైష్ణవి, కె.అంజలి ఎంపికయ్యారు. శనివారం మెదక్ జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్టాప్‌బాల్, సబ్ జూనియర్ అండర్ 15 విభాగంలో పాల్గొనేందుకు కరీంనగర్ జిల్లా జట్టుకు జి.రామ్‌చరణ్, జి.కుశాల్‌సాయి ఎంపికైనట్లుగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కృష్ణ శుక్రవారం తెలిపారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు కృష్ణను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి అభినందించారు.

కొత్త నమోదుకు స్పెషల్ క్యాంపైన్ డే

నవతెలంగాణ - ఇల్లందకుంట



తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో నూతన ఓటర్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇల్లందకుంట తహసీల్దార్ రాణి తెలిపారు. 18సంవత్సరాలు నిండిన యువతీ యువకులు మీ గ్రామంలో నవంబర్ 23, 24న రెండు రోజులు ప్రత్యేకంగా ఓటరు నమోదు కోసం ఎఫ్ 6, 7, 8, సంబంధించిన అర్జీలను స్వీకరించడానికి, గ్రామాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్స్ పోలింగ్‌లో అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని నూతనంగా ఓటు హక్కు పొందేవారు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.


ధాన్యం కొనుగోళ్లు పరిశీలన



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సివిల్ సప్లై డీటీ ఉష, చొప్పదండి ఎస్సై గొల్లపల్లి అనూష శుక్రవారం ధాన్యం కొనుగోలు పరిశీలించారు. ధాన్యం తేమశాతాన్ని పరిశీలించి, రైతుల సమస్యను తెలుసుకున్నారు. కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సింగల్‌విండో సెక్రటరీ తిరుపతిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'చరిత్రలో పరిచయం పదిలం'

సాహిత్య వ్యాస సంపుటి ఆవిష్కరణ




నవతెలంగాణ - భగత్‌నగర్

కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో శుక్రవారం తెలుగు విభాగం - సాహితీ సోపతి సంయుక్త ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ అధ్యక్షతన బూర్ల వెంకటేశ్వర్లు రచించిన పరిచయం సాహిత్య వ్యాస సంపుటి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ నలిమెల భాస్కర్ చేతుల మీదుగా ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథి నలిమెల మాట్లాడుతూ ఈ వ్యాసాలు సాహిత్యంపై లోతైన అవగాహనతో, ఎరుకతో, పరిశోధనా జిజ్ఞాసతో రాసినవని అన్నారు. ఈ పుస్తకాన్ని నగునూరి శేఖర్‌కు అంకితం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఇలాంటి వ్యాస సంకలనాలు విద్యార్థులను సాహిత్యం పట్ల జిజ్ఞాసను, అనురక్తిని, పఠనాభిలాషను పెంచుతాయని తెలిపారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన తెలుగు విభాగం అధ్యక్షుడు డాక్టర్ బూర్ల చంద్రశేఖర్ మాట్లాడుతూ కవిత్వము కవికి సంబంధించిన సైద్ధాంతిక ఆలోచన ధారణను పుస్తక రచయిత పునికి పుచ్చుకున్నాడని తెలిపారు. కార్యక్రమంలో అన్నవరం దేవేందర్, కందుకూరు అంజయ్య, కడారు సురేందర్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, సాహిత్యకారులు సివి.కుమార్, పెనుగొండ సరసిజ బసవేశ్వర్, రామానుజం సుజాత, సంకేపల్లి నాగేంద్రశర్మ, రాపర్తి శ్రీనివాస్, డాక్టర్ డి.ప్రకాశ్, మెట్టు వెంకటేశ్వర్లు, పుప్పాల చైతన్య, పాత అశోక్, భోజన్న అనిల్ కుమార్, శంకర్, మహేందర్, రాము పాల్గొన్నారు.

టెట్ దరఖాస్తుల గడువు పెంచాలి

జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి

నవతెలంగాణ - ఇల్లందకుంట




మాట్లాడుతున్న జెడిఎస్ నేత వాసు

రాష్ట్ర ప్రభుత్వం స్వీకరిస్తున్న టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) దరఖాస్తుల స్వీకరణ గడువును మరో పది రోజులపాటు పెంచాలని జనతాదళ్ (సెక్యులర్) పార్టీ రాష్ట్ర కార్యదర్శి వాసు వడ్లూరి కోరారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ప్రభుత్వం టెట్ దరఖాస్తుల ఆన్లైన్ స్వీకరణ గడువు సమయంలో సుమారు నాలుగు రోజులపాటు సాంకేతిక కారణాలవల్ల అభ్యర్థులు పూర్తిస్థాయిలో దరఖాస్తు చేసుకోలేకపోయారన్నారు. దీనివల్ల టెట్ పరీక్ష పై ఆధారపడిన వారు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వీరి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని గడువు వ్యవధిని పెంచాలని వాసు వడ్లూరి డిమాండ్ చేశారు. ఆయన వెంట మారముల్ల కిరణ్ ఉన్నారు.

గ్రామాల్లో కళాయాత్ర కార్యక్రమం

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట మండలంలోని గండ్రపల్లి, తనుగుల, వావిలాల గ్రామాలలో ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, సమాచార పౌర సంబంధాల శాఖ ఆదేశాల మేరకు శుక్రవారం తెలంగాణ సాంస్కృతిక సారథి వడ్లకొండ అనిల్ కుమార్ కళాబృందం మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం ఆధ్వర్యంలో కళాయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వానరాశి జాను, కళాబృందం సభ్యులు శ్రీధర్, కోమల, సురేష్, ఎండి.నిజాముద్దీన్, రావుల తిరుపతి, రావుల సాయికుమార్, తిరుపతి, ఎండి ఆసియా, పద్మ పాల్గొన్నారు.

సే నోటు ర్యాగింగ్, ర్యాగింగ్ చేయడం చట్టరీత్య నేరం

- గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు
- జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

సే నోటు ర్యాగింగ్, ర్యాగింగ్ చేయడం చట్టరీత్య నేరం అని జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం జగిత్యాల ప్రభుత్వ వైద్య కళాశాలలో మహిళల రక్షణ, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉత్తమ డాక్టర్లుగా ఎదిగి జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలకు మంచి పేరు తీసుకరావలన్నారు. విద్యార్థులు ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించడం, వారిని ఇబ్బందులకు గురి చేయడం మంచి విద్యార్థి లక్ష్యం కాదు అని తెలిపారు. ర్యాగింగ్‌కు పాల్పడే వారి వివరాలను డయల్ 100కు తెలియజేసి సమాచారం అందించాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ రఘు చందర్, టౌన్ ఇన్స్పెక్టర్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ సయ్యద్ సైపుల్లా ఖాద్రీ పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ స్పాట్ బిల్లులు చెల్లించండి

స్టేట్ టీచర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పదో తరగతి పరీక్ష జవాబు పత్రాలు మూల్యాంకనం చేసి రెండు సంవత్సరాలు గడుస్తున్నా రెండు స్పాట్ బిల్లులు ఇంత వరకు చెల్లించకపోవడంపై స్టేట్ టీచర్స్ యూనియన్ ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మచ్చ శంకర్, బైరం హరికిరణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023, 2024 స్పాట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నందున 2025 ఎస్ఎస్‌సీ స్పాట్ కార్యక్రమాన్ని బహిష్కరిం చనున్నట్టు వారు హెచ్చరించారు. సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ కాచిగూడలోని ఎస్టీయు భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్‌లకు జగిత్యాల జిల్లా శాఖ వినతి పత్రం సమర్పించారు.

ఎస్‌జిఎఫ్ క్రీడాకారులకు దుస్తులు అందజేత

నవతెలంగాణ-మేడిపల్లి



రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు క్రీడా దుస్తులను వల్లంపల్లి మాజీ సర్పంచ్ వెల్మ సమతా నవీన్‌రెడ్డి జగిత్యాల క్రీడా మైదానంలో సుమారు 13 వేల రూపాయల విలువ గల 24 దుస్తులను విద్యార్థులకు అందజేశారు. ఈనెల 23,24,25 తేదీల్లో హైదరాబాద్‌లో జరగబోయే 68వ ఎస్‌జి ఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి కరీంనగర్ అండర్-14 బాల బాలికల జట్టుకు క్రీడా దుస్తులను బచ్పన్, ఏహెచ్పిఎస్ కరస్పాండెంట్ వెల్మ నవీన్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి లక్ష్మీరాం నాయక్, ఫిజికల్ డైరెక్టర్‌లు రవీందర్, రమేష్, లక్ష్మణ్, ప్రణయ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

తుల ఉమ పరామర్శ

నవతెలంగాణ-మేడిపల్లి

మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన రావు శ్రీనివాసరావు తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా జడ్పి మాజీ చైర్ పర్సన్ తుల ఉమ బాధిత కుటుంబాన్ని నేరుగా పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్‌కుమార్, బాలసాని మారుతిగౌడ్ పాల్గొన్నారు.

ఈ-పాస్ ద్వారానే అమ్మకాలు జరగాలి

నవతెలంగాణ-మేడిపల్లి



రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈపాస్ విధానం ద్వారా ఎరువులను అమ్మాలని ఉమ్మడి మేడిపల్లి మండల వ్యవసాయ అధికారి షాహిద్ అలీ సూచించారు. శుక్రవారం భీమారం మండలంలోని భీమారం, కమ్మరిపేట, గోవిందారం గ్రామాల్లో ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. రికార్డులను, రసీదులను తనిఖీ చేసి సంబంధిత యజమానులకు జాగ్రత్తలను సూచించారు. రైతులు విత్తనాలు కొనేటప్పుడు విధిగా రషీద్ తీసుకోవాలని రైతులకు జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి షహీద్ అలీ, డీలర్లు పాల్గొన్నారు.

కట్లకుంటలో గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-మేడిపల్లి



మండలంలోని కట్లకుంట గ్రామ శివారులోని వ్యవసాయ పొలాలలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్టు మేడిపల్లి స్టేషన్ హౌజ్ అధికారి జి. శ్యామ్ రాజ్ తెలిపారు. మృతుడి వివరాలు కానీ చిరునామా కాని తెలిస్తే సెల్ 8712656792కు, మేడిపల్లి పోలీస్ స్టేషన్లో సంప్రదించగలరని తెలిపారు. మృతదేహాన్ని జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

ఎస్‌టీఎఫ్(యూ-17) రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు 'జ్యోతి' విద్యార్థిని

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

పట్టణంలోని జ్యోతి హై స్కూల్ ఐఐటి అకాడమీకి చెందిన 9వ తరగతి విద్యార్థిని సంజన ఈ నెల 21వ తేదీన చొప్పదండిలో జరిగిన ఎస్‌జీఎఫ్ జోనల్ స్థాయి అండర్-17 నెట్ బాల్ పోటీలలో ప్రతిభ కనబర్చింది. ఈనెల 23 నుంచి 25 వరకు మహబూబాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపిక కావడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బియ్యాల హరిచరణ్ రావు విద్యార్థిని సంజనను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు బియ్యాల హరి చరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజిత, రజిత, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-మేడిపల్లి :ఎమ్మార్పీఎస్ మండల నిర్మాణ కమిటీని జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి నక్క సతీష్ మాదిగ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సంఘం భవనంలో మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథులుగా ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు ధూమాల గంగారాం మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాదిగ హాజరై మాట్లాడుతూ మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లాలో జరిగిన ఉమ్మడిగా జిల్లా సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయంలో భాగంగా మండల పూర్తి స్థాయి కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. మండల అధ్యక్షుడిగా చెప్యాల రాజేష్, గౌరవ అధ్యక్షుడిగా శంకర్, అధికార ప్రతినిధిగా చిట్యాల రాజేందర్, ఉపాధ్యక్షుడిగా సామ్యూల్, ప్రధాన కార్యదర్శిగా మకిలి సురేష్, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, ఎంఎస్పి మండల ఇన్‌చార్జి విజయ్‌కుమార్‌తో 10 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకొని నియామక పత్రంను నేరుగా అంద జేశారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు బంగారు దీపక్, రమేష్, ఆనంద్, ధోని పాల రాకేష్, ప్రణయ్, మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా రుద్ర శ్రీనివాస్

నవతెలంగాణ-కోరుట్ల : పట్టణానికి చెందిన రుద్ర శ్రీనివాస్‌ను రాష్ట్ర పద్మశాలి సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్‌గా నియమిస్తున్నట్టు రాష్ట్ర టీఆర్‌పీఎస్ వల్ల కాటి రాజ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రుద్ర శ్రీనివాస్ మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో రాష్ట్ర పదవి ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన తహసీల్దార్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను తహసీల్దార్ ప్రసాద్ శుక్రవారం తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ మంతా కలియ తిరిగి పరిసరాలను పరిశీలించారు. కిచెన్ రూమ్ బాత్రూం డ్రింకింగ్ వాటర్ స్టాక్ రూమ్, పైన పోర్షన్ గదులు బాత్రూం పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

విద్యార్థుల గిరిజన నృత్య ప్రదర్శన



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా మండలంలోని కోమటి కొండాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థినులు చేసిన గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు సుధారాణి, విశాల్, రాణి, నర్మదా, జ్యోష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

24 మందికి కోటి 20 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా

- సింగపూర్, ఉక్రెయిన్ మృతుల దరఖాస్తుల తిరస్కరణ
- అత్తా, కోడలు వివాదంతో ఒక దరఖాస్తు పెండింగ్
- విదేశీ సర్టిఫికెట్ల పరిశీలన కోసం మరికొన్ని పెండింగ్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఎన్నో ఏండ్లుగా గల్ఫ్ కార్మికులు చేసిన పోరాటానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనుకులంగా స్పందించింది. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి వివిధ కరణాలతో మృతి చెందిన కార్మికులకు రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 16న జీవో జారీ చేసింది. లాభోక్తుల ఎంపిక, చెల్లింపు కోసం అక్టోబర్ 7న మార్గదర్శకాల జీవో జారీ చేశారు. ఆర్థిక సహాయం కోసం మృతుల కుటుంబ సభ్యులు పెట్టుకున్న దరఖాస్తులను తహసీల్దార్ల ద్వారా పరిశీలన చేయించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఎంపిక ప్రక్రియను పూర్తి చేశారు. 24 మంది గల్ఫ్ మృతుల వారసులకు రూ.5 లక్షల చొప్పున కోటి 20 లక్షల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేశారు. త్వరలో ఎక్స్‌గ్రేషియా మంజూరు పత్రాలను మృతుల కుటుంబాలకు అందజేస్తారు. ప్రభుత్వ ట్రెజరీ ద్వారా సొమ్మును లాభోక్తుల బ్యాంకు ఖాతాలకు నేరుగా బదిలీ చేస్తారు. ఎండపల్లి మండలం కొత్తపేటకు చెందిన గోనె నరేందర్ సింగపూర్‌లో, నడిపొట్టు సత్తయ్య ఉక్రెయిన్‌లో మృతి చెందారు. ప్రభుత్వం జారీ చేసిన జీవోలో ఉన్న గల్ఫ్ దేశాల జాబితాలో సింగపూర్, ఉక్రెయిన్‌లు లేనందున వీరి దరఖాస్తులను తిరస్కరించారు. ఎక్స్‌గ్రేషియా సొమ్మును పంచుకునే విషయంలో అత్తా, కోడలుకు (మృతుడి తల్లికి, భార్యకు) ఏకాభిప్రాయం లేనందున ఒక దరఖాస్తు పెండింగ్‌లో ఉంది. విదేశీ సర్టిఫికెట్ల పరిశీలన కోసం మరి కొన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భరోసాగా నిలిచారు. గల్ఫ్ బాధితులకు కాంగ్రెస్ అభయహస్తం అందిస్తుందని టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి అన్నారు. గల్ఫ్ దేశాలలో మృతి చెందిన కార్మికుల వారసులకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపు కోసం జిల్లా కలెక్టరేట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. జగిత్యాల జిల్లాలో ఎక్స్‌గ్రేషియా మంజూరైన 24 మంది గల్ఫ్ మృతుల వివరాలు స్వగ్రామం,స్వస్థలం, మండలం, చనిపోయిన దేశం వారీగాఅసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఈ విధంగా ఉన్నాయి.

జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గం

సూద వినయ్‌కుమార్, నర్సింహులపల్లి, బీర్పూర్, (రియాద్, సౌదీ అరేబియా)బీ గొల్ల కొమురయ్య, కొల్వాయి, బీర్పూర్ (అబుదాబి, యూఏఈ), బండ్ర రాజశేఖర్, కొల్వాయి, బీర్పూర్ (దుబాయి, యూఏఈ), ఎంబారి నర్సయ్య, అల్లీపూర్, రాయికల్ (దుబాయి, యూఏఈ), తునికి శేఖర్, కొత్తపేట, రాయికల్ (దుబాయి, యూఏఈ), తౌటు రాంచంద్రం, క్రిష్ణానగర్, జగిత్యాలటౌన్ (దుబాయి, యూఏఈ), సింగారపు గంగాధర్, గాంధీనగర్, జగిత్యాలటౌన్ (దుబాయి, యూఏఈ), కొత్తకొండ సాయి క్రిష్ణ, పురానిపేట, జగిత్యాల టౌన్ (కువైట్)

కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం

అల్లె రామస్వామి, శివాజీనగర్, మెటుపల్లి (రియాద్, సౌదీ అరేబియా) గట్ల శ్రీనివాస లక్ష్మణ్, వెల్లుల్ల రోడ్, మెటుపల్లి (దుబాయి, యూఏఈ), వెల్దుర్తి ప్రమోద్ కుమార్, కోరుట్ల (దుబాయి, యూఏఈ), మహ్మద్ నబీ, మాదాపూర్, కోరుట్ల (రియాద్, సౌదీ అరేబియా), సురకంటి చిన్న రాజరెడ్డి, అయిలాపూర్, కోరుట్ల (దుబాయి, యూఏఈ), కందెల్ల వెంకటి, వేంపల్లి, మల్లాపూర్ (రియాద్, సౌదీ అరేబియా), ఉప్పు గంగన్న, సాతారం, మల్లాపూర్ (దుబాయి, యూఏఈ)

వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం

నిమ్మ శేఖర్, దమ్మన్నపేట, మేడిపల్లి (దమ్మామ్, సౌదీ అరేబియా), నాంపల్లి మహేష్, కట్లకుంట, మేడిపల్లి (బహరేన్), కొమిరెల్లి పెద్ద గంగారెడ్డి, తండ్రియాల్, కథలాపూర్ (రియాద్ సౌదీ అరేబియా), భూమల్ల గణేష్, మోత్కురావుపేట, బీమారం (దుబాయి, యూఏఈ)

ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం

పరుశునేని రమేష్, చందోలి, గొల్లపల్లి (దోహా, ఖతార్), పులిశెట్టి రాజన్న, దమ్మన్నపేట, ధర్మపురి (రియాద్, సౌదీ అరేబియా), గోవిందుల రవి, గోపులాపూర్, బుగ్గారం (రియాద్, సౌదీ అరేబియా), బైర శ్రీనివాస్, పెగడపల్లి (కువైట్)

చొప్పదండి అసెంబ్లీ నియోజకవర్గం

కంకణాల శ్రీకాంత్, నాచుపల్లి, కొడిమ్యాల (దోహా, ఖతార్), యదరవేని రవీందర్, డబ్బు తిమ్మయ్యపల్లి, కొడిమ్యాల (దుబాయి, యూఏఈ)

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్

నవతెలంగాణ-మల్లాపూర్



గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. వారి వెంట తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో జగదీష్, ఆర్ఐ సురేష్, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



నిర్వాహకులతో మాట్లాడుతున్న బిఎస్ లత

నవతెలంగాణ-మల్లాపూర్

మండలంలోని ముత్యంపేట గ్రామంలో సెర్ప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బి.ఎస్ లత శుక్రవారం ఆకస్మిక తనకి చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం కొనుగోలు నిర్వహణ రైతుల దాన్యం తూకం, మిల్లులకు తరలించిన బస్తాల వివరాలు సీరియల్ తదితర రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వీర్‌సింగ్, ఏపీఎం దేవరాజ్, రైతులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేసి రైతుల వివరాలను ట్యాబ్‌లో నమోదు చేయాలని ధాన్యం కొనుగోలు సెంటర్ నిర్వాహకులకు జిల్లా అదనపు కలెక్టర్ లత సూచించారు.శుక్రవారం మెట్ పల్లి మండలంలోని పెద్దపుర్, రామారావ్ పల్లె, ఏ ఎస్ ఆర్ తండాలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి కొనుగోలు వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

రెండవ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి

- తెలంగాణ 2వ ఏఎన్ఎం అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షురాలు పడాల మమత
- జాతీయ వైద్య మిషన్ కేంద్ర సహాయ కార్యదర్శి డాక్టర్ సరోజ్ కుమార్‌కు ఢిల్లీలో వినతి

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

తెలంగాణలో జాతీయ హెల్త్ మిషన్ విభాగంలో రెండవ ఏఎన్ఎంలుగా 18 ఏండ్లుగా 30 రకాల విధులను పల్లెల్లో, పట్టణాల్లో వైద్య సేవలందిస్తున్నామని , తమను ఎలాంటి రాత పరీక్షా లేకుండా రెగ్యులర్ చేయాలని తెలంగాణ 2వ ఏఎన్ఎంల అసోసియేషన్ ఫౌండర్ అధ్యక్షురాలు పడాల మమత జాతీయ హెల్త్ మిషన్ కేంద్ర సహాయ కార్యదర్శి డాక్టర్ సరోజ్ కుమార్‌ను విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని జాతీయ హెల్త్ మిషన్ కేంద్ర కార్యాలయానికి వెళ్లి సరోజ్‌కుమార్‌కు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మమత మాట్లాడుతూ.. మొదటి ఏఎన్ఎంలతో సమానంగా 10 ఏండ్లకు పైగా రెండవ ఏఎన్ఎంలు జాతీయ వైద్య మిషన్‌లో వివిధ రకాల సేవలందిస్తున్న ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. రెండవ ఏఎన్ఎం, యూపిహెచ్‌సీ, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిన తెలంగాణాలో 6 వేల మంది పని చేస్తున్నారని తెలిపారు. గత ఏడాది జులై నెలలో విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 1930 పోస్టులు మాత్రమే వేసి, మిగతవాటిని విస్మరిం చారని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 వరకు ఉద్యోగంలో ఉన్నవారిని రోస్టర్ ప్రకారం సీనియారిటీని పరిగణలోకి తీసుకుని రెగ్యులరైజ్ చేయాలని కేంద్ర వైద్య మిషన్ సహాయ కార్యదర్శిని కోరారు.

ఇసుక లారీ పట్టివేత

నవతెలంగాణ - మెట్‌పల్లి



అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సిఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. పక్కసమాచారంతో పోలీసులు రెవిన్యూ సిబ్బందితో కలిసి మెట్ పల్లి బస్ డిపో వద్ద తనిఖీలు చేస్తుండగా కోరుట్ల వైపు నుంచి నిజామాబాద్ వెళుతున్న టీఎస్ 18 టి 8019 నెంబర్ గల లారీని తనిఖీ చేయగా అందులో ఇసుకను గుర్తించి డ్రైవర్ ధారవేణి భూమయ్యను విచారించగా లారీ యజమాని రజినీకాంత్ రెడ్డి ఆదేశం మేరకు కథలాపూర్ మండలంలోని శివారు గ్రామాల నుంచి ఇసుక తరలిస్తున్నట్టు చెప్పాడు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ , ఓనర్ పై కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి తదుపరి విచారణ నిమిత్తం కోర్టులో హాజరు పరుచగా కోర్టు ఆదేశాల మేరకు మైనింగ్ అధికారులకు లారీని అప్పగించమన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ సత్తయ్యపోలీసు సిబ్బంది ,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

నవతెలంగాణ-జగిత్యాల

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు విద్యార్థులకు కార్పొరేట్ ప్రమాణాల స్థాయిలో నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం గొల్లపల్లి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్, జూనియర్ (బాలికల) కళాశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంచి భోజనం. అందించాలన్నారు. పాఠశాల్లో అన్ని వసతులు సదుపాయాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీవో మధుసూధన్, బీసీ వెల్ఫేర్ అధికారి సాయిబాబా, తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో ఉన్నారు.

వెనుగుమాట్ల, తిర్మలపూరు, ఎండపల్లి మండలం లోని గుల్లకోట గ్రామంలో ప్యాక్స్ ఐకేపీ సెంటర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు.

గవర్నమెంట్ హాస్పిటల్‌లో డెలివరీలు ప్రోత్సహించాలి

గవర్నమెంట్ హాస్పిటల్‌లో డెలివరీలు ప్రోత్స హించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు. ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానలోని వైద్యాధికారులకు వైద్యారోగ్య శాఖ పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్‌రెడ్డి, డాక్టర్ అర్చన పాల్గొన్నారు.

బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేసిన కమిషనర్

నవతెలంగాణ-మెట్‌పల్లి



మెట్‌పల్లి పట్టణంలోని కోర్టు వద్ద గల షెడ్యూల్ కులాల ఎస్సీ బాలికల వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ మోహన్ తనిఖీ నిర్వహించారు. వసతి గృహంలోని వంట సామగ్రి, కిచెన్, టాయిలెట్స్ పరిశీలించి, మధ్యాహ్నం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో డి ఈ నాగేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు ,ముజీబ్, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ టి శ్రీలత, విద్యార్థినిలు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో ఛలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మేడిపల్లి

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1 తేదీన మాల మహానాడు ఆధ్వర్యంలో చేపట్టే మాలలు సింహ గర్జనను విజయవంతం చేయాలని మేడిపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. హైదరాబాద్‌లో జరిగే సింహ గర్జనకు మండలంలోని అన్ని గ్రామాల నుండి మాలలు అధిక సంఖ్యలో హాజరు కావాలని జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వేల్ఫేర్ జిల్లా నాయకులు కాయితి శంకర్, మెట్టు దాస్, మాలమహానాడు జిల్లా నాయకులు వేల్పుల ప్రమోద్, కొండ్ర గంగాధర్ ,దామెర రాజయ్య శ్యాం, రాకేష్, వంశీ, మధు, రవితేజ, శేఖర్, దేవయ్య పాల్గొన్నారు.

మెట్ పల్లి: మెట్‌పల్లి అంబేద్కర్ పార్కులోని శుక్రవారం చలో హైదరాబాద్ మాలల సింహగర్జన పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. డిసెంబర్ 1న హైదరాబాద్ పెరెడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహ గర్జనలో మాలలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకుడు కాయితి శంకర్, మెట్టు దాస్, మాల మహానాడు నాయకులు గోరుమంతుల సురేందర్, నాగరాజు,దామెర రాజయ్య ,కోండ్ర గంగాధర్ పాల్గొన్నారు.

సాంస్కృతిక సారధి కళాబృందం ప్రదర్శన

నవతెలంగాణ-మల్లాపూర్



ప్రదర్శన చేస్తున్న కళాబృందం సభ్యులు

మండల కేంద్రంతో పాటుగా కొత్తదామరాజుపల్లి, మొగిలిపేట గ్రామాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రజా దినోత్సవాల్లో భాగంగా సాంస్కృతిక సారధి కళాబృందం శుక్రవారం ప్రదర్శనలు చేపట్టారు. గడిచిన ఏడాది కాలంలో అమలు చేసినటువంటి ప్రభుత్వ పథకాలను ఆటపాటల రూపంలో ప్రజలకు వివరించారు. కళాకారులు పరుశురాంగౌడ్ మహిపాల్, పలిగిరి రాజేందర్, పంచిరి ప్రవీణ్, భోగి అశోక్ సురేష్ నాయక్, రామడుగు పోచయ్య పంబాల రమేష్, కారం రాజ్ కుమార్, రాజేశ్వరి, రమ్య పాల్గొన్నారు.

మేడిపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా మాదం వినోద్‌కుమార్

నవతెలంగాణ-మేడిపల్లి



మేడిపల్లి మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా మాదం వినోద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మిట్టపల్లి రాజిరెడ్డి, పాలకవర్గ సభ్యులుగా అయిత మోహన్, ముస్కెం జలంధర్, పల్లి భీమయ్య, బల్గం రాజేష్, దాసరి గణేష్, మాలోతు హనుమంతు నాయక్, ఎండి ముబిన్ పాష, మామిడి రమ, ఏలేటి మహేష్, సురకంటి రాజిరెడ్డి నియమితులయ్యారు. పదిమంది పాలకవర్గ సభ్యులతో పాటు భీమారం ఫాక్స్ చైర్మన్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ఏడిఏ అగ్రికల్చర్, మేడిపల్లి గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్ సభ్యులుగా ఉంటారు. పాలకవర్గ సభ్యుల ఎంపిక పట్ల మేడిపల్లి మండల ప్రజలు వర్షం వ్యక్తం చేశారు. మేడిపల్లి మార్కెట్ కమిటీ నూతన సభ్యులు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు లారీలు ఢీ

క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్లు

నవతెలంగాణ-మల్యాల

ఎదురెదురుగా వస్తున్న రెండు లారీలు ఢీకొన్న ఘటన మల్యాల మండలంలో చోటు చేసుకుంది. కరీంనగర్-జగిత్యాల రహదారి కొండగట్టు వద్ద శుక్రవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మార్బుల్స్ లోడ్, పత్తి లోడుతో వస్తున్న రెండు లారీలు ఢీకొనడంతో లారీల ఎదుట భాగం నుజ్జు నుజ్జునుజ్జయింది. ఘటనలో క్యాబిన్‌లో ఇద్దరు డ్రైవర్లు దేవిలాల్, వీరయ్య ఇరుక్కుపోయారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు జేసీబీలతో వారిని బయటకు తీశారు. చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఎస్సారెస్పీ ఈఈకి సన్మానం

నవతెలంగాణ-మెట్‌పల్లి

ఎస్సారెస్పీ క్యాంపు ఈఈగా పని చేస్తూ ఇటీవల పదవి విరమణ చేసిన నీలం వెంకటేశ్వర్లను జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాల కరస్పాండెంట్ ఇల్లెందుల శ్రీనివాస్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పదవిలో ఉండగా ఆయన ప్రజలకు చేసిన సేవలను గుర్తు చేసుకు న్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు రాకేష్, తిరునగరి శ్రీనివాస్ స్వామి, పులి విష్ణు కిషోర్, ప్రిన్సిపాల్ సంతోష్, వైస్ ప్రిన్సిపాల్ రాజు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రైతులకు బోనస్ జమ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాలో రూ.500 బోనస్ జమ చేసిన సందర్భంగా రైతులు ఆనందం వ్యక్తం చేశారు. జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి ఐకేపీ కొనుగోలు కేంద్రంలో సన్నా రకాలు అమ్మిన రైతులకు బోనస్ జమ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వి.గంగాధర్, ఏఈవో రమ్య, సీసీ మరియా, వీఓఏ జల, రైతులు చిన్న గంగరాజం, మల్లయ్యరెడ్డి, రాజాం, గట్టు మల్లయ్య, బుజ్జమ్మ, కేంద్ర నిర్వా హకులు, పలువురు రైతులు ఉన్నారు.

వరి కోయ్యలను కాల్చి వేయవద్దు...

మండల వ్యవసాయ అధికారి అనూష



అవగాహన వ్యవసాయ అధికారులు

నవతెలంగాణ - ముస్తాబాద్.

మండల కేంద్రంలో గల రైతు వేదికలో శుక్రవారంవరి కొయ్యలను కాల్చటం ద్వారా జరిగే నష్టాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి అనూష మాట్లాడుతూ వరి కొయ్యలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నటం ద్వారా భూమికి సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. వరి కొయ్యలకు నిప్పు పెట్టడం ద్వారా పంటకు మేలు చేసే మిత్ర పురుగులు మరణిస్తాయని, అంతే కాకుండా వరి కొయ్యలను కాల్చటం ద్వారా వచ్చే వాయువుల వలన వాతావరణ కాలుష్యం అవుతుందన్నారు. దున్నే ముందు సూపర్ ఫోజ్ఫేట్ చల్లితే కొయ్యలు, గడ్డి తొందరగా కుళ్లిపోయి ఎరువుగా మారి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవోలు వెంకటేష్, నరేష్, రేవతి, సౌమ్య, అఖిల, కీర్తన, రైతులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శిగా మూశం రమేష్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



రాజన్న సిరిసిల్ల జిల్లా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శిగా ముశం రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా మహాసభలు జరుగగా మూశం రమేష్‌ను రెండో సారి జిల్లా కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగుభాస్కర్, రాష్ట్ర కమిటీ సభ్యులు టీ స్కైలాబ్‌బాబు, జిల్లా బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. బడుగు బలహీన కార్మిక వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉరేసుకుని పదో తరగతి విద్యార్థి ఆత్మహత్య

నవతెలంగాణ - కొనరావుపేట

పదో తరగతి విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కొనరావుపేట మండలంలోని సుద్దాల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుద్దాలకు చెందిన అలువాల అంజవ్వ - శ్రీనివాస్‌లకు ఇద్దరు కొడుకులు ఉన్నారు. చిన్న కొడుకు వెంకటేష్(16) సుద్దాల ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. వెంకటేష్ చదువులో వెనకబడగా తల్లిదండ్రులు మందలించాడని మనస్థాపంతో శుక్రవారం ఉదయం ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలోనూ గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. పోస్టు మార్టం కోసం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తుట్టు ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి తెలిపారు.

గంభీరావుపేట ఎస్ఐగా శ్రీకాంత్ బాధ్యతలు

నవతెలంగాణ - గంభీరావుపేట :



గంభీరావుపేట ఎస్ఐగా శ్రీకాంత్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్ఐ.శ్రీకాంత్ మాట్లాడుతూ నేరాల కట్టడి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ సూచించారు. మండలంలోని శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలందరూ సహకరించాలని, ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి కలవవచ్చునన్నారు. అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు చిన్ని బాబు ఆధ్వర్యంలో రూ.3లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సద్ది లక్ష్మారెడ్డి, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని ప్రభుత్వం కాపాడడానికి పెద్దపీట వేస్తామన్నారు. ఆసుపత్రిల్లో వైద్యం కోసం ఖర్చు పెట్టుకున్న బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద డబ్బులను ఇవ్వడం ఆదుకున్నట్లు అవుతుందన్నారు. పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడానికి ప్రభుత్వం అత్యవసరంగా ఎల్‌ఓసిలను కూడా మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు గుండాటి రాంరెడ్డి, డైరెక్టర్లు గంట చిన్న లక్ష్మి, బుచ్చగౌడ్, జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, మండల అధికార ప్రతినిధి పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ సెల్ కార్యదర్శి అంతర్పుల గోపాల్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు నవాబ్, గంట అంజయ్య, స్వామి, ద్యాగం నారయణ, గంట వెంకటేష్, గన్న మల్లారెడ్డి, గన్న శోభ, ప్రతాప్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సన్న వడ్ల సాగుకు రైతులు ఆసక్తి

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సయ్య

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి మండలాలలో సన్న వడ్ల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మటి నర్సయ్య అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నర్సయ్య మాట్లాడుతూ ఖరీఫ్‌లో సాగుచేసిన సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రభుత్వం చెల్లిస్తుండడంతో రైతుల్లో ఆనందం నెలకొందన్నారు. ఇప్పటికే రైతులు దొడ్డు వడ్ల విత్తనాలను కొన్నప్పటికి ప్రభుత్వంపై నమ్మకం ఏర్పడడంతో సన్న వడ్లు సాగుకే ముందుకు వెళ్లుతున్నారన్నారు. ఇప్పటికే దొడ్డు వడ్లు విత్తనాలను కొన్న రైతులు వాటిని తిరిగి డీలర్లకు ఇచ్చేవేసి సన్న వడ్లు కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సాగుబడికి రైతులు సుముకత వ్యక్తం చేయడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నరన్నారు. ఎక్కువ రోజులు ఆలస్యం కాకుండా బోనస్‌గా ప్రకటించిన రూ.500 వెంటనే చెల్లించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నర్సయ్య తెలిపారు.

పంటల ప్రణాళిక మీద రైతులతో శాస్త్రవేత్తల చర్చా గోష్టి

నవతెలంగాణ - కథలాపూర్

మండల కేంద్రంలోని రైతు వేదికలో జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ వారి ఆధ్వర్యంలో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల విద్యార్థులు రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శనతో పాటు యాసంగి పంటల ప్రణాళిక మీద రైతులతో శాస్త్రవేత్తల చర్చా గోష్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఏరువాక కేంద్రం, కోఆర్డినేటర్ డాక్టర్ కె. మదన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయంలో వస్తున్న అధునాతన సాంకేతిక విధానాలని అందిపుచ్చుకోవాలి సూచించారు. అలాగే రాబోయే యాసంగిలో రైతులందరూ ఆరుతడి పంటల సాగు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, పోలస, వ్యవసాయ పరిశోధన సంచాలకులు డాక్టర్ జి. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులందరూ మారుతున్న వాతావరణానికి అనుగుణంగా పంటల సరళిని మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యోగిత ఏరువాక కేంద్రం, కరీంనగర్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. మదన్ మోహన్ రెడ్డి, శాస్త్రవేత్త రాజేంద్రప్రసాద్, వ్యవసాయ పరిశోధన స్థానం, శాస్త్రవేత్తలు పి. మధుకర్‌రావు, డాక్టర్ డి. శ్రావణి, వ్యవసాయ కళాశాల, జిల్లెల అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకట్రావు పాల్గొన్నారు.

వరి కోయ్యాలను కాలిస్తే ముప్పే!

- భూమిలోని పోషకాలపై తీవ్ర ప్రభావం
- పంట దిగుబడి తగ్గే ఛాన్స్
- వాయి కాలుష్యంతో రైతులకు చేటు
- అవగాహన కల్పనకు వ్యవసాయ శాఖ సన్నద్ధం

నవతెలంగాణ - సిరిసిల్ల రూరల్ :

వరి కొయ్యలు, ఆయా పంటల అవశేషాలను దహనం చేయరాదు. ఒకవేళ చేస్తే తీవ్ర నష్టం జరగవచ్చు. భూమిలోని పోషకాలు తగ్గి దిగుబడి పడిపోవచ్చు. పంటకు మేలు చేసే పోషకాలు కూడా దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్, ఫాస్పరస్, పొటాషియం ఆవిరై భవిష్యత్తులో పంటల ఉత్పాదకపై ప్రతికూల ప్రభావం పడనుంది. వాయు కాలుష్యం వల్ల రైతు ఆరోగ్యానికి చేటు కూడా. అందువల్ల వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించేందుకు సన్నద్ధం అవుతున్నారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 2.43 వేలఎకరాల వ్యవసాయ భూములు ఉండగా.. ఇందులో ప్రధానంగా వరి 1.83 వేల ఎకరాలో సాగు చేస్తున్నారు. పంట కొయ్యలతో పాటు వాటి అవశేషాలను రైతులు కాల్చి వేస్తున్నారు. దీంతో భూసారంతో పాటు వాయు కాలుష్యంతో ఆరోగ్యాలు దెబ్బ తింటున్నాయని వ్యవసాయ శాఖ చెబుతోంది. వాటిని తగలబెట్ట వద్దని రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతోంది. ఒకవేళ తగలబెడితే చర్యలు తప్పవని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఢిల్లీ, పంజాబ్ లాంటి రాష్ట్రాల్లో ఇలాంటి చర్యల వల్ల వాయు కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బడులకు సెలవులు ఇస్తున్నారు. ఆ పరిస్థితి మన రాష్ట్రంలో రావద్దంటే వరి, ఇతర పంటల అవశేషాలు కాల్చవద్దని హెచ్చరిస్తున్నారు.

వరి కొయ్యలను కాలిస్తే జరిగే నష్టాలివే..

- పంటల అవశేషాలు కాల్చడంతో వాయు కాలుష్యం పెరుగుతుంది.
- మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతిని, మట్టి జీవ చక్రం అస్తవ్యస్తంగా మారుతుంది.



- దహనం వల్ల మట్టిలోని నీటి నిలువ సామర్థ్యం తగ్గుతుంది. పంటలకు నీటి అవసరం పెరుగుతుంది.

భూసారం పెంపునకు ఉపయోగం..

- వరి కోయ్యలు, ఇతర పంటల అవశేషాలు తగలపెట్టకుండా నెలలో కలియదున్నితే అవి సహజ సేంద్రియ ఎరువులుగా మారి భూసారం పెరుగుతుంది. కంపోస్టు ఎరువులుగా తయారు చేసుకోవచ్చు. పశువులకు మేతగా ఉపయోగించవచ్చు.
- వరి కొయ్యలను మల్చింగ్ పదార్థంగా వాడటం వల్ల నేలతేమ శాతం పెరుగుతుంది. మొక్కకు కూడా అనుకూల వాతావరణం లభిస్తుంది.

దుక్కిలో దున్నేస్తేనే మేలు



వరి కొయ్యలు, ఇతర పంట అవశేషాలు తగలబెట్టడంతో భూసారం దెబ్బతింటుంది. భవిష్యత్తులో పంటల దిగుబడి గణనీయంగా తగ్గొచ్చు. వాయు కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. వాటిని తగల బెట్టకుండా దుక్కిలో దున్నేస్తే సేంద్రియ ఎరువులు తయారవుతాయి. కొయ్యలను తగలబెట్టితే రైతులపై చర్యలు తప్పవు.

- అఫ్జల్ బేగం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, రాజన్న సిరిసిల్ల

వాడ వాడలో ప్రజా పాలనపై కళా యాత్ర



కళా ప్రదర్శన చేస్తున్న కళాకారులు..

నవతెలంగాణ - వేములవాడ

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారెంటీలపై తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులు యాత్ర శుక్రవారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్, టెంపుల్ ఏరియా, కోరుట్ల బస్ స్టాండ్‌లో కళాకారుల ప్రదర్శనలో, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, యువతకు 56వేల ఉద్యోగాల ఉపాధి అవకాశాలు కల్పించిన పలు అంశాలపై పాటల రూపంలో కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని, గృహజ్యోతి కింద పేదలకు 200వరకు ఉచిత విద్యుత్తు రూ.500కే సిలిండర్ ఆరోగ్యశ్రీ 5 లక్షల నుండి 10 లక్షల వరకు పెంచడం, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ముఖ్యమంత్రి స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం మహిళా శక్తి క్యాంటీన్ల ద్వారా మహిళల ఆర్థికంగా ఎదగాలని వారికి ఆర్థిక సహాయ అందించడం జరిగిందని వారు పాటల రూపంలో కళాకారులు ప్రదర్శన ఇచ్చారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి సంవత్సరంలో విజయవంతంగా పూర్తి చేసిన ప్రజా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలలో ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారధి కళాబృందం టీం లీడర్లు ఎడమల శ్రీధర్ రెడ్డి, కళాకారులు పొత్తూరి రాజు, శ్రీరాముల రామచంద్రం, గడ్డం దేవయ్య, గడ్డం శ్రీనివాస్, వంతడుపుల గణేష్, గుగ్గిళ్ల పరశురాములు, పూడూరు సంజీవ్, అంతడుపుల ఝాన్సీ, లావణ్య, కెన్నెర, శ్రీలత, అనుముల శిరీష తోపాటు పార్టీ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

డీడబ్ల్యూఎస్ఎం లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి

- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ
- వరల్డ్ టాయిలెట్ డే పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - సిరిసిల్ల

డీడబ్ల్యూఎస్ఎం లక్ష్యాల సాధనకు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ కలెక్టరేట్ మినీ సమావేశం మందిరంలో డీడబ్ల్యూఎస్ఎం (జిల్లా వాటర్ సానిటేషన్ మిషన్) నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ మాట్లాడుతూ జిల్లాలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా విభాగాలను పర్యవేక్షించేందుకు డీడబ్ల్యూఎస్ఎం (జిల్లా వాటర్ సానిటేషన్ మిషన్) ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్, జల్ జీవన్ మిషన్ కార్యక్రమాలను డీడబ్ల్యూఎస్ఎం పర్యవేక్షిస్తుందని అన్నారు. మన జిల్లాను ఓడీఎఫ్‌గా ప్రకటించామని, దీనిని నిలబెట్టే విధంగా చర్యలు చేపట్టాలని, జిల్లా వ్యాప్తంగా జరిగే నూతన ఇండ్ల నిర్మాణాలకు టాయిలెట్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. మన గ్రామాలను ఓడీఎఫ్ం గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా జరగాలని, ప్రతి గ్రామంలో నిర్మించిన కాంపోస్ట్ షెడ్, సామూహిక ఇంకుడు గుంతల పూర్తి స్థాయిలో



వరల్డ్ టాయిలెట్ డే పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ జా, అధికారులు

వినియోగించాలని కలెక్టర్ తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా నిర్మించిన వసతుల వినియోగం పర్యవేక్షించాలన్నారు. ప్రతి మండల స్థాయిలో పారిశుధ్యపై సమావేశం నిర్వహించాలని, బాగా పని చేసేవారిని సన్మానించాలని కలెక్టర్ తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా కోసం నరేగా, డీఎంఎఫ్టీ, సీఎస్ఆర్ మొదలగు నిధులు వినియోగించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ వరల్డ్ టాయిలెట్ డే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి, సీఈవో, జెడ్పీ వినోద్, డీఏవో అఫ్జలి బేగం, డీపీఆర్వో వి.శ్రీధర్, ఈఈ ఇరిగేషన్ అమరేందర్ రెడ్డి, ఈఈ మిషన్ భగీరథ జానకి, డి.తో.డబ్ల్యూ ఓ. జనార్దన్, మేనేజర్, ఎస్.బి.ఎ. సురేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరగాలి

ఉప జిల్లా వైద్యాధికారులు డాక్టర్ అంజిలా ఆల్రెడ్, డాక్టర్ రజిత

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలని ఉప వైద్యాధికారులు డాక్టర్ అంజిలా ఆల్రెడ్, డాక్టర్ రజిత ఎల్లారెడ్డిపేట మండలంలోని వైద్య సిబ్బందికి సూచించారు. జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసంతరావు ఆదేశాల మేరకు ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం నేషనల్ హెల్త్ ప్రోగ్రాంలో పాల్గొన్నారు. యంసిహెచ్, ఎన్‌సిడికి సంబంధించి వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణి పేరును మొదటి 84రోజులలోపే నమోదు చేసి సంబంధిత ప్రాథమిక, జిల్లా ఆసుపత్రులలో క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలన్నారు. ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగేలా చూడాలని తగు సూచనలు ఇచ్చారు. హై రిస్క్ ప్రెగ్నెసికి సంబంధించి రెగ్యూలర్‌గా ఫాలో అప్



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారులు

చేయించాలని ఆదేశించారు. ప్రతి ఒక గర్భిణికి ఐరన్ ఫోలిక్ మాత్రలు అందేలా చూడాలని సూచించారు. ఈ సమావేశములో యంసిహెచ్ కో - ఆర్డినేటర్ బాలచందర్, ఎన్‌సిడి కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, హెచ్ఇ బాలయ్య, ఇంచార్జ్ మెడికల్ అధికారులు డాక్టర్ స్రవంతి, డాక్టర్ చిరంజీవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీగిపోయిన అవిశ్వాసం..

నవతెలంగాణ - ముస్తాబాద్

ముస్తాబాద్ సహకార సంఘం చైర్మెన్‌పై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. వివరాలు ఇలా ఉన్నాయి. ముస్తాబాద్ సహకార సంఘం చైర్మెన్ అన్నం రాజేందర్ రెడ్డిపై తొమ్మిది మంది సభ్యులు గత నెల 29న అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో జిల్లా సహకార అధికారి బలనిరూపణకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం సహకార సంఘంలో బలపరీక్ష నిర్వహించారు. అయితే బలపరీక్షకు 8మంది సభ్యులు మాత్రమే హాజరయ్యారు. దీంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయినట్లు జిల్లా సహకార అధికారి రామకష్ణ ప్రకటించారు.



. బల నిరూపణకు హాజరైన సభ్యులు

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా చేలుకల తిరుపతి

నవతెలంగాణ - రుద్రంగి/చందుర్తి





వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం

రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన చైర్మన్‌గా చెలుకల తిరుపతిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైస్ చైర్మన్‌గా బొజ్జ మల్లేశం, డైరెక్టర్లు సాయికుమార్, శ్రీనివాస్, గజల్ లాల్, అబ్దుల్, లావణ్య, కిషన్, సంతోష్ రెడ్డి, మధు, రవీందర్ రెడ్డి, లచ్చిరెడ్డి, శంకరయ్య ప్రభాకర్, డైరెక్టర్లుగా నియమిస్తూ తెలంగాణ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రుద్రంగి మార్కెట్ ఉమ్మడి మండలానికి సంబంధించినది కావడంతో గతంలో మార్కెట్ కమిటీ ఏర్పడినప్పటి నుంచి చందుర్తి మండలానికి చెందిన వారికే చైర్మెన్ పదవి వరించింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటి సారిగా రుద్రంగి మండలానికి చైర్మన్ పదవి రావడంతో పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి రావడానికి కృషి చేసిన ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సంబంధిత ధన్యవాదాలు సార్ మంత్రులకు, నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు కార్యకర్తలు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడిగా మల్లారపు అరుణ్ కుమార్

పార్టీ జిల్లా మహాసభల్లో ఎన్నిక

నవతెలంగాణ - వీర్నపల్లి



వీర్నపల్లి మండలం కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ అరుణ్ కుమార్‌ను సీపీఐ(ఎం) రాజన్న సిరిసిల్లా జిల్లా 3వ మహాసభల్లో జిల్లా కార్యదర్శి సభ్యులుగా ప్రకటించారు. సీపీఐ(ఎం) మండల కమిటీ నాయకులు మాట్లాడుతూ గతం 15ఏండ్లనుంచి నమ్ముకున్నా సిద్ధాంతం కోసం నిలబడ్డాడు. మండలంలో కార్మిక ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నారు. పోడు భూముల పోరాటంలో అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసినా కోర్టుల చుట్టూ తిప్పినా పోడు భూములు పోరాటంలో నిలబడి పోరాటం చేస్తున్నారన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు ఇవ్వాలని ఇవ్వాలని పోరాటం చేశాడని గుర్తు చేశారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్నాడని అన్నారు. మండలంలో పేద ప్రజాల కోసం జిల్లా మహాసభల్లో నిర్ణయయించిన తీర్మానలపై ఉద్యమం చేస్తామని సీపీఐ(ఎం) మండలం కమిటీ తరుపున తెలియజేశారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా అరుణ్ కుమార్ ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు నరేందర్, రాజేల్లయ్య, సుమన్, మనోజ్, రాజు దేవయ్య రాజాం పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలతో కాంగ్రెస్ చెలగాటం



మాట్లాడుతున్న రవి గౌడ్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

విద్యార్థుల ప్రాణాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవి గౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గురుకులాలు నరక కూపంలా మారాయన్నారు. ఇటీవలే గిరిజన గురుకులంలో ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యం పాలై ఓ విద్యార్థిని 20రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై కొట్టుమిట్టాడుతున్నదని, హాస్టళ్లు విష పురుగులకు నిలయాలుగా మారుతున్నాయని మండి పడ్డారు. 11నెలల్లో 36మంది విద్యార్థులు చనిపోగా, 600మంది పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్ జరిగి చికిత్స పొందారని పేర్కొన్నారు. ఇంత జరిగినా సీఎం రేవంత్ రెడ్డి స్పందించిన పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరికి ఇంకెంత మంది విద్యార్థులు బలికావాలని ప్రశ్నించ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. లేని పక్షంలో రానున్న రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మట్టే శ్రీనివాస్, కొడం వెంకటేష్, ఒగ్గు అరవింద్, అనిల్ గౌడ్, సాయి, కోడి రోహిత్, శ్యామల శ్రీకాంత్, వెల్మల శ్రీనివాస్, కొండి నవీన్, గణేష్ పాల్గొన్నారు.

ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలి

- విద్యా బోధనలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- విద్యాలయాలను తనిఖీ చేసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ



నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించి, విద్యార్థులకు రుచికరమైన భోజనాన్ని అందించాలని గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లను కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఆదేశించారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్లలోని తెలంగాణ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని అయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యాలయం ఆవరణలో పరిశుభ్రత పనులు పరిశీలించారు. అనంతరం కిచెన్‌లోకి వెళ్లి, కూరగాయలు, పండ్లు ఇతర పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. పలు కూరగాయలు, పండ్ల నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తరగతి గదుల్లోకి వెళ్లి ఉపాధ్యాయురాలు పాఠాలు బోధిస్తుండగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు వేసి, వారి సందేహాలు నివృత్తి చేశారు. అదేవిధంగా నర్సింహులపల్లి, తంగళ్లపల్లిలోని ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి మ్యాథ్స్, సైన్స్, ఇంగ్లీష్ అంశాల్లో నిష్ణాతులను చేయాలని సూచించారు. స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆయనతోపాటు జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, టీచర్లు తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
పెద్దపల్లి
శనివారం | నవంబర్ 23, 2024 | www.navatelangana.com

వకీల్‌పల్లి గని బొగ్గు ఉత్పత్తిపై సమీక్ష

నవతెలంగాణ-యైటింక్లైన్ కాలనీ



వకీల్‌పల్లి గనిని ఏరియా జనరల్ మేనేజర్ బి.వెంకటయ్య శుక్రవారం సందర్శించారు. గని పని స్థలాలను సర్వే మ్యాప్ ద్వారా పరిశీలించి 3 సిమ్ టాప్ సెక్షన్‌లో 4 సిమ్‌లో నడుస్తున్న ఎల్‌హెచ్‌డీ కంటిన్యూస్ మైనర్‌బొగ్గు ఉత్పత్తిపై అధికారులతో సమీక్షించారు. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్న క్రమంలో గనికి కేటాయించిన వార్షిక ఉత్పత్తి లక్ష్యాలను రక్షణ సూత్రాలు పాటిస్తూ గనిలో ఒక చిన్న ప్రమాదం జరగకుండా బొగ్గు ఉత్పత్తి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గని మేనేజర్‌ను కార్మికులు సన్మానించారు. ఆయన వెంట గని ప్రాజెక్ట్ అధికారి ఏ.నెహ్రూ, గని మేనేజర్ రవి కిరణ్, గ్రూప్ ఇంజినీర్ చంద్ర శేఖర్, అడిషనల్ మేనేజర్ తిరుపతి, రక్షణ అధికారి రామ్‌కుమార్, సర్వే అధికారి అఫ్సర్ పాషా, తదితులున్నారు.

కంటి శస్త్ర చికిత్సలను వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి



జిల్లా ఆస్పత్రిలో 15 లక్షల రూపాయలతో కంటి ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేశామని, ఈ రోజు కంటి శస్త్ర చికిత్సలను ప్రారంభించామని,ఈ సదుపాయాన్ని పేషంట్స్ జిల్లా ప్రజలు వాడుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.శుక్రవారం జిల్లా ఆసుపత్రిలో కంటి ఆపరేషన్ థియేటర్ ప్రారంభమైందని, మొదటిరోజు విజయవంతంగా 4 కంటి శస్త్ర చికిత్సలు ఆప్తామాలజిస్ట్ వైద్యులు డాక్టర్ సబీహా, డాక్టర్ సింధూర నిర్వహించారని అన్నారు.కంటి శస్త్ర చికిత్స అవసరమైన వారు ప్రభుత్వ ఆసుపత్రిలో సంప్రదించాలని, నైపుణ్యం అనుభవం కలిగిన వైద్యులు, అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, వీటిని అవసరం ఉన్న ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆపిల్ కిడ్స్ స్కూల్‌కు ప్రశంసాపత్రం

నవతెలంగాణ-గోదావరిఖని:



గోదావరిఖనిలోని శ్రీ ఆపిల్ కిడ్స్ స్కూల్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో ప్రతిష్టాత్మకమైన గౌరవం దక్కింది. విద్యా బోధనా విధానంపై శ్రీఆపిల్ కిడ్స్ స్కూల్ యాజమాన్యం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధతోపాటు విద్యార్థులు సాధిస్తున్న ఫలితాలను ఢిల్లీకి చెందిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ గుర్తించింది. స్కూల్ యాజమాన్యం కృషిని అభినందిస్తూ, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ఆధ్వర్యంలో ఆక్స్‌ఫర్డ్ క్వాలిటీ ప్రోగ్రాం కింద శుక్రవారం స్కూల్ కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ గాలి సునీత రవికి ప్రత్యేక గుర్తింపు సర్టిఫికెట్‌తోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్ర జోనల్ హెడ్ రాజేష్, ఏరియా మేనేజర్ సందీప్, అకాడమీ ఎక్సలెన్స్ మేనేజర్ కళ్యాణ్ శర్మ గురువారం స్వయంగా స్కూల్‌ను సందర్శించి స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు.

108లో సాధారణ ప్రసవం

నవతెలంగాణ-రామగుండం



రామగుండం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రోహిణి అనే గర్భిణీకి శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గ మధ్యలో రామగుండం మసీద్ సమీపంలో అంబులెన్స్‌లోనే ప్రసవించింది. ఈఎంటీ స్వామి, పైలట్ షబ్బీర్ రోహిణికి సాధారణ కాన్పు చేశారు. రోహిణి మగ బిడ్డకు జన్మనివ్వగా తల్లి,బిడ్డ క్షేమంగా ఉన్నారు. సకాలంలో డెలివరీ చేసిన 108 సిబ్బంది స్వామి, షబ్బీర్‌ను కుటుంబ సభ్యులు,స్థానికులు అభినందించారు.

ఏడీకి సన్మానం

నవతెలంగాణ-జూలపల్లి



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా ఏడీ నరేష్ కుమార్‌ని జూలపల్లి మండలం వడ్కాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జూలపల్లి ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు జెట్టి సతీష్, ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు కనకట్ల స్వామి, కోశాధికారి తీగల రమేష్, డైరెక్టర్ జెట్టి రాజయ్య పాల్గొన్నారు.

కేడీసీసీ బ్యాంక్‌లో డిపాజిట్ చేయండి...

అత్యధిక వడ్డీ పొందండి

బ్యాంక్ మేనేజర్ ఎల్.గాంధీ నాయక్


నవతెలంగాణ-రామగిరి



ఆదివారం పేట రైతులతో బ్యాంకు అధికారులు

కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో డిపాజిట్లపై అత్యధిక వడ్డీ రేట్లను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోగలరని సెంటినరి కాలనీ (రత్నాపూర్) బ్యాంక్ మేనేజర్ ఎల్.గాంధీ నాయక్ కోరారు. రామగిరి మండలం ఆదివారంపేట గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వస్తున్న వడ్డీ శాతం గురించి అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్‌లకు 8.10 శాతం,7.6 శాతంవడ్డీ బ్యాంకు కల్పిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకు యందు లాకర్ సౌకర్యం,బంగారు ఆభరణములపైన 5000/- గ్రాముకు ఋణమును, గృహనిర్మాణ రుణం, కొనుగోలు కొరకు రుణం,విద్యా ఋణములు, వ్యవసాయ ఋణములు, వ్యవసాయే-తర ఋణములు ఈ బ్యాంక్ ద్వారా ఇవ్వనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదివారంపేట గ్రామ రైతులు మైదం జయన్న,ఊట్లమల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, కలికోట బ్రహ్మయ్య, ఆరెల్లి సాయిలు, మైదం సుధాకర్, ఎలువాక కుమార్, డాక్టర్ బ్రహ్మం తదితరులు ఉన్నారు.

ఆర్ఎంపీ,పీఎంపీలకు అవగాహన



నవతెలంగాణ-పెద్దపల్లి

ప్రపంచ యాంటీ మైక్రోబియల్ నిరోధకత వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీలకు అవగాహన కార్యక్రమంను జిల్లా అధికారుల సమీకృత కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి. అన్న ప్రసన్నకుమారి మాట్లాడుతూ వ్యాధి నిరోధకత ఎలా ఏర్పడుతుందో వివరించి, ఆంటీ మైక్రోబియల్ నిరోధకత రాకుండా ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో వివరించారు.ముఖ్యంగా ఆంటి బయాటిక్స్ ఎప్పుడు ఇవ్వాలి, ఎప్పుడు ఇవ్వకూడదో తెలుసుకొని ఉండాలని అన్నారు.యాంటి బయాటిక్స్ బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ చికిత్సకు మాత్రమే వాడాలని, వైరస్ ఇన్‌ఫెక్షన్ చికిత్సకు వాడరాదు అన్నారు.ఆంటీ బయాటిక్స్ వాడేముందు సరియైన వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలను సూచించారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారులు డా.కె.వి. సుధాకర్ రెడ్డి, డా.బి. శ్రీరాములు, ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అజీజ్, అధ్యక్షుడు శ్రీనివాస్ మూర్తి, జనరల్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, ట్రెజరర్ టి.శంకర్‌లు పాల్గొన్నారు.

రైతులకు సకాలంలో ధాన్యం డబ్బులు అందేలా చర్యలు

- రామగిరి, మంథని మండలాల్లో కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-రామగిరి



మాట్లాడుతున్న కలెక్టర్

రామగిరి,మంథని రైతుల వద్ద నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు సకాలంలో రైతులకు అదేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని, రామగిరి మండలాలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు.రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామం, మంథని మండలం ఏక్లాస్‌పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి కొనుగోలు చేసిన ధాన్యం రిజిస్టర్‌లను పరిశీలించారు.కోనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులతో ఎన్ని ఎకరాలలో పంట సాగుచేశారు.ఎంత దిగుమతి వచ్చింది, కోనుగోలు కేంద్రాలకు పంట తెచ్చి ఎన్ని రోజులు అవుతుంది, తేమ శాతం ఎంత ఉంది, టార్పాలిన్ కవర్లు ఇస్తున్నారా మొదలగు వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం 24 గంటలు వ్యవధిలో ట్రక్ షీట్ జనరేట్ చేయాలని అన్నారు. రైతులకు ధాన్యం డబ్బులు సకాలంలో అందేలా చూడాలని అన్నారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం ప్రత్యేకంగా క్వింటాళ్లకు 500 రూపాయల బోనస్ ప్రకటించిందని, ఇది ప్రత్యేకంగా రైతుల ఖాతాలలో జమ చేయడం జరుగు తుందని అన్నారు. ధాన్యం అమ్మే సమయంలో రైతులు సమర్పించిన బ్యాంకు ఖాతాల్లో బోనస్ డబ్బులు పడ్తాయని అన్నారు. ఈ తనిఖీలలో జిల్లా కలెక్టర్ వెంట రామగిరి మండల తహసిల్దార్ బి రామచందర్ రావు, మంథని ఏడిఎం అంజలి , గొట్టె ఏపీఎం స్వరూప రాణి, గ్రామ సెక్రెటరీ సిహెచ్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

నవతెలంగాణ-కోల్‌సిటి



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

టెక్నాలజీ విస్తృతస్థాయిలో అభివృద్ధి చెంది ప్రస్తుతం అందరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్‌లు అందుబాటులో ఉంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, విద్యార్థులు తప్పనిసరిగా మరింత అవగాహన పెంచుకోవాలని పోలీస్ ఇన్స్‌స్పెక్టర్ కృష్ణమూర్తి సూచించారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటరమణ ఉత్తర్వులతో శుక్రవారం ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించారు. ప్రస్తుత జెనరేషన్‌లో ప్రతీ నిమిషం సెల్ ఫోన్ లేకుండా గడవడం లేదని, సెల్‌ఫోన్ తో ప్రతీ పని ముడిపడి ఉందని, సెల్ ఫోన్ నెంబర్ తో మన బ్యాంక్ అకౌంట్, ఆధార్, పాన్ కార్డులు, పెన్షన్, ఆహారభద్రత కార్డులు లింక్ అయి ఉన్నాయని ఈ నేపథ్యంలో సైబర్ నేరస్థులు దాన్ని ఆసరాగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్నారన్నారు. లేనిపోని ఆశలు చూపించి రకరకాలుగా మోసాలు చేస్తున్నారన్నారు. అప్రమత్తతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని వెల్లడించారు. పెళ్లి కార్డులు, ఏపీకే ఫైల్స్, డిజిటల్ అరెస్ట్ పేర్లతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. ర్యాగింగ్, సైబర్ క్రైమ్, డ్రగ్స్ తదితర అంశాలపై విద్యార్థులకు పూర్తిగా అవగాహన ఉండాలన్నారు. ఇటీవల మహిళలు, పిల్లలను టార్గెట్ చేస్తూ సైబర్ నేరగాళ్ల ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. సైబర్ నేరాలపై టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి లేదా 100 కు ఫోన్ చేసి చెప్పా లని, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైమ్. జీవోవి.ఇన్ (www.cybercrime.gov.in) ద్వారా ఆన్‌లైన్ సైతం ఫిర్యాదు చేసి పోలీసుల సేవలు సద్వినియోగం చేసుకోవాలని సీఐ కృష్ణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సైబర్ క్రైమ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని గుర్తింపు సంఘం

హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్

నవతెలంగాణ-గోదావరిఖని:



మాట్లాడుతున్న రియాజ్ అహ్మద్

సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి సంవత్సరం అవుతుందని, గెలిచిన సంఘాలు మేనేజ్‌మెంట్‌కు వత్తాసు పలుకుతూ ఇప్పటి వరకు ఒక్క పని కూడా చేయలేదని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ విమర్శించారు. సింగరేణి ఆర్జీ-1 పరిధిలోని జీడీకే 2వ ఇంక్లైన్‌లో హెచ్ఎంఎస్ ఫిట్ సెక్రటరీ రాంచందర్ అధ్యక్షతన యూనియన్ గేట్ మీటింగ్ శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ గోదావరిఖనిలో సింగరేణి క్వార్టర్స్‌ను ఇష్టం వచ్చినట్టు కూల్చి వేసినా యాజమాన్యం గానీ, యూనియన్లు గాని నోరు మెదడం లేదని, ఒక హెచ్ఎంఎస్ మాత్రమే దీనిపై స్పందిస్తూ పోరాటం చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు జక్కుల నారాయణ, కొమురయ్య, మణికంఠ, కుమారస్వామి, కరీంబాబా, శ్రీధర్, రాజేష్, బోయిని శ్రీనివాస్, కరీం, శ్రీనివాస్ యాదవ్,సతీష్, సురేష్,గోపాల్, లక్ష్మయ్య,శంకర్, సలీం,హబీబ్‌ఖాన్, భూమయ్య తదితరులున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం...

నవతెలంగాణ-మంథని

మంథని డిపో పరిధిలోని ప్రజలు,ప్రయాణికులు శనివారం ఉదయం 11 గంటలకు డిపోలో నిర్వహించే డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో పాల్గొనాలని మంథని డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. ప్రజలు ఎవరైనా తమ తమ ప్రజా రవాణా ఇబ్బందులు సూచనలను 7882825923 ఫోన్ నెంబర్‌కు కాల్ చేసి తెలపాలని ఆయన కోరారు.

ప్రతిభ చాటిన విశ్వభారతి విద్యార్థులు

నవతెలంగాణ-గోదావరిఖని:



ఉమ్మడి రామగుండం జన విజ్ఞాన వేదిక, చెకుముకి కన్వీనర్ గద్దె శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని గాంధీ పార్క్ ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి చెకుముకి పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో 120 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలలో ప్రభుత్వ పాఠశాల విభాగం నుంచి ఎన్టీపీసీ జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎస్.ఏలిజ, యు.అభిరామ్, పి.సాత్విక,అలాగే ప్రైవేటు పాఠశాల విభాగం నుంచి ఎన్టీపీసీ విశ్వ భారతి హైస్కూల్ విద్యార్థులు వి.చరణ్, జె.వెంకట నారాయణరావు, జె.మేఘన ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. చెకుముకి ఉమ్మడి రామగుండం కన్వీనర్ గద్దె శ్రీనివాస్ గెలుపొందిన విద్యార్థులకు మెమొంటోలు, మెడల్స్‌ని బహుకరించారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్, హెడ్ మాస్టర్ తిరుపతి గౌడ్, ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పబ్బ శ్రీధర్, పాఠశాల ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు రమేష్, ఇందుమతి తదితరులున్నారు.

సింగరేణి సీఎండీ వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-గోదావరిఖని:



సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, డైరెక్టర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ రావు అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం బొగ్గు నాణ్యతపై సమీక్షించారు. ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన బొగ్గు ఉత్పతి ఉత్పాదకతా లక్ష్యాలను సాదించాలని,బొగ్గు కొనుగోలు దారులకు నాణ్యత విషయంలో రాజీపడకూడదని తెలిపారు. ఆర్జీ-1 నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో క్వాలిటి జీఎం రవి కుమార్, జీఎం క్వాలిటీ ఆర్జీ రీజియన్ బైద్య, ఎస్ఓటూజీఎం గోపాల్ సింగ్, జీడీకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ చంద్రశేఖర్, క్వాలిటి డీజీఎం సాయి ప్రసాద్, సీఎస్‌పీ ఎస్ఇ దాసరి శ్రీనివాస్ తదితరులున్నారు.

కిడ్నీ బాధితునికి సహాయం

నవతెలంగాణ-గోదావరిఖని:



గోదావరిఖని గణేష్ నగర్‌కు చెందిన ఎగుర్ల సతీష్ మంజూల తమ పెళ్లి పోరు సందర్భంగా వారి కుమార్తెలు ఎగుర్ల మృదు నయన, ఎగుర్ల సహస్ర ఎన్టీపీసీ న్యూపోరట్‌పల్లిలో నివాసముండే నిరు పేద కుటుంబానికి చెందిన కిడ్నీ బాధితుడు రాజయ్యకు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 25 కేజీల బియాన్ని శుక్రవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, చైర్మన్ లయన్ డాక్టర్ సురభి శ్రీధర్, డాక్టర్ వేముల రమేష్, చందన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవునిపల్లి లక్ష్మీ నరసింహస్వామి దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-గోదావరిఖని:

దేవునిపల్లి గ్రామంలో కొండపై వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు పూర్ణ కుంభంతో స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు.

తబితా ఆశ్రమంకు ల్యాప్‌టాప్ అందజేత

నవతెలంగాణ-గోదావరిఖని:



పిల్లలకు అన్నదానం చేస్తున్న మద్దెల సౌజన్య దినేష్

గుండె పోటుతో మరణించిన చంద్రగిరి శ్రీనాథ్ జ్ఞాపకార్థం శ్రీనాథ్ చెల్లి బావ మద్దెల సౌజన్య దినేష్ రామగుండం తబిత ఆశ్రమంలోని పిల్లల కోసం 55వేల రూపాయల విలువ గల ల్యాప్ టాప్‌ను అందజేశారు. చంద్రగిరి శ్రీనాథ్ ఎంతో మంది నిరుపేదలకు, అనాథలకు, అభాగ్యలకు, నిరాశ్రయులకు, అన్నార్థులకు తన వంతు సహాయ సహకారాలు అందించే వారని, గత నెల రోజుల క్రింద ఇంట్లో హార్ట్‌స్ట్రోక్ రావడంతో శ్రీనాథ్ మతి చెందడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీనాథ్ చిత్రపటానికి పూలమాల వేసి ఒక నిమిషం మౌనం పాటించి పిల్లలందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తబిత ఆశ్రమ నిర్వాహకులు భూక్య వీరేంద్రనాయక్, విమల తదితరులున్నారు.

పలు సమస్యలపై జీఎంకు వినతి

నవతెలంగాణ రామగిరి



రామగిరి మండల కేంద్రంలోని సింగరేణి ఆర్జీ-3 ఏరియా ఏరియాలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు అదేవిధంగా సెంటినరీ కాలనీలోని అంతర్గత రోడ్లు చెడిపోయాయని, పన్నూరు గ్రామ మాజీ ఎంపీటీసీ చిందం మహేష్ ఆర్జీ-3 ఏరియా జీఎం నరేంద్ర సుధాకర్ రావుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ, సెంటినరీ కాలనీలోని టిటు జోన్-1 జోన్-2 అలాగే రామగిరి తహసీల్దార్ కార్యాలయం నుండి శ్రీలంక క్వార్టర్లకు వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని అన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చేతి సుధాకర్,తాటి సతీష్, మోత్కూరు వెంకటేష్ ఉన్నారు.

సుందిళ్ల లక్ష్మీనరసింహస్వామి హుండీ లెక్కింపు

నవతెలంగాణ-రామగిరి



రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి సంబంధించిన హుండీని ఆలయ ఈవో రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. ఈ లెక్కింపుకు స్వచ్ఛంద సేవా సంస్థ అయిన శ్రీ రాజరాజేశ్వర సేవా సంస్థ వారు హాజరై హుండీ లెక్కించారు. హుండీలో 9 నెలలకు 5 లక్షల 68, వేల 28 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఈవో రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రుద్రభట్ల జయంత్ శర్మ, పరిశీలకులు రామిడి సుజాతలు పాల్గొన్నారు.

గాయత్రి విద్యానికేతన్ విద్యార్థినులకు ప్రశంసా పత్రాలు

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్



దిభారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ డైమండ్ జూబ్లీ వేడుకలలో భాగంగా తెలంగాణ స్టేట్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేది నుండి 11వ తేది వరకు హైదరాబాద్‌లో నిర్వహించిన స్టేట్ మినీ జంబోరిలో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌కి చెందిన 9వ తరగతి విద్యార్థినులు గైడ్స్ చంద్రకారి లయవర్ధిని, పొలవేని విష్ణుప్రియలు పాల్గొని ప్రశంసా పత్రాలు పొందినట్లు గాయత్రి విద్యా సంస్థల ఛైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల్లో బాల్యం నుండే సేవా గుణాన్ని, దేశ భక్తిని పెంపొందించాలనే ఒక మంచి ఆశయంతో మా పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రశంసా పత్రాలు సాధించిన ఇరువురు గైడ్స్‌ని, గైడ్ కెప్టెన్ స్రవంతిలను పెద్దపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కె. ప్రవీణ్ కుమార్ అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో కర స్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్స్ పోటీలకు

రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్



రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్స్ పోటీలకు రైసింగ్ సన్ పాఠశాల విద్యార్థులు ఎంపిక జరిగింది అక్టోబరు 17న గోదావరి ఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్స్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఈనెల 23,24వ తేది న మెదక్ జిల్లా మసాయి పేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు రైజింగ్ సన్ పాఠశాల విద్యార్థి సాధిక్ ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సయీద్ అహ్మద్,ప్రధానోపాధ్యాయులు హకీంఖాన్ సాధిక్‌ను అభినందించారు.

యాజమాన్యం దిగచ్చేంత వరకు సమ్మె

కేశోరం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షులు కౌశిక హరి

నవతెలంగాణ-రామగుండం



కేశోరాం కర్మాగార యాజమాన్యం కార్మికులకు బోనస్ చెల్లింపులో నిర్లక్ష్య ధోరణి కార్మికులు సమ్మె బాటిన పట్టిన దిగి రాకపోవడంతో సోమవారం నుంచి నిరవధిక సమ్మె కొనసాగుతుందని కాంటాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశికహరి పిలుపునిచ్చారు. శుక్రవారం ఫ్యాక్టరీ ప్రధాన ద్వారం వద్ద సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్మికులు బైఠాయించగా కౌశికహరి హాజరై వారికి మద్దతు పలికారు.ఈ సందర్భంగా కౌశిక హరి మాట్లాడుతూ యాజమాన్య దిగచ్చేంత వరకు సమ్మె కొనసాగుతుందని, కార్మికులు ఎవరు భయపడాల్సిన అవసరం లేదని, పర్మినెంట్ యూనియన్ నాయకులు, కార్మికులు సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.కార్మికులకు మద్దతుగా కాంట్రాక్ట్ కార్మిక సంఘం ముఖ్య సలహాదారులు బత్తిని సతీష్ గౌడ్,సంపత్, దాడి బాపు,బైరి రామకృష్ణ, మల్కనూరి శ్రీధర్, కుర్ర మల్లయ్య,సాధిక్ పాషా, కొప్పుల మల్లేష్,ప్రసాద్,కొమురయ్య, కొమ్ము శ్రీనివాస్, అంజయ్యలతో, బాడీ సభ్యులు కార్మికులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు వీ-హబ్ తోడ్పాటు

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి



జిల్లాలోని మహిళల సాధికారత సాధన కోసం వీ-హబ్ తోడ్పాటు అందిస్తుందని, దీనిని వినియోగించుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో వీ-హబ్ ప్రతినిధులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీతో కలిసి సమావేశమయ్యారు. మహిళ సంఘాలచే ఏర్పాటు చేసే చిన్న, కుటీర పరిశ్రమలు, వాటి ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించడం, లాభసాటిగా మహిళలు వ్యాపారం చేయడానికి అవసరమైన శిక్షణ తదితర అంశాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జిల్లాలోని ప్రసక్తి మహిళా సంఘాలకు ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసే వ్యాపారాలకు మంచి మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వీ-హబ్ ప్రతినిధులు సీతా, జహీద్ అక్తర్ షేక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ పాల్గొన్నారు.

149 అక్రమ ఇసుక తరలింపు వాహనాల పట్టివేత

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

నవతెలంగాణ-పెద్దపల్లి



పెద్దపల్లి జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో నవంబర్ 21 నాటికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న 149 వాహనాలను నిర్బంధించి 25 లక్షల 99 వేల 790 రూపాయల జరిమాన వసూలు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం పెద్దపల్లి జిల్లాలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న 86 ట్రాక్టర్లు, 63 టిప్పర్లు, ను పట్టుకొని కేసులు బుక్ చేశామని, వీరి వద్ద నుంచి ఇప్పటి వరకు 25 లక్షల 99 వేల 790 రూపాయల జరిమాన వసూలు చేశామని అన్నారు. ఇక నుంచి జిల్లాలో అక్రమంగా ఇసుక తరలించే ట్రాక్టర్ నుంచి 25 వేల రూపాయలు, టిప్పర్ నుంచి లక్ష రూపాయల జరిమానా వసూలు చేయడం జరుగుతుందని, ఇదే కాకుండా అక్రమ ఇసుక రవాణా దారుల పై సెక్షన్ 379,21 ఎంఎండిఆర్ యాక్ట్ 1957, పీడీ యాక్ట్ ల క్రింద కేసు బుక్ చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి :అదనపు కలెక్టర్

కోల్‌సిటీ-నవతెలంగాణ

సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని అదనపు కలెక్టర్, నగరపాలక కమిషనర్ అరుణశ్రీ ఒక ప్రకటనలో కోరారు. సర్వే కోసం వచ్చినప్పుడు ఇంట్లో లేని వారు, ఏదైన కారణంతో వివరాలను నమోదు చేసుకోలేకపోయిన వారు సంబంధిత వార్డు ఎన్యూమరేటర్లను కలిసి సమగ్ర సమాచార వివరాలను అందివ్వాలని ఆ ప్రకటనలో కోరారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తా..

మంత్రి శ్రీధర్ బాబు

నవతెలంగాణ-మంథని



వినతి పత్రం ఇస్తున్న మత్స్య కారులు

మంథని ప్రాంతానికి చెందిన మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తానని ఐటీ పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. మంథని మున్సిపల్ పరిధిలోని బోయిన్‌పేట ప్రాంతం సంబంధించిన నాయకులు మంత్రిని కలిసిన వారి సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించి మంథని నియోజకవర్గంలో మత్స్యపారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెద్దపల్లి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్ క్రాంతి కుమార్, అర్జున్, పోలు కనకరాజు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జూనియర్ కళాశాల విద్యార్థిని

నవతెలంగాణ - చిగురుమామిడి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ మొదటి సంవత్సరం చదువుతున్న పీచుపల్లి గ్రామానికి చెందిన ఎ.తరుణ అండర్-19 జూనియర్ కళాశాలల రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన కళాశాల స్థాయి బాలికల కబడ్డీ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారని కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇల్లందుల సంపత్ కుమార్ తెలిపారు. ఈ నెల 23నుండి రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు తరపున ఆడనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినిని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అభినందించారు. తరుణను శుక్రవారం కళాశాల అధ్యాపకులు జనార్ధన్, రవికుమార్, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్, కృష్ణమోహన్, మమత, అనిత, స్వరూప రాణి, కవిత, లైబ్రేరియన్ చంద్రశేఖర్, జూనియర్ అసిస్టెంట్ వలి పాషా, ఆఫీస్ సబార్డినేట్ తిరుపతి అభినందించారు.



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన తరుణ

ఈపీఎస్ పెన్షనర్ల ధర్నా జయప్రదం చేయండి

నవతెలంగాణ - కరీంనగర్



ఈపీఎస్ పెన్షనర్ల సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించాలని కోరుతూ కేంద్ర కార్మిక శాఖా మంత్రులకు కరీంనగర్‌లోని ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ అసిస్టెంట్ కమిషనర్ తానయ్య ద్వారా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ మెమొరాండం సమర్పించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పుల్లెల మల్లయ్య మాట్లాడుతూ.. అందరికీ మినిమం పెన్షన్ నెలకు రూ.9000 చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం టాప్ర జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ జనరల్ జి.అశోక్ మాట్లాడుతూ.. సుమారు ముప్పై ఏళ్ల క్రితం అసమగ్రంగా తయారు చేసిన ఈపీఎస్-95 పెన్షన్ స్కీమ్ లోపభూయిష్టమైనదని, దాన్ని అడ్డు పెట్టుకుని అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వారు ఈపీఎస్ పెన్షన్‌దారులను మోసం చేస్తున్నాయని విమర్శించారు. 25 సంవత్సరాల నుంచి నెలకు వెయ్యి రూపాయల లోపు, గరిష్టంగా మూడు వేలు పెన్షన్ అందుకుంటున్న ఈపీఎస్ పెన్షన్ దారుల కష్టాలు వర్ణనాతీతమైనవని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాతికేళ్లలో ధరలు ఎన్నో రేట్లు పెరిగాయని పెన్షన్ పెంపుదల చేయాలని ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా పాలకులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ నెల 25న హైదరాబాద్ బర్కత్ పురాలో ఉన్న పీఎఫ్ కార్యాలయం ఎదుట ధర్నాకు సిద్ధమయ్యారని అన్నారు. 25న ధర్నాకు కేవలం ఈపీఎస్ పెన్షనర్‌లే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు కూడా పాల్గొని సంఘీభావం ప్రకటించాలని కోరారు. ఐక్యమత్యంతోనే ఏదైనా సాధించుకోగలమని, 25న పెన్షనర్ల ఐక్యత ప్రదర్శించాలని, అందుకు అందరూ సహకరించాలని కోరారు. టాప్రా జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి జి.అశోక్, జిల్లా కోశాధికారి తిరుమలయ్య, కార్మిక సంఘం ప్రతినిధి చౌదరి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎల్ రాష్ట్ర ద్వితీయ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ - భగత్‌నగర్



భారత న్యాయవాదుల సంఘం (ఐఏఎల్) రాష్ట్ర ద్వితీయ మహాసభలు ఈ నెల 30, డిసెంబర్ 1న హనుమకొండలో నిర్వహించనున్నారు. ఈ మహాసభల వాల్‌పోస్టర్‌ను శుక్రవారం కరీంనగర్ జిల్లా కోర్టులో ఐఏఎల్ రాష్ట్ర నాయకుడు, సీనియర్ అడ్వకేట్ మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకీ న్యాయవాదులపై దాడులు పెరిగిపోతున్నాయని, రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. తక్షణమే న్యాయవాదుల రక్షణ కోసం చట్టం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు ప్రతినెలా రూ.5వేలు స్టైఫండ్ ఇవ్వాలని, హెల్త్ కార్డులను రూ.10లక్షలకు పెంచాలని, హౌసింగ్ సొసైటీ కింద ప్రతి న్యాయవాదికి ఇంటి స్థలం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చేశారు. మహాసభలకు కరీంనగర్ జిల్లా నుండి అధిక సంఖ్యలో న్యాయవాదులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు సత్యనారాయణ, మురహరిరావు, బాలకృష్ణరావు, లక్ష్మణ్‌రావు, వేణుగోపాల్, వివేకానంద, శంకరయ్య, రేణుక, మహేందర్, ఆంజనేయులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

'వాగేశ్వరి'లో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

నవతెలంగాణ - తిమ్మాపూర్



మండలంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు ప్రారంభించినట్లు విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంద్ర శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి చెలిమెడ ఆనందరావు వైద్య కళాశాల వైద్యురాలు డాక్టర్ దివ్యరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు యూరినరీ టెరాక్ ఇన్‌ఫెక్షన్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన 20 రకాల వైజ్ఞానిక ప్రదర్శనలు తిలకించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థిని విద్యార్థులకు మొదటి, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు ప్రకాష్‌రెడ్డి, వినోద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, విభాగాధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ నవీన్ కుమార్ శ్రవణ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీబీ చాంపియన్స్ శిక్షణ కార్యక్రమం

నవతెలంగాణ - తిమ్మాపూర్ : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు, డిస్ట్రిక్ట్ టీబీ ఆఫీసర్ మార్గదర్శకత్వంలో క్షయ నివారణ విభాగం, టీబి అలర్ట్ ఇండియా -ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ వారి సహకారంతో మండల పరిషత్ కార్యాలయంలో టీబీ చాంపియన్స్ శిక్షణా కార్యక్రమం శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాట్లాడారు. క్షయ వ్యాధితో బాధపడి ఆ వ్యాధి నుండి మీరు విజేతలుగా మారినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, ఎంపీఓ సురేందర్, క్షయ నివారణ విభాగం టీబి కోఆర్డినేటర్ అశోక్, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, హెల్త్ సూపర్ వైజర్ వెంకటేశ్వరి, స్వరూపరాణి, టీబీ అలర్ట్ ఇండియా కమ్యూనిటీ కోర్డినేటర్స్ పారిజాతం, తిరుపతి, రాజబోస్, రాజేందర్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ - తిమ్మాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలకు ఇస్తానన్న ఆరు గ్యారంటీలలో భాగంగా రైతులకు రుణమాఫీ తో పాటు సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ఇస్తున్న తరుణంలో కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ 8వ డివిజన్ ఆలుగునూర్ చౌరస్తాలో డివిజన్ అధ్యక్షుడు తమ్మనవేని రమేష్ అధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్.ఎల్ గౌడ్, డీసీసీ కార్యాలయ ఇన్‌చార్జి గోపు మల్లారెడ్డి, కొండం రాజేందర్‌రెడ్డి, చిందం కిష్టయ్య, కంది లక్ష్మీనారాయణరెడ్డి, బొల్లాడి కృష్ణరెడ్డి, కంది అశోక్‌రెడ్డి, పోలు రాము, రమేష్, తొర్తి అరవింద్, ఆశిక్ పాషా, ముంజ శ్రీకాంత్‌గౌడ్, పొనగాని మహేష్ యాదవ్, కాత కొమురయ్య, సిరిసిల్ల చంద్రయ్య, వేంకటేశం పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు స్వర్ణకారుల వినతి



నవతెలంగాణ - హుజురాబాద్ : స్వర్ణకారుల ఉపాధి దెబ్బతీసే వ్యాపార సంస్థలకు అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ శుక్రవారం హుజురాబాద్ తహసీల్దార్ కె.కనుకయ్యకు స్వర్ణకారులు వినతిపత్రం అందజేశారు. కొంతమంది బడా వ్యాపారవేత్తలు స్వర్ణకారుల కుటుంబాల పొట్టగొట్టేందుకు రకరకాల పేర్లతో దుకాణాలు ప్రారంభిస్తున్నారని వాపోయారు. అసలే గిరాకీలు లేక ఇబ్బంది పడుతున్న తమకు ఇలాంటి దుకాణాలు వస్తే పూర్తిగా తిప్పలు తప్పవని అన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు ఇలాంటి వాటికి అనుమతులు ఇవ్వొద్దని కోరారు. కార్యక్రమంలో స్వర్ణకారుల సంఘం నాయకులు మునిగంటి వెంకటేశ్వర్లు, బోజ్జా వేణు, కాసుల కిరణ్ నాగరాజు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడేట్ల పాత్ర ప్రశంసనీయం..

అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

నవతెలంగాణ - కరీంనగర్ : దేశ రక్షణలో, దేశభక్తి పెంపొందించడంలో ఎన్‌సీసీ క్యాడేట్ల పాత్ర చాలా ప్రశంసనీయమైనదని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ హైస్కూల్లో పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ క్యాడేట్లు స్వచ్ఛభారత్, హరితహారం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దేశ రక్షణకు పాటుపడాలని, కాలుష్య నివారణకు చేయూతనివ్వాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. పాఠశాల ప్రాంగణంలో భూమిని చదును చేసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి శుక్రవారం సభలు

కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - వీణవంక



మహిళల సమస్యల పరిష్కారానికి ప్రతివారం శుక్రవారం సభలు నిర్వహిస్తున్నట్టు కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. వీణవంక మండలంలోని ఎలుబాక గ్రామంలో శుక్రవారం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం సభ ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే శుక్రవారం సభకు మహిళలు తప్పనిసరిగా రావాలన్నారు. దీంతో పోషకాహారం, ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలపై అవగాహన కలుగుతుందని తెలిపారు. మహిళలు మొదట తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలన్నారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం కింద ప్రభుత్వ ఆస్పత్రుల్లో 52 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, మహిళలందరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐదేండ్లలోపు చిన్నారులను కేంద్రాలకు విధిగా పంపించాలని తల్లులకు సూచించారు. కార్యక్రమంలో డీఏడబ్ల్యూ సరస్వతి, మండల ప్రత్యేక అధికారి, సీపీఓ కొమురయ్య, ఆర్డీవో రమేష్‌బాబు, డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ, అడిషనల్ డీఆర్డీఓ సునీత, సీడీపీఓ సుగుణ, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ చంద్రశేఖర్, ఎంపీడీవో శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ సురేందర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్యామల, పంచాయతీ కార్యదర్శి, ఏఎన్ఎం, అంగన్వాడీ టీచర్, గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశ వర్కర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

సౌత్ ఇండియా సదరన్ డ్రామా ఫెస్టివల్ నాటక పోటీల్లో

ఉత్తమ నటిగా ఎంపికైన పారమిత విద్యార్థిని

నవతెలంగాణ - కరీంనగర్



విద్యార్థినిని అభినందిస్తున్న చైర్మెన్

సౌత్ ఇండియా సదరన్ డ్రామా ఫెస్టివల్ పోటీలలో భాగంగా నవంబర్ 14, 15వ తేదీలలో బెంగుళూరులో నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీలలో నగరంలోని పారమిత ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నాటకంలో ఉత్తమ నటిగా 10వ తరగతి చదువుతున్న నాగ జైత్ర ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బాలాజీ తెలిపారు. ఇటీవల బెంగుళూరులోని విశ్వేశ్వరయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ మ్యూజియం వేదికగా సైన్స్ డ్రామా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో స్వయంకృతాపం అనే పేరుతో ఆధునికత, అభివృద్ధి అనే ఆలోచనలతో ప్రకృతిని వినాశనం చేసి అనారోగ్య సమస్యల వలయంలో ఏ విధంగా కొట్టు మిట్టాడుతున్నాడు అనే అంశాన్ని చక్కని అభినయ రూపంలో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ పోటీలలో 5 రాష్ట్రాల నుంచి 10 బృందాలు పాల్గొనగా పారమిత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న నాగ జైత్ర ఉత్తమ నటిగా ఎంపికైనట్లు విశ్వేశ్వరయ్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నలాజికల్ మ్యూజియం డైరెక్టర్ బీఎస్.రఘువీర్ ప్రకటించారు. సౌత్ ఇండియా సదరన్ డ్రామా ఫెస్టివల్ పోటీలలో వరుసగా 3 సంవత్సరాలుగా పాల్గొని అందరిని ఆకర్షించేలా నటించడం గర్వకారణం అని పారమిత పాఠశాలల చైర్మెన్ కొనియాడారు. అలాగే పోటీలలో పాల్గొన్న అమితేశ్వర్, అర్జున్, సంప్రీతి, శ్రీనిధి, సమీక్ష, సుహృత, అనుశ్రీ, నాగ జైత్ర విద్యార్థుల బృందాన్ని పారమిత పాఠశాలల అధినేత డాక్టర్ ఇనుగంటి ప్రసాదరావు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం విద్యార్థులను పారమిత పాఠశాలల డైరెక్టర్లు, ప్రసూన, రాకేష్, ప్రాచీ, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, వీయూఎం ప్రసాద్, హనుమంతరావు, టీఎస్వీ రమణ, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్, కవిత ప్రసాద్, సమన్వయ కర్త శ్రీనాథ్, గైడ్ టీచర్స్ డైరెక్టర్ బాలస్వాతి, డాన్స్ మాస్టర్ మధుకర్, చిత్రకారుడు మోహన్, చిరంజీవి, ఉపాధ్యాయులు అభినందించారు.

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా బుర్ర తిరుపతి గౌడ్

కార్యవర్గ సభ్యులను సన్మానించిన నాయకులు

నవతెలంగాణ - గన్నేరువరం



మండల కేంద్రంలోని గౌడ సంఘం భవనంలో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గౌడ సంఘం మండల నూతన కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బుర్ర తిరుపతిగౌడ్ (గన్నేరువరం), ఉపాధ్యక్షులుగా న్యాలపట్ల రవి గౌడ్, (గునుకుల కొండాపూర్), బట్టు మునిరాజ్ గౌడ్ (గుండ్లపల్లి), ప్రధాన కార్యదర్శిగా బుర్ర కనకయ్య గౌడ్(జంగపల్లి), కోశాధికారిగా బుర్ర రాజ్‌కోటిగౌడ్ (గన్నేరువరం), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుర్ర శ్రీధర్‌గౌడ్ (గన్నేరువరం), సహాయ కార్యదర్శిగా బొమ్మ సదశిక్ గౌడ్ (మైలారం), పొన్నం శ్రీనివాస్‌గౌడ్ (మాదాపూర్), ముఖ్య సలహాదారునిగా అట్టికం శ్రీనివాస్‌గౌడ్ (జంగపల్లి), బుర్ర లక్ష్మీరాజం గౌడ్ (గన్నేరువరం)ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా అటికం శ్రీనివాస్‌గౌడ్, పులి మల్లేశంగౌడ్, చెక్కిళ్ల చంద్రయ్యగౌడ్, మెషయ్యగౌడ్, కత్తి సత్తయ్య గౌడ్, బుర్ర రాములు గౌడ్, అట్టికం పరశురాం గౌడ్, బుర్ర మల్లేశం గౌడ్, బుర్ర శ్రీకాంత్ గౌడ్, బుర్ర దేవరాజ్ గౌడ్, నల్లగొని మల్లయ్య, పురుషోత్తం కిషన్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ అట్టికం రవిగౌడ్, బుర్ర నర్సయ్యగౌడ్, బుర్ర రమణగౌడ్, బుర్ర తిరుపతిగౌడ్, అట్టికం తిరుపతిగౌడ్, న్యాలపట్ల రమేష్ గౌడ్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

రుణం తీసుకునే సమయంలో ప్రమాద బీమా చేయించాలి

యూనియన్ బ్యాంక్ కరీంనగర్ రీజియన్ డీజీఎం డి.అపర్ణరెడ్డి

నవతెలంగాణ - చొప్పదండి



బ్యాంకులో పంట, మహిళా సంఘాలు, ఇతర రుణాలు తీసుకునే సమయంలో ప్రతి ఖాతాదారుడు ప్రమాద బీమా పథకాన్ని తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కరీంనగర్ రీజియన్ డీజీఎం డి.అపర్ణరెడ్డి తెలిపారు. ప్రమాద బీమా ఉండడం వల్ల రుణం తీసుకున్న ఖాతాదారుడు ప్రమాదవశాత్తు మృతిచెందిన, క్రిటికల్ ఇల్నెస్ ప్రమాద బీమా పథకం కింద రూ.ఐదు లక్షలు మంజూరు చేస్తారని తెలిపారు. చొప్పదండి మండలం భూపాలపట్నం గ్రామానికి చెందిన మునిగాల దేవవరం అనే రైతు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చొప్పదండి-2 బ్రాంచ్‌లో వ్యవసాయ దీర్ఘకాలిక రుణం కింద రూ.8లక్షలు తీసుకున్నారు. రుణం తీసుకున్న రైతు పక్షవాతం బారిన పడ్డారు. ఆ రైతు బ్యాంకులో వ్యవసాయ దీర్ఘకాలిక రుణం తీసుకోవడంతోపాటు కేర్ హెల్త్ ఇన్సూరెన్స్‌లో ప్రమాద బీమా కింద ప్రీమియం చెల్లించి ఉన్నందున బ్యాంకు వారు పూర్తి వివరాలను సేకరించి దేవవరం కుటుంబానికి రూ.10లక్షల క్రిటికల్ ఇల్నెస్ బీమా మంజూరు చేశారు. రైతు కుటుంబానికి క్రిటికల్ ఇల్నెస్ బీమా కింద మంజూరు అయిన పది లక్షల చెక్కును ఆమె స్థానిక బ్యాంకు మేనేజర్ శివతేజ, రాము, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ మేనేజర్ ఈరు రాజుతో కలిసి శుక్రవారం చొప్పదండి బ్రాంచ్‌లో అందజేశారు.

110ఏండ్లకు తనువు చాలించిన వృద్ధురాలు

నవతెలంగాణ - గంగాధర



నూరేళ్లలోపే ఏదో ఓ కారణంతో ప్రాణం వదులుతున్న ప్రజల సంఖ్యే అధికంగా ఉండగా, 110 ఏండ్లు జీవించి నేడు ఓ వృద్ధురాలు తుదిశ్వాస వదిలారు. వివరాల్లోకి వెళితే.. గంగాధర మండలం కొండన్నపల్లి గ్రామానికి చెందిన విలాసాగరం లస్మవ్వ (110) అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం తనువు చాలించింది. బతికినంత కాలం చలాకిగా ఉంటూ స్వతహాగా కాలకృత్యాలు తీర్చుకుని తన పనులు తాను చక్కబెట్టుకుందని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆమె దహన సంస్కారాల్లో పాల్గొని అంతిమ వీడ్కోలు పలికారు. లస్మవ్వకు ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్ళు వున్నారు. 23 మంది మనుమలు, మనుమరాళ్లు ఉండగా, గ్రామంలో 110 ఏళ్లు జీవించిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. 60ఏండ్ల వయసుకు చేరగానే అనేక అనారోగ్య సమస్యలు వెంటాడుతూ అవస్థలు పడుతున్న ఈ రోజుల్లో లస్మవ్వ 110 ఏళ్లు జీవించి ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. అయితే వందేళ్లకు పైబడిన వృద్ధులు ఈ గ్రామంలో మరో ఇద్దరు కూడా ఉన్నారని, వీరు కూడా ఇప్పటికి చలాకిగా ఉన్నారని గ్రామస్తులు వెల్లడించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ - మానకొండూర్ : మానకొండూర్ సబ్ స్టేషన్ పరిధిలోని లింగపూర్, వెల్ది, పోచంపల్లి, ఊటూర్ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మానకొండూర్ ఏఈ అర్.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వెల్ది, లక్ష్మీపూర్, ఊటూరు, వేగురుపల్లి, పచ్చునూరు, మద్దికుంట, కెల్లేడు, పోచంపల్లి, రంగపేట గ్రామాలలో ఏర్పడనున్న విద్యుత్ అంతరయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో మానేరు విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ - కరీంనగర్



గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న జిల్లా స్థాయి ప్రతిభా పాటవ పోటీల్లో కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు సత్తా చాటి జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జి.సరితారెడ్డి తెలిపారు. పాఠశాలకు చెందిన పి.శ్రీతేజ మెహందీ పోటీల్లో జిల్లా స్థాయిలో మొదటి స్థానం, ఎస్.శ్రీరామ్ పాటల పోటీల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి అభినందించారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులను విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

నేత్రాలు సేకరణ

నవతెలంగాణ - కరీంనగర్

కరీంనగర్‌లోని పాత బజార్‌కు చెందిన నీల రాజేశ్వరి (70) మరణించారు. ఆమె కోరిక మేరకు నేత్రాలను శుక్రవారం ఆమె కుమారుడు నీల రమేష్, కోడలు నీల మాధవిలత దానం చేశారు. నేత్రాలను ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు పంపించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోల అన్నారెడ్డి, చింతల కిషన్ పటేల్, కరీంనగర్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ముక్క శరత్‌కృష్ణ, మ్యాడం శివకాంత్, బట్టు వినోద్ కుమార్, లంబు సుధాకర్‌రెడ్డి, కొండ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

15 రోజులలో పరిష్కరించాలి

నవతెలంగాణ - కరీంనగర్ : విద్యాశాఖ సమగ్ర శిక్షాలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయకపోవడం వల్ల, పే స్కేల్ ఇవ్వనందున వివిధ రూపాలలో నిరసనలు చేస్తామని, 15 రోజులలో పరిష్కరించకుంటే ఏ రోజైనా నిరవధిక సమ్మెకు వెళ్తామని తెలుపుతూ తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖాధికారి, కరీంనగర్ జిల్లా ప్రాజెక్ట్ అధికారి ఎక్స్‌అఫిషియోకి వినతిపత్రం ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుండ రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రగిరి మహేష్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు పే స్కేల్ ఇవ్వాలన్నారు. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10లక్షలు, ఆరోగ్య బీమా రూ.10లక్షల సౌకర్యం, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు విరమణ చేస్తున్న వారికి, చేసిన వారికి బెనిఫిట్స్ కింద 25 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ, విద్యాశాఖ నియమకాలలో వెయిటేజ్ కల్పించాలని, పీటీఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మెప్మా పీడీకి సన్మానం

నవతెలంగాణ - కరీంనగర్ : మెప్మా పీడీగా బాధ్యతలు చేపట్టిన



వేణుమాధవరెడ్డిని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా శాలువ, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం లక్ష్మణరావు, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, గంగార రమేష్, రాజేశ్వరరావు, సర్దార్ అర్విందర్ సింగ్, రాజేష్ భరద్వాజ్, నేరెళ్ల కిషన్, సిహెచ్.జోయల్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామస్వామి, శంకర్, సచిత్, చిరంజీవి, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు మినహాయింపునివ్వండి

కలెక్టర్‌కు పీఆర్టీయూ తెలంగాణ విజ్ఞప్తి

నవతెలంగాణ - కరీంనగర్

సర్వే ఆన్‌లైన్ విధుల నుంచి ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతూ పీఆర్టీయూ తెలంగాణ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండల ఆనందం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని శుక్రవారం కలిసి ప్రాతినిధ్యం చేశారు. సామాజిక సర్వే ఆన్లైన్ ఎంట్రీ విధుల నుంచి ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు మినహాయింపు ఇస్తూ విద్యార్థుల విద్యా బోధన కుంటుపడకుండా ప్రాథమిక పాఠశాలల మనుగడకు దోహదం చేయాలని కోరారు.

మాలల సింహగర్జన సభ కరపత్రాల ఆవిష్కరణ

నవతెలంగాణ - చొప్పదండి



హైదరాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల బహిరంగ సభ సింహగర్జన కరపత్రాలను శుక్రవారం చొప్పదండి మండల కేంద్రంలో మండలంలోని అన్ని గ్రామాల మాల సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ మాలల బహిరంగ సభకు మండలంలోని మాలలంతా అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కూనమల్ల చంద్రయ్య, పట్టణ అధ్యక్షుడు గొల్లిపల్లి మోహన్, సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్‌ను ఎక్కువగా వాడొద్దు

నవతెలంగాణ - జమ్మికుంట



జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోతుకులగూడెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సెల్‌ఫోన్ వల్ల లాభాలు, నష్టాల గురించి మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు శుక్రవారం అవగాహన కల్పించారు. పిల్లలు ఎక్కువ ఫోన్‌లకు బానిస అవడం వల్ల అనేక రోగాల బారిన పడుతున్నారని, బయట ప్రపంచంతో సంబంధం లేకుండ ఉన్నారని చెప్పారు. సెల్‌ఫోన్‌లకు పిల్లలు, విద్యార్థులు దూరంగా ఉండేటట్లు చూడాలని సూచించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి యూనివర్సిటీ విద్యార్థులు ప్రతిభ, జ్యోష్ణవి, ఇ.కీర్తి, కీర్తన, ఎస్.కీర్తి, రక్షిత, షీబా, కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ప్రశాంతి, ఉపాధ్యాయుడు అశోక్ పాల్గొన్నారు.

పత్తి క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,850

నవతెలంగాణ - జమ్మికుంట

జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు విడి పత్తి 432 క్వింటాళ్లు 48 వాహనాలలో శుక్రవారం రైతులు విక్రయానికి తీసుకువచ్చారు. క్వింటాలుకు గరిష్ట ధర రూ.6,850, మోడల్ - 6,700, కనిష్ట - 6,500 పలికింది. అలాగే కాటన్ బ్యాగ్స్‌లలో 16 క్వింటాళ్లు ఐదుగురు రైతులు విక్రయానికి తీసుకురాగా గరిష్ట ధర రూ.6,600, మాడల్ - 6,500, కనిష్ట - 6,300 పలికిందని మార్కెట్ సెక్రటరీ ఆర్.మల్లేశం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని, ఆదివారాలు మార్కెట్‌కు సాధారణ సెలవులు కాగా తిరిగి ఈ నెల 25న మార్కెట్ పునఃప్రారంభం అవుతుందని తెలిపారు.

'ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల కోసం సీఎం సభ ముట్టడి'

నవతెలంగాణ - కరీంనగర్ : విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, బకాయిలు వెంటనే విడుదల చేయాలని కరీంనగర్‌లో జరిగే సీఎం సభ ముట్టడికి బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్, యువజన సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మాదసు సంజీవ్ ఆధ్వర్యంలో పలు రాజకీయ పార్టీల మద్దతు కోరారు. ఈ సందర్భంగా వారు ప్రతిపక్ష నాయకులకు విద్యార్థుల సమస్యలు వివరిస్తూ 3 సంవత్సరాల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయడం లేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వెంటనే ఫీజు బకాయిలు విడుదల చేసి విద్యార్థుల ఇబ్బందులు తొలగిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి 10 నెలలు గడిచినా ఇప్పటికీ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని తెలిపారు. కరీంనగర్‌లో జరిగే సీఎం సభను బీసీ సంక్షేమ సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముట్టడిస్తామని తెలిపారు.

ఈద్గాను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

నవతెలంగాణ - కరీంనగర్ : నగరంలోని పురాతన ఈద్గాను ఆనుకొని గురువారం రాత్రి మున్సిపల్ అధికారులు పొడవైన కందకాన్ని తవ్వారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం కార్పొరేటర్లు నాయకులు కలిసి మేయర్ సునీల్‌రావు, మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన మేయర్ సునీల్ రావు, పురాతన ఈద్గా వద్ద కందకం తవ్వే పనులను నిలిపివేయించారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయి క్షేత్రస్థాయిలో పర్యటించి ఈద్గా వద్ద మున్సిపల్ అధికారులు తవ్విన కందకాన్ని పరిశీలించారు. ఈద్గాకు నష్టం వాటిల్లితే మరమ్మతులు చేయిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో కొనసాగుతున్న ఫార్మసీ ఉత్సవాలు

నవతెలంగాణ - తిమ్మాపూర్



క్యాంపును ప్రారంభిస్తున్న రమేష్‌రెడ్డి

మండలంలోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు కొనసాగుతున్నట్లు కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి తెలిపారు. అందులో భాగంగా విద్యార్థులకు ఫార్మా క్విజ్, పోస్టర్ ప్రజెంటేషన్, ఓరల్ ప్రజెంటేషన్, రంగోలి, ఫైన్ ఆర్ట్స్ కాంపిటీషన్స్ శుక్రవారం నిర్వహించినట్లు చెప్పారు. అలాగే కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత హైపర్ టెన్షన్, డయాబెటిస్, ఒబేసిటీ, ఎనీమియా నిర్ధారణ పరీక్షల క్యాంపును డైరెక్టర్ నరేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ క్యాంపులో సుమారుగా వందమంది విద్యార్థులు పరీక్షలు చేయించుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌నర్సింహారెడ్డి చెప్పారు. ప్రొఫెసర్ అప్పారావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, మీడియా ఇన్‌చార్జి గొంటి రమేష్ పాల్గొన్నారు.

బలవంతపు భూ సేకరణ చేస్తే ఊరుకోం

అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం

- అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలి : ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి
- లగచర్ల రైతుల కుటుంబాలను పరామర్శించిన ఐద్వా రాష్ట్ర బృందం



నవతెలంగాణ-కొడంగల్, బొంరాస్‌పేట

ఫార్మా కంపెనీ పేరుతో బలవంతపు భూసేకరణ చేస్తే ఊరుకునేది లేదని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పోలీసులపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల, రోటి బండ తండా, పులిచర్ల కుంట తండా గ్రామాల్లో ఐద్వా రాష్ట్ర బృందం పర్యటించింది. ఫార్మా బాధిత కుటుంబాలను పరామర్శించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళలు తమ బాధలను ఐద్వా బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా అరుణ జ్యోతి, మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. రైతులు ప్రాణాలు పోయినా వారి భూములు ఇవ్వమని చెబుతున్నా ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేసి భూములు తీసుకోవాలని ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రభుత్వ దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఫార్మా కంపెనీ పేరుతో ప్రభుత్వం వేల ఎకరాల భూమిని సేకరిస్తోందని, దీని వల్ల భూమిని నమ్ముకుని బతుకుతున్న ప్రజలు ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. కలెక్టర్‌పై దాడి చేశారని అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. అధికారులపై దాడి చేశారనే నెపంతో రాత్రి సమయాల్లో కరెంటు తీసి, ఇంటర్‌నెట్ తొలగించి, తలుపులు పగలగొట్టి మహిళలను తాకరాని చోట తాకుతూ మగవాళ్లను అరెస్టు చేసి కేసులు నమోదు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం భూములు తీసుకోదల్చుకుంటే గ్రామ సభలు నిర్వహించి వారి ఒప్పందం ప్రకారం తీసుకోవాలని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల సొంత భూమి అయితే 80 శాతం, ప్రభుత్వ భూమి అయితే 70 శాతం రైతులు ఒప్పుకుంటేనే కంపెనీ పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధం కావాలని గుర్తుచేశారు. కానీ ఇక్కడ పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి అయితే వారి బతుకులు మారుతాయని ఓట్లు వేసి గెలిపిస్తే వారి బతుకులనే బుగ్గిపాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని బాధితులు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఇక్కడ రెండు పంటలు పండే భూములు ఉన్నాయని, వాటినే ఆధారపడి ఇక్కడి ప్రజలు బతుకుతున్నారని, ఆ భూమినే గుంజుకుంటే వారి బతుకు ఏమిటని ప్రశ్నించారు. లగచర్ల ఘటనలో అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఫార్మా కంపెనీ కోసం రైతుల నుంచి భూములు తీసుకునే ఆలోచనను విరమించుకుంటునట్టు ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో ఫార్మా కంపెనీ రద్దయ్యే వరకూ రైతులకు ఐద్వా అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఆశలత, జిల్లా కార్యదర్శి అనసూయ, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన మంత్రులు

నవతెలంగాణ -నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

సరైన తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలతో కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని వచ్చిన రోజే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న కొత్తపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రం నిర్వాహకులు, రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యంలో తేమ శాతాన్ని యంత్రం ద్వారా పరిశీలించారు. తేమ సరిగా వస్తున్నదా? తూకం సరిగా చేస్తున్నారా? అని నిర్వాహకులను మంత్రి అడిగారు. సరైన తేమ, నాణ్యత ప్రమాణాలతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి అదే రోజు మిల్లులకు పంపించాలని సూచించారు. ధాన్యం విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని చెప్పారు. నిర్వాహకులు ధాన్యాన్ని ఎప్పటికప్పుడే కొనుగోలు చేయడం, రైతులకు వెంటనే చెల్లింపులు చేస్తుండటం పట్ల మంత్రులు అభినందించారు. వారి వెంట జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

మోడల్ స్కూల్ సెప్టిక్ ట్యాంక్‌లో పడి వ్యక్తి మృతి

- శంకర్‌పల్లి పీఎస్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి

నవతెలంగాణ-శంకర్‌పల్లి

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని మోడల్ స్కూల్ గ్రౌండ్‌లోని సెప్టిక్ ట్యాంక్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్కూల్ గ్రౌండ్‌లో పిల్లలు ఆడుకుంటూ ఉండగా క్రికెట్ బాల్ సెప్టిక్ ట్యాంక్ వద్ద పడింది. బాల్ కోసం వెళ్లిన పిల్లలకు దుర్వాసన రావడంతో ఆ విషయాన్ని పాఠశాల పీఈటీకి చెప్పారు. అతను వెంటనే అటెండర్ మల్లేష్‌కు చెప్పగానే అతను వెళ్లి పాఠశాల ప్రిన్సిపాల్ శోభారాణికి తెలిపారు. ఆమె శంకర్‌పల్లి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బందితో కలిసి మృతదేహాన్ని బయటకి తీశారు. ఆ వ్యక్తి చనిపోయి సుమారు 15రోజులు అయిండొచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహం మొత్తం కుళ్లిపోయి చేతులు, మొఖం, ఇతర భాగాలు పూర్తిగా విడిపోయాయి. మృతుని వివరాలు తెలియాల్సి ఉంది. శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

రైతులకు బేడీలేసినోళ్లు మాట్లాడుతున్నారు

- మూసీ ప్రక్షాళన ముమ్మాటికీ అవసరమే
- ఖరీఫ్‌కి, రబీకి తేడా తెలియదా..
- కేటీఆర్ మాటలు పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదు : హరీశ్‌రావు వ్యాఖ్యలపై రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి కామెంట్స్



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

రైతులకు బేడీలు వేసిన వాళ్ళు ఇవ్వాళ మాట్లాడుతున్నారని రాజ్యసభ ఎంపీ రేణుకాచౌదరి విమర్శించారు. నిన్నటి వరకు కుక్కిన పేనులా ఉన్న వాళ్ల నేడు మీసాలు తిప్పుతున్నారన్నారు. ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఖరీఫ్‌కు, రబీకి తేడా తెలియని వారు మాట్లాడితే ఎలా.. అని ప్రశ్నించారు. ప్రజల మీద సానుభూతి ఉంటే సలహాలు సూచనలు చేయండని, స్వీకరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఒక మాట, దేశంలో మరో మాట మాట్లాడి.. బిడ్డను జైలు నుంచి విడిపించుకోవడానికి ఎన్ని ప్రయత్నాలు చేశారో దేశ ప్రజలకు తెలుసని అన్నారు. రేవంత్ పాలన భేషుగ్గా ఉండటంతో బీఆర్ఎస్ వాళ్లకు ఈర్ష్యా ద్వేషాలు పెరిగిపోయాయని అన్నారు. ఇవ్వాళ హరీశ్ రావు పర్యటనే ఓ జోక్ అని ఎద్దేవా చేశారు. నాగలి పట్టి దున్నిన మొహాలా మీవి.. అని ప్రశ్నించారు. మీ బతుకులు కమిషన్ కాకతీయ, కమిషన్ భగీరథ కాదా అని అన్నారు. మీరు మంచి చేస్తే ఎందుకు ఓడిపోయారని నిలదీశారు. ఓడిపోయి ఏమి చేయాలో తెలియక ఇలాంటి జోకులు వేస్తున్నారా అని అన్నారు. నిద్రాహారాలు మాని రేవంత్ పని చేస్తున్నారని తెలిపారు. మీకు రాష్ట్ర ప్రయోజనాల మీద కమిట్‌మెంట్ ఉందా అని, మీ రాజ్యసభ సభ్యులు ఏ స్కీమ్ తెచ్చారని ప్రశ్నించారు. పువ్వాడ అజయ్‌కు ఏమీ కనబడవని, దమ్ముంటే తనతో కలిసి నడవాలని, తాను తిరిగిన ఊళ్ళు నువ్వు తిరిగావా అని నిలేశారు. నకిలీ విత్తనాలతో సుజాతనగర్‌లో రైతులు ఇబ్బందులు పడితే రైతుకు రూ. 6,500 ఇప్పించానని అన్నారు. నకిలీ విత్తనాలు అమ్మే వ్యాపారులను రాష్ట్ర బహిష్కరణ చేయాలని తెలిపారు.

కొత్తగూడెంలో ఫ్రీ కండిషన్ ఎయిర్‌పోర్ట్ రానుందన్నారు. ఆ రోజుల్లోనే కార్గో ప్లెయిన్ కూడా అడిగామని తెలిపారు. ఖమ్మం జిల్లాలో అడవి అనేది లేకుండా పోయిందన్నారు. వైరాలో రైతులకు పంటలపై అవగాహన కోసం హాస్టల్ కట్టించాలని అనుకున్నామన్నారు. కొత్తగూడెం రైల్వే భూములను మనం తీసుకొని వాళ్లకు వేరే భూమివ్వాలని నిర్ణయించామని తెలిపారు. వచ్చే ఏడాది స్థంభాద్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబోతున్నామని అన్నారు. మత్స్యకారుల పండుగ రోజున పాలేరులో ఉత్సవాలు జరుపబోతున్నట్టు చెప్పారు. నేలకొండపల్లిలో బౌద్ధ స్థూపం అభివృద్ధి చేయాలని టూరిజం శాఖ మంత్రిని కోరినట్టు చెప్పారు. కేటీపీఎస్ ఆ స్టేజీకి వచ్చిందంటే తన కృషి ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం పాల్వంచ స్పాంజ్ ఐరన్‌ను మూసివేసిందని తెలిపారు. అక్కడి ట్రేడ్ యూనియన్ నాయకులతో మాట్లాడి మళ్ళీ తెరిపించాలని పోరాటం చేస్తామని చెప్పారు. కేటీఆర్ మాటలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని, కాళేశ్వరం మొత్తం డొల్ల అంటే బీఆర్ఎస్ నేతలు ఒప్పుకుంటారా.. అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముమ్మాటికీ అవసరమేనని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వర ఆలయంలో మంటలు

- భూపాలపల్లి జిల్లాలో ఘటన



నవతెలంగాణ మహదేవపూర్

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పురాతన అమరేశ్వర ఆలయంలో గురువారం రాత్రి ఆంజనేయస్వామి విగ్రహానికి మంటలు అంటుకున్న ఘటన చోటుచేసుకుంది. దాంతో గ్రామస్తులు అప్రమత్తమై మంటలు ఆర్పారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కావాలని చేశారా? లేదా? ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విచారణ చేపడుతున్నారు.

తాగునీటి కోసం గోదావరి జలాలు



- పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- రూ.210 కోట్లతో పైపు లైన్ నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

ప్రజల తాగునీటి అవసరాల కోసం యాదాద్రికి గోదావరి జలాలు తీసుకొస్తున్నట్టు పంచాయతీరాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క (అనసూయ) అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టలో కొమురవెల్లి, మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి గోదావరి జలాల తరలింపుకు శుక్రవారం రూ.210 కోట్లతో 16 కిలోమీటర్ల పైపులైన్ నిర్మాణం పనులకు మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా 526 గ్రామాలకు తాగునీరు అందించనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో 26వ తేదీన గ్రామ పంచాయతీ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. గ్రామ పంచాయతీ వారోత్సవాలకు రూ.2 వేల కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు.

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల కోసం రూ.210 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. అందుకు 16 కిలోమీటర్ల దూరం వరకు పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. 18 కోట్లతో వడపర్తి నుంచి చీకటిమామిడి వరకు రోడ్ల పనులు జరుగుతున్నాయన్నారు. మూసీ శుద్ధీకరణ చేసి గోదావరి నీళ్లను తీసుకొచ్చి బస్వాపూర్, గంధమల్లలో 1.5 టీఎంసీల నీళ్ల నింపి, లక్షన్నర ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. గోదావరి జలాలతో 90 చెరువులను నింపినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరా రెడ్డి, భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుధా హేమేందర్ గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మెన్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఎనుముల కాదు.. ఎగవేతల రేవంత్‌రెడ్డి

తప్పుడు కేసులు పెడితే భవిష్యత్తులో మూల్యం

- మార్కెట్‌యార్డుల్లో రైతుల కన్నీళ్లు
- ఆరు గ్యారంటీల్లో ఒక్కటీ అమలు కావట్లే : ఖమ్మం జిల్లా పర్యటనలో మాజీ మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి/చింతకాని

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిపేరును.. ఎనుముల కాకుండా ఎగవేతల అని మార్చుకుంటే సరిపోతుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఈ మాటంటే ఆయన కేసు పెడతానంటున్నారు. ఇచ్చిన హామీలన్నీ ఎగవేసే ఆయన్ను ఏమనాలి అని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లాలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. చింతకాని మండలం లచ్చగూడెంలో ఏర్పాటు చేసిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. వచ్చేసారి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, పోలీసులు తప్పుడు కేసులు పెడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. 'మార్పు.. మార్పు అన్నరు.. ఏమి మార్పు వచ్చింది? ఒక్క మార్పైతే వచ్చింది.. రైతుబంధు బందైంది.. బతుకమ్మకు చీరలు బందయ్యాయి. సర్కారు దవాఖానకు పోతే కేసీఆర్ కిట్ బందైంది. గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్ బందైంది.. దళిత సోదరులకు దళితబంధు బందైంది. గొల్లకుర్మలకు గొర్రెపిల్లలు.. బీసీలకు బీసీ బంధు, మునుపటిలా 24 గంటల కరెంట్ బందైంది.. రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఒక్క హామీ అయినా అమలైందా' అని హరీశ్‌రావు ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకంలో రూ.2,500 హామీని అమలు చేస్తామని భట్టివిక్రమార్క సంతకం పెట్టి బాండ్ పేపర్ పంచాడు కదా.. అది ఏమైందని అన్నారు. కళ్యాణలక్ష్మి కింద రూ.లక్షకు తులం బంగారం కలుపుతామన్నారు.. ఒక్క చీర కాదు రెండు చీరెలు అన్నారని, ఏదీ అమలుకాలేదని, కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. కొత్తగిచ్చేవి లేకపోగా ఉన్నవి పోగొడ్తున్నరని తెలిపారు. బస్సు తప్ప అంతా తుస్సేనని.. ఊళ్లో సగం మంది బస్సే ఎక్కరన్నారు. బస్సు ఉచితమని బస్సుల సంఖ్య తగ్గించారన్నారు. పెరుగుతున్న రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. దేవుడి మీద ఒట్టుబెట్టి రుణమాఫీ చేస్తానన్న సీఎం మాటనిలుపుకుండా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నోరు తెరిస్తే అయితే తిట్లు.. లేకుంటే దేవుడి మీద ఒట్లు అని అన్నారు. మూసీ మురికికన్నా రేవంత్‌రెడ్డి నోటి కంపు ఎక్కువైందని ఆరోపించారు. రాహుల్‌గాంధీ అదానీని అరెస్టు చేయాలంటే.. గల్లీలో ఉండే రేవంత్‌రెడ్డి ఆయన దగ్గర రూ.వంద కోట్లు తెచ్చారని తెలిపారు. పోలీసులు చట్టానికి లోబడి పనిచేయాలని హెచ్చరించారు. డిసెంబర్ 9 తర్వాత అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ తరపున దళితబంధు స్కీమ్ గురించి మాట్లాడతామన్నారు. అనంతరం ఆయన ఖమ్మం మార్కెట్‌ను సందర్శించి రైతులతో ముచ్చటించారు.

అనంతరం హరీశ్‌రావు మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో బోనస్ మాట బోగస్ అయ్యిందని, మద్దతు ధర కూడా రావట్లేదని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.11వేలున్న పత్తి, ప్రస్తుతం రూ.6,500 మద్దతు ధర కూడా లభించడం లేదన్నారు. సీసీఐ రైతుల కన్నా దళారుల దగ్గరే ఎక్కువగా కొంటుందన్నారు. అప్పట్లో రూ.23వేలు పలికిన మిర్చి ఇప్పుడు రూ.13వేలకే కొంటున్నారని తెలిపారు. జిల్లా మంత్రులు ఆధిపత్యం కోసం బిజీ అయ్యారు తప్ప.. ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ఆరోపించారు. ఆయా సభల్లో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, రాకేశ్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మెన్ లింగాల కమల్‌రాజ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో మావోయిస్టుల ఘాతుకం

- ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరి హత్య
- మావోయిస్టులు, పోలీసుల మధ్య ఆదివాసీలు బలి
- ములుగు జిల్లాలో ఘటన





నవతెలంగాణ-వాజేడు/ ములుగు

పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరిని కత్తులు, గొడ్డళ్లతో కిరాతకంగా నరికి హతమార్చిన సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలం పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న పెనుగోలుకాలనీ గ్రామంలో జరిగింది. ఈ ఘటన ఏజెన్సీ మండలాల్లో అలజడి సృష్టిస్తోంది. మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో గ్రామంలో విషాదం నెలకొంది. ఊహించని సంఘటనతో అటవీ ప్రాంత గ్రామాల్లోని ఆదివాసీలు భయాందోళనకు గురవుతున్నారు. వివరాల్లోకెళ్లే.. పెనుగోలుకాలనీలో గురువారం రాత్రి 11గంటల సమయంలో పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్ ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో మావోయిస్టులు అతని ఇంటి చుట్టూ కట్టిన పరదాలను చింపుకొని లోపలికి వెళ్లారు. రమేష్ భార్య అడ్డుపడగా కనికరించకుండా మంచం పైనే అతన్ని హత్య చేశారు.

అలాగే ఉయిక అర్జున్‌ని ఇంట్లో నుంచి బయటకు తీసుకొచ్చి భార్య చూస్తుండగానే హతమార్చారు. రమేష్ ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుండగా ఏటూరునాగారం హాస్పిటల్ కి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. అంతేకాదు, ఇన్‌ఫార్మర్లను ఖతం చేసినట్టు వారి మృతదేహాల వద్ద మావోయిస్టులు లేఖలు పెట్టి వెళ్లిపోయారు. కాగా మృతులు ఉయిక రమేష్‌కు భార్య రాంబాయి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఉయిక అర్జున్‌కు భార్య సావిత్రి, ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు.

లేఖలో ఏముందంటే..

పేరూరు గ్రామపంచాయతీ కార్యదర్శి ఉయిక రమేష్.. ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర బార్డర్‌లో ఉన్న గ్రామాల్లో వారి బంధువులు, స్నేహితుల ద్వారా మావోయిస్టుల సమాచారాన్ని సేకరించి పోలీసులకు చేరవేసేవాడని పేర్కొన్నారు. ఉద్యోగం వచ్చి వాజేడు మండల కేంద్రంలో ఉంటూ, ఉయిక అర్జున్ ద్వారా షికారి, చేపల వేట, గొడ్ల పేరుతో అడవిలోని సమాచారాన్ని సేకరించి పోలీసులకు చెబుతున్నాడని తెలిపారు. ఇలా మావోయిస్టులపై జరిగిన కొన్ని దాడులకు కూడా కారకుడయ్యాడని అన్నారు. అంతేకాక, పెనుగోలు గ్రామస్తులను గుట్టలపై ఉండకుండా దిగి రావాలని ఒత్తిడి చేస్తూ వారిని నిరంతరం వేధించేవాడని చెప్పారు. పద్ధతులు మార్చుకోవాలని పలుమార్లు చెప్పినప్పటికీ వినలేదని, అందుకే వారిని హత్య చేస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు. అయితే పోలీసులు, మావోయిస్టులు మధ్య జరిగే పోరులో ఏజెన్సీలోని అమాయక ఆదివాసులే బలవుతున్న పరిస్థితి నెలకొంది.

హత్యలు చేయడం అన్యాయం : ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు

వాజేడులో ఇద్దరు ఆదివాసులను ఇన్‌ఫార్మర్ల నెపంతో హతమార్చడం అన్యాయమని ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు, ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి అన్నవరం రవికాంత్, జిల్లా అధ్యక్షులు మంకిడి రవి, తుడుం దెబ్బ నాయకులు ఆరోపించారు. జిల్లా కేంద్రంలో బొద్రాయి వద్ద శుక్రవారం ఆదివాసీ ఉద్యోగ సంఘాలు, తుడుం దెబ్బ నాయకులతో అత్యవసరంగా సమావేశమై మాట్లాడారు. ఆదివాసీలు ఇప్పుడిప్పుడే చదువు, ఉద్యోగం అని ప్రపంచంతో పాటు పరుగులు పెట్టడానికి ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టులు విద్యావంతులను చంపటం వల్ల వారు బయటికి వచ్చే పరిస్థితి ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పెసా కమిటీ జిల్లా కార్యదర్శి వజ్జ రాజు, తుడుం దెబ్బ ములుగు మండలం అధ్యక్షులు ఈక కుమార్, ఆదివాసీ విద్యార్థులు వెంకన్న, వినోద్, సూర్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి

- కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి : సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు జె. వెంకటేష్
- రెండో రోజూ భూపాలపల్లి జిల్లా సీపీఐ(ఎం) మహాసభలు

నవతెలంగాణ-భూపాలపల్లి

కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఎండగడుతూనే, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలు అందించడంతోపాటు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ నాయకులు జె. వెంకటేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం భూపాలపల్లి కేంద్రంలోని కృష్ణ కాలనీ సింగరేణి కమిటీ హాల్‌లో 2వరోజు జరిగిన సీపీఐ(ఎం) జిల్లా 3వ మహాసభల అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనేక విధ్వంసాలకు పాల్పడుతుందన్నారు. ప్రజలకు ఉపయోగపడే పలు కంపెనీలను ప్రయివేటుపరం చేస్తుందని తెలిపారు. సింగరేణి బొగ్గు బ్లాకులను కేంద్ర ప్రభుత్వం వేలం వేసే పద్ధతిని నిలిపివేయాలని, సింగరేణి ప్రాంతంలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే అప్పగించాలని డిమాండ్ చేశారు.

జిల్లాకు రైల్వే మార్గాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని, సింగరేణి జెన్కో ఆధారిత పరిశ్రమలైన బొగ్గు శుద్ధి కర్మాగారం, ఎరువుల కర్మాగారం, సిమెంటు కర్మాగారం ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సంబరాలు జరుపుతున్నారని, కానీ ప్రజా సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని చెప్పారు. జిల్లాలో ప్రజల పక్షాన సమరశీల పోరాటాలు చేస్తూ, ప్రజల పక్షాన సీపీఐ(ఎం) ఎప్పటికీ అండగా ఉంటుందని స్పష్టంచేశారు. పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ప్రయివేటు రంగంలోనూ రిజర్వేషన్లు అమలుచేయాలని కోరారు. సింగరేణి, జెన్ కో, మేడిగడ్డ-అన్నారం ప్రాజెక్టుల కింద భూములు కోల్పోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం ఇచ్చి, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీ, జవహర్ నగర్, రాజీవ్‌నగర్, బాంబులగడ్డ సీఆర్‌నగర్, శాంతినగర్ కాలనీవాసుల ఇండ్లకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి బందు సాయిలు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంపేటి రాజయ్య, చెన్నూరు రమేష్, పోలం రాజేందర్, వి. రాజయ్య, గుర్రం దేవేందర్, సంఘం ప్రీతి ఆతుకూరి శ్రీకాంత్, ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థ బలోపేతానికే 'చర్చా వేదికలు'

- అందులో వచ్చిన అంశాలతో ఓ పాలసీ తయారు చేస్తాం: రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి



నవతెలంగాణ-భూపాలపల్లి

విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకే విద్యా కమిషన్ జిల్లాల్లో చర్చా వేదికలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి తెలిపారు. శుక్రవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లాలోని ఐడీఓసీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర సమగ్ర విద్యా విధానంపై ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఇతర వర్గాల ప్రజలతో చర్చా, సూచనలు సలహాల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా కమిషన్ పదవీ బాధ్యతలు చేపట్టి రెండు నెలలు అయిందని, ఇప్పటి వరకు దాదాపు 70 సమావేశాలు నిర్వహించినట్టు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కేంద్రీయ విద్యాలయాలు, యూనివర్సిటీలు, కార్పొరేట్ స్కూల్స్, కాలేజీల్లో పర్యటిస్తూ టీచర్స్, లెక్చరర్స్, యూనివర్సిటీ ఫ్యాకల్టీలతోపాటు క్షేత్రస్థాయిలో పర్యటనలు కూడా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నేడు విద్యారంగ పరిస్థితి దయనీయంగా ఉందని, గత పాలకులు చేసిన అరాచకాలతో విద్యా వ్యవస్థ దెబ్బతిన్నదని అన్నారు. విద్యావ్యవస్థపై దేశంలో ప్రతి 2,3 ఏండ్లకు చేసే సర్వేల్లో మన రాష్ట్రం 32 స్థానంలో ఉందని తెలిపారు. దీన్ని బట్టి రాష్ట్ర విద్యా వ్యవస్థ ఎంత దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టిందన్నారు. కేరళ, ఢిల్లీ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో పర్యటిస్తూ అక్కడి విద్యా విధానంపై స్టడీ చేసి ప్రభుత్వానికి పాలసీ అందజేయనున్నట్టు చెప్పారు.

అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యా బోధన, నైపుణ్యమైన శిక్షణ, ఉపాధి కల్పన కోసం విద్యలో నూతన సంస్కరణలు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్టు తెలిపారు. అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ సంవత్సరం ఉచిత పాఠ్య పుస్తకాలు, రెండు జతల ఉచిత యూనిఫామ్ అందించినట్టు చెప్పారు. అనంతరం కమిటీ సభ్యులు జ్యోత్స్నారెడ్డి మాట్లాడుతూ.. చర్చకు వచ్చిన ప్రతి విషయాన్ని పరిగణనలోకి తీసుకుంటామని, మంచి సలహాలు, సూచనలు ఇచ్చారని అభినందించారు. కమిటీ సభ్యులు వెంకటేష్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేసిన కమిషన్ ప్రతి నిత్యం సంస్థలతో, అనుభజ్ఞులతో సమాలోచనలు చేస్తూ ముందుకు పోతుందని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలు వల్ల ఇతర వర్గాల్లో తత్సంబంధాలు ఉండటం లేదని, ఆ కోణంలోనే ఆలోచన చేసి సమీకృత పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో నాణ్యమైన విద్యా విధానాన్ని అందుబాటు లోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. కాగా, మహదేవపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సాయి ప్రదీప్తిక, అన్విత ప్రదర్శించిన నేత్రావదానం చర్చా వేదికలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారిని చైర్మెన్, జిల్లా కలెక్టర్, కమిటీ సభ్యులు అభినందించారు. ఈ చర్చా వేదికలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డీపీఆర్వో శ్రీనివాస్, ఎస్సీ, బీసీ సంక్షేమ అధికారులు సునిత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో బంధం నిలబడుతుందా?

గతంలో వంద అబద్ధాలు చెప్పి అయినా ఓ పెండ్లి చేయాలి అనేవారు. అప్పటి పరిస్థితులు వేరు. పెండ్లి తర్వాత ఎలాంటి సమస్యలు వచ్చినా కలిసి బతికేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో అబద్ధాలు చెప్పి పెండ్లి చేస్తే ఆ బంధం నిలబడుతుందా? వాస్తవానికి అబద్ధాలతో ఏ బంధం బలంగా ఉండదు. నిజం అనే పునాదిపైనే బంధాలు నిలబడతాయి. అబద్ధాలు చెప్పడం వల్ల బంధంలో ఎలాంటి ఇబ్బందులు వస్తాయో తెలియజేసే కథనమే ఈ వారం ఐద్వా అదాలత్...



కరిష్మకు సుమారు 22 ఏండ్లు ఉంటాయి. తల్లిదండ్రులను తీసుకొని మా దగ్గరకు వచ్చింది. ఆమెకు యాసిన్‌తో వివాహం జరిగి ఏడాది అవుతుంది. అయితే అతనితో కలిసి ఉండడం ఆమెకు ఇష్టం లేదు. కరిష్మ, యాసిన్ ఇద్దరూ పెండ్లి తర్వాత కలిసి జీవించింది వారం రోజులు మాత్రమే. ఆ తర్వాత రోజు నుండి ఆమె యాసిన్‌తో ఉండటానికి ఇష్టపడటం లేదు. అలా అని ఆమెకు ఇష్టం లేకుండా ఈ పెండ్లేమీ చేయలేదు. ఇద్దరి అంగీకారంతోనే పెద్దలు పెండ్లి చేశారు. ఎంగేజ్‌మెంట్‌కు, పెండ్లికి మధ్య ఆరు నెలల సమయం కూడా తీసుకున్నారు. ఈ మధ్య కాలంలో ఇద్దరూ ఫోన్‌లలో మాట్లాడుకోవడంతో పాటు రెండు మూడు సార్లు కలిసి బయటకు కూడా వెళ్లారు. కాబోయే భార్యాభర్తలే కదా అని ఇంట్లో వాళ్ల కూడా అభ్యంతరం చెప్పలేదు. ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి బాగుంటుందని అంగీకరించారు.

ఇద్దరూ సంతోషంగానే పెండ్లి చేసుకున్నారు. కానీ ఏం లాభం పెండ్లి అయిన వారం నుండే కరిష్మ భర్తతో ఉండడం లేదు. పైగా విడాకులు కావాలని అడుగుతుంది.

> **ఆయనకు షుగర్ ఉంది. ఆరోగ్యం బాగోదు. ఈ విషయం దాచి పెట్టి పెండ్లి చేశారు. షుగర్ పేషంట్‌తో నేను ఎలా ఉండాలి. అందుకే విడాకులు తీసుకోవాలనుకుంటాను' అంది. దానికి మేము 'షుగర్ ఉన్నంత మాత్రానా విడాకులు ఇవ్వడం ఏమిటి. దానికి సంబంధించిన మందులు వాడితే సరిపోతుంది కదా!'**

'ఇద్దరూ కలిసి కొన్ని రోజులు ఉంటే కదా ఒకరి గురించి ఒకరు అర్థం చేసుకునేది. అలాంటిది ఏమీ లేకుండా నేరుగా వచ్చి విడాకులు అంటే ఎలా' అని మేము అడిగితే 'ఆ కుటుంబం మొత్తం నాకు అబద్దాలు చెప్పారు. నన్ను మోసం చేశారు' అంటూ ఏడవడం మొదలు పెట్టింది. 'ఏం జరిగింది, ఎందుకు ఏడుస్తున్నావు అసలు సమస్య ఏంటో చెప్పకుండా ఏడిస్తే ఎలా' అని అడిగితే... యాసిన్‌కి షుగర్ ఉంది. ఆరోగ్యం బాగోదు. ఈ విషయం దాచి పెట్టి పెండ్లి చేశారు. షుగర్ పేషంట్‌తో నేను ఎలా ఉండాలి. అందుకే విడాకులు తీసుకోవాలనుకుంటాను' అంది. దానికి మేము 'షుగర్ ఉన్నంత మాత్రానా విడాకులు ఇవ్వడం ఏమిటి. దానికి సంబంధించిన మందులు వాడితే సరిపోతుంది కదా!' అన్నాము.

'షుగర్ వ్యాధి వల్ల అతను నన్ను దగ్గరికి తీసుకోవడం లేదు. మేము సంతోషంగా ఉండలేకపోతున్నాము. అలాంటి వ్యక్తితో జీవితాంత ఎలా కలిసి బతకాలి. అతనితో ఎలాంటి ఉపయోగం లేదని మా పుట్టింటికి వచ్చేశాను. అందుకే అతను నాకు వద్దు. నాకు న్యాయం కావాలి' అంది.

మేము యాసిన్‌ని, అతని కుటుంబ సభ్యులను పిలిచి మాట్లాడితే 'ఆమె పెండ్లి తర్వాత నాతో వారం రోజులు మాత్రమే ఉంది. ఆమెకు నా గురించి ఏం తెలుస్తుంది. నేను, మా అమ్మానాన్న వెళ్లి రమ్మని అడిగినా రాలేదు. ఆమెకు ఇష్టం లేకపోతే ఎందుకు పెండ్లి చేసుకుంది. నన్ను మోసం చేశారు అని అంటుంది. నాకు షుగర్ ఉన్న విషయం ఆమెకు నేను ముందే చెప్పాను. దానికి ఆమె ఒప్పుకుంది. ఇక్కడికి వచ్చి ఇలా చెబుతుంది. షుగర్ కోసం నేను రెగ్యులర్‌గా మందులు వాడుతున్నాను. ఆమెకు విడాకులు కావాలంటే ఇస్తాను. కానీ ఎందుకు విడాకులు తీసుకుంటుందో తెలియాలి కదా? నా తప్పు లేకుండా నన్ను అందరి ముందు దోషిగా నిలబెడుతుంది. పెండ్లికి ముందు మేము ఆరు నెలలు ఫోన్లో మాట్లాడుకోవడం, రెండు మూడు సార్లు బయటకు వెళ్లడం కూడా జరిగింది. అయితే పెండ్లి తర్వాత నాతో కలిసి వుండకుండానే ఏడాది వరకు వాళ్ల పుట్టింట్లోనే ఉంది. ఇప్పుడు వచ్చి విడాకులు కావాలంటుంది. నా షుగర్ గురించి మా అమ్మానాన్న చెప్పలేదు. కానీ నేను చెప్పాను కదా! ఇది మోసం ఎలా అవుతుంది' అని అడిగాడు.

> **పెండ్లి తర్వాత నాతో కలిసి వుండకుండానే ఏడాది వరకు వాళ్ల పుట్టింట్లోనే ఉంది. ఇప్పుడు వచ్చి విడాకులు కావాలంటుంది. నా షుగర్ గురించి మా అమ్మానాన్న చెప్పలేదు. కానీ నేను చెప్పాను కదా! ఇది మోసం ఎలా అవుతుంది' అని అడిగాడు.**

మీరిద్దరూ సంసార జీవితం ప్రారంభించలేదని ఆమె చెబుతుంది మరి దాని గురించి ఏమిటీ అని అడిగితే 'ఆమె నాతో ఉండనే లేదు, అలాంటప్పుడు ఇద్దరి మధ్య సంబంధం ఎలా ఏర్పడుతుంది' అన్నాడు. కరిష్మా మాత్రం 'వారం రోజులు ఉన్నాను, అప్పుడు నన్ను దగ్గరికి తీసుకోలేదు. అంతకు మించి ఇంకేం చెప్పాలి' అంది. దానికి మేము ముందు మీరిద్దరూ పదిహేను రోజులు కలిసి ఉండండి. ఏదైనా ఇబ్బంది ఉంటే డాక్టర్ దగ్గరకు వెళ్లి టెస్టులు చేయించుకోండి. ఆ రిపోర్ట్స్ తీసుకొని రండి' అని చెప్పి పంపించాము.

రెండు వారాల తర్వాత యాసిన్ టెస్టులు చేయించుకొని కరిష్మను తీసుకొని వచ్చాడు. ఆ రిపోర్టులో యాసిన్‌కు లైంగిక పటుత్వం కొంచెం తక్కువగా ఉందని వచ్చింది. అయితే మందులు వాడితే తగ్గే అవకాశం ఉందని డాక్టర్ చెప్పారు. అయితే కరిష్మ మాత్రం 'ఇలాంటి వ్యక్తితో నేను కలిసి ఎలా బతకాలి. నా వల్ల కాదు. ఇంట్లో ఎలాం టి సమస్య ఉన్నా సర్దుకుపోవచ్చు. భర్త సంసార జీవితానికి పనికి రాకపోతే ఎలా కలిసుండాలి, నేను ఉండలేను' అంది.

దానికి యాసిన్ 'సరే, తనకు ఇష్టం లేనప్పుడు బలవంతంగా కలిసి ఉండడం జరిగే పని కాదు. ఆమెను ఇబ్బంది పెట్టడం సరైనది కాదు. ఆమె కోరినట్టే విడాకులు ఇస్తాను' అని చెప్పాడు. అయితే ఆమెకు నష్టపరిహారంగా రెండు లక్షల రూపాయలు, పెండ్లి ఖర్చులు కూడా యాసిన్ నుండి ఇప్పించాము.

పెండ్లి అనే బంధం ఇలాంటి అబద్ధాలతో కాకుండా నిజంతో, నమ్మకంతో ప్రారంభించాలి. లేకపోతే ఒక జీవితంతో పాటు రెండు కుటుంబాలు బలి కావల్సి వస్తుంది. కాబట్టి అబద్ధాలతో కాకుండా నిజాలతో బంధాలను ముందుకు తీసుకెళ్లాలి.

- వై వరలక్ష్మి,
9948794051

మళ్లీ.. మళ్లీ వాడుతున్నారా..?

ఆయిల్‌ను మళ్లీ వేడి చేయడం వీలైనంత వరకు మానుకోవాలని నిపుణులు సూచిస్తు న్నారు. వాడిన నూనె చల్లబడిన తర్వాత మళ్లీ ఉపయోగించడంవల్ల శరీరం మీద హానికరమైన ప్రభావాలు ఉంటాయి. నూనెను ఎన్నిసార్లు సురక్షితంగా తిరిగి ఉపయోగించవచ్చనేది అందులో వేయించిన ఆహార రకాన్ని బట్టి ఉంటుందని నిపు ణులు చెబుతున్నారు. ఇది ఏ రకమైన నూనె, ఏ ఉష్ణోగ్రత వద్ద, ఎంతకాలం వేడి చేయబడిందో కూడా ముఖ్యమైనది. నిజానికి ఒకసారి వాడిన నూనెను మళ్లీ ఉపయోగించడం ఆరోగ్యానికి హానికరం.

ఫ్రీ రాడికల్స్ పెరుగుతాయి

అధ్యయనాల ప్రకారం, వంట నూనెను మళ్లీ వేడి చేయడం వల్ల విషపూరిత పదార్థాలను విడుదల చేస్తుంది. శరీరంలో ఫ్రీ రాడికల్స్‌ను కూడా పెంచుతుంది, ఇది దీర్ఘకాలిక వ్యాధులకు దారితీస్తుంది.

మెదడు ఆరోగ్యంపై ప్రభావం

వంట నూనెను తిరిగి ఉపయోగించడం, ముఖ్యంగా అధిక ఉష్ణోగ్రతల వద్ద, ట్రాన్స్ ఫ్యాట్‌లు, ఆల్డిహైడ్‌లు, పాలీసైక్లిక్ ఆరోమాటిక్



హైడ్రోకార్బన్‌లు వంటి హానికరమైన సమ్మేళనాలకు దారితీయవచ్చు. ఈ సమ్మేళనాలు ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా మెదడులో ఆక్సీకరణ ఒత్తిడిని పెంచుతుంది. అల్జీమర్స్ వంటి దీర్ఘకాలిక వ్యాధి వస్తుంది. న్యూరో ఇన్‌ఫ్లమేషన్, న్యూరో డైజెస్టివ్ రుగ్మతలతో బాధపడుతారు.

క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది

ఒకసారి ఉపయో గించిన నూనెను మళ్లీ మళ్లీ ఉపయోగిస్తే, క్యాన్సర్ ప్రమాదం పెరుగుతుంది. వాస్తవానికి, నూనెను పదేపదే వేడి చేయడం వల్ల దానిలో ఫ్రీ రాడికల్స్ ఏర్పడతాయి. దానిలోని అన్ని యాంటీ ఆక్సిడెంట్లు కూడా నాశనం అవుతాయి. ఆహారం ద్వారా మీ శరీరంలోకి ప్రవేశించే క్యాన్సర్ కారకాలను పెంచుతుంది.

గుండె సమస్యలు

ఉపయోగించిన నూనెను పదేపదే రీసైక్లింగ్ చేయడం వల్ల గుండె సమస్యలు కూడా వస్తాయి. మీ శరీరంలో కొవ్వు పెరుగుతుంది, ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. ఉపయోగించిన నూనెను అధిక వేడి మీద మళ్లీ వేడి చేయడం వల్ల అందులోని కొవ్వు ట్రాన్స్ ఫ్యాట్స్‌గా మారుతుంది,

కడుపు సంబంధిత వ్యాధులు

ఉపయోగించిన నూనెను తిరిగి ఉపయోగించడం వల్ల అల్సర్లు, అసిడిటీ, వాపు మొదలైన వాటితో బాధపడవచ్చు. అంతే కాదు, మిగిలిపోయిన నూనెను ఉపయోగించడం మన జీర్ణక్రియకు కూడా మంచిది కాదు. అజీర్ణం, మలబద్ధకం, విరేచనాలు వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది.

మధుమేహం, ఊబకాయం

వేయించిన తర్వాత మిగిలిపోయిన నూనెను మళ్లీ ఉపయోగించడం వల్ల కూడా ఊబకాయం వస్తుంది. అంతే కాదు, మధుమేహానికీ దారి తీస్తుంది. ■

బెజ్జీ అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్

(మొదటిపేజి తరువాయి)



గుర్తించారు. ఇంకా నలుగురిని గుర్తించాల్సి ఉంది. ఈ ఆరుగురిపై అధిక మొత్తంలో రివార్డు ఉన్నట్టు సమాచారం. మృతుల్లో మావోయిస్టు పార్టీకి చెందిన అత్యంత కీలక నేతలు ఉన్నారని, వారిని హతమార్చడంలో భద్రతా బలగాలు ఘన విజయం సాధించాయని శుక్రవారం సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. దండకారణ్యంలోని పోలీస్ స్టేషన్ పరిధిలో బెజ్జీ ప్రాంతంలో మావోయిస్టుల సంచారం సమాచారం అందుకున్న భద్రతా బలగాలు.. గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు, మావోయిస్టుల మధ్య జరిగిన భీకరమైన ఎదురుకాల్పుల్లో 10 మంది మావోయిస్టులు మరణించారు. మృతదేహాల వద్ద మావోయిస్టుల వస్తువులను, మందుగుండు సామగ్రి, తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత జిల్లా రిజర్వ్ గార్డ్ సైనికులు విభిన్నంగా సంబురాలు చేసుకున్నారు. జవాన్లు మిఠాయిలు తినిపించుకొని, యుధాలు పట్టుకొని నృత్యాలు చేశారు. అయితే అధికారులు, భద్రతా దళాల పని తీరును ప్రశంసించారు. జీరో టాలరెన్స్ విధానంలో పనిచేస్తూనే తమ ప్రభుత్వం మావోయిస్టులపై బలమైన పోరాటం చేస్తోందని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. బస్తర్‌లో అభివృద్ధి, శాంతి భద్రతలకు భరోసా కల్పించడం తమ ప్రభుత్వ ప్రధానాంశమని ఆయన పునరుద్ఘాటించారు.కాగా జనవరి 1నుంచి ఇప్పటి వరకు 207 మంది మావోయిస్టులు హతమయ్యారు.

అదానీని అరెస్టు చేయాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అవినీతి, అక్రమాలకు పాల్పడిన అదానీని వెంటనే అరెస్టు చేయాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ డిమాండ్ చేశారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీతో సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. దీనికి బాధ్యత వహిస్తూ...ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎంపీ సురేష్ శెట్కార్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదాని, అంబానీల ఆస్తులు వందల రెట్లు పెరిగిపోయాయన్నారు. వారికి వ్యాపార విస్తరణకు మోడీ వెసులుబాటు కల్పించారని ఆరోపించారు. అదానీ స్టాక్ మార్కెట్‌ను ప్రభావితం చేశారని విమర్శించారు. అదానీపై ప్రధాని ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. అదానీ అరెస్ట్ అయితే ప్రధానమంత్రి రాజీనామా చేయక తప్పదని హెచ్చరించారు. అందుకే మోడీ అదానీపై నోరు మెదపడం లేదని ఎద్దేవా చేశారు. అదానీ మోసాల్లో ప్రధానికి కూడా ప్రధాన భాగస్వామ్యం ఉందని ఆరోపించారు. అదానీ స్కిల్ యూనివర్శిటీకి రూ. 100 కోట్లు ఇచ్చారని తెలిపారు. అందుకు మాజీ మంత్రి కేటీఆర్ రూ. 50 కోట్లు ఇచ్చిన తీసుకుంటామని తెలిపారు. డబ్బు వ్యామోహం కన్న రాజకీయం వ్యామోహంతో చేసే పనులు ఎంతోప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. అదానీకి తెలంగాణలో గుంట భూమి కూడా ఇవ్వలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అదానీ న్యాయంగా ఒప్పందాలు చేసుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు.చట్ట ప్రకారం ఎవరు వ్యాపారం చేసిన తమకు అభ్యంతరం లేదన్నారు. చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పేద ప్రజల అభ్యున్నతే తమ పార్టీ విధానమన్నారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. నేరం రుజువైతే అదానీతో కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకుంటామని తేల్చి చెప్పారు. అదానీ అరెస్టయితే అనేక అంశాలు బయటకు వస్తాయన్నారు. మోడీ ప్రభుత్వంలో ఆయన వేల కోట్ల లబ్ది పొందారని తెలిపారు. అదానీ ఆగడాలపై రాహుల్ ఎన్నిసార్లు ప్రశ్నించినా మోడీ కనీసం స్పందించలేదని విమర్శించారు. అర్హత లేకున్నా అదానీ రుణాలు పొందారనీ, ఆయన వల్ల ప్రజలపై పెను భారం పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనేక దేశాలనూ అదానీ మోసం చేశారని విమర్శించారు.

కుటుంబ సర్వే @కోటి

(మొదటిపేజి తరువాయి)

దాదాపుగా సర్వే పూర్తయిందని ప్రభుత్వం తెలిపింది. అన్ని వర్గాల సంక్షేమం, సామాజిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే దేశ వ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రజలందరూ స్వచ్ఛందగా సర్వేలో పాలుపంచుకుంటున్నారు. మొదట్లో అనుమానాలు, అపోహలు వ్యక్తమైనప్పటికీ కుల గణన భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాల అభ్యున్నతికి ఉపయోగపడుతుందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేయడంతో అన్ని వర్గాల్లో సర్వేపై సానుకూలత వ్యక్తమైంది.

రికార్డు స్థాయిలో సర్వే

సెప్టెంబర్ 12న సర్వే కోసం ప్రభుత్వం క్యాబినేట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో ఆరుగురు మంత్రులతో ఏర్పాటైన ఈ సబ్ కమిటీ వివిధ దఫాలుగా సమావేశమై అవసరమైన విధి విధానాలను ఖరారు చేసింది. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వేకు ప్రణాళికశాఖను నోడల్ విభాగంగా ప్రభుత్వం నియమించింది. నవంబర్ 6 నుంచి 8 వరకు ఇండ్ల గణనను చేపట్టారు. సర్వేలో బాగంగా రాష్ట్రంలో మొత్తం 1,16,14,349 కుటుంబాలున్నట్టు గుర్తించారు. అనంతరం నవంబర్ 9 నుంచి ప్రభుత్వం సర్వేను ప్రారంభించింది. గ్రామీణ ప్రాంతాల్లో 64,41,183, పట్టణ ప్రాంతాల్లో 51,73,166 మొత్తం 1,16,14,349 కుటుంబాలు ఉన్నట్టు సర్వేలో లెక్కతేలింది. గ్రామీణ ప్రాంతాల్లో 47,561, పట్టణ ప్రాంతాల్లో 40,246 మంది మొత్తం87,807 మంది ఎన్యుమరేటర్లు విధుల్లో ఉన్నారు. సర్వే జరుగుతున్న తీరును పరిశీలించటంతో పాటు ప్రతి పది మంది ఎన్యుమరేటర్లకు ఒక పర్యవేక్షకుడిని నియమించారు. రాష్ట్రవ్యాప్తంగా 8788 మంది సూపరింటెండెంట్లు సర్వేలో పాల్గొన్నారు.

అదానీతో అన్ని ఒప్పందాలనూ రద్దు చేయాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయిలో అదానీ ముడుపుల వ్యవహారం మరోసారి బయటపడిన నేపథ్యంలో... ఆయనకు చెందిన వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న అన్ని ఒప్పందాలనూ రద్దు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఇక్కడ ఏర్పాటు చేయబోతున్న స్కిల్ యూనివర్సిటీకి అదానీ ఇచ్చిన రూ.100 కోట్ల విరాళాన్ని సైతం తిరిగి ఆయనకు ఇచ్చేయాలని సూచించారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో శాసనసమండలిలో బీఆర్ఎస్ నేత మధుసూదనాచారి, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే కేపీ వివేకానంద తదితరులతో కలిసి కేటీఆర్ మాట్లాడారు. తమ ప్రభుత్వ హయాంలో సైతం అదానీ తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ప్రయత్నించారనీ, కానీ ఆయన వ్యవహారం తెలిసిన తాము అందుకు అంగీకరించలేదని గుర్తు చేశారు. అదానీకి చెందిన కంపెనీలతో తమ ప్రభుత్వం ఎలాంటి ఒప్పందాలూ చేసుకోలేదని అన్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించిందని విమర్శించారు. అదానీ అవినీతి పరుడంటూ ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపణలు గుప్పిస్తోంటే, అలాంటి వ్యక్తికే రేవంత్ సర్కార్ ఎర్ర తివాచీ పరిచిందని ఎద్దేవా చేశారు. అదే తమకూ, కాంగ్రెస్‌కు ఉన్న తేడా అంటూ విమర్శలు గుప్పించారు. అదానీ విషయంలో బడే భాయ్ (మోడీ) ఆదేశించగానే, చోటే భాయ్ (రేవంత్) ఆయనకు స్వాగతం పలికారని సెటైర్లు విసిరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే అదానీ సంస్థలతో రూ.12,400 కోట్ల మేర ఒప్పందాలు చేసుకున్నట్టు సీఎం ప్రకటించారని గుర్తు చేశారు. తెలంగాణ డిస్కంలను సైతం అదానీకి అప్పగించేందుకు వీలుగా హైదరాబాద్ ఓల్డ్ సిటీ నుంచి బిల్లుల వసూళ్ల డ్రామాకు తెరలేపారని తెలిపారు. తద్వారా వాటిని ప్రయివేటీకరించేందుకు కుట్రలు పన్నారని ఆరోపించారు. రామన్నపేటలో సిమెంట్ పరిశ్రమ వద్దంటూ ప్రజలు మొత్తుకున్నా పట్టించుకోకుండా అదానీ ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా ముందుకు సాగారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ తెలంగాణలో అదానీ సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు ఉవ్విళ్లూరుతున్నారని దెప్పిపొడిచారు.

కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలియదా...?

తెలంగాణలో అదానీ, రేవంత్ బంధం గురించి కాంగ్రెస్ హైకమాండ్‌కు తెలియదా? అని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రశ్నించారు. ప్రతీ రోజూ అదానీని విమర్శించే ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ... మన రాష్ట్ర ప్రభుత్వంతో ఆయన చేసుకున్న ఒప్పందాలకు మద్దతిస్తున్నారా? అని నిలదీశారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ప్రభుత్వం తీసుకున్న విరాళాన్ని... రాహుల్‌కు తెలిసే తీసుకున్నారా? తెలియకుండానా? అని ఎద్దేవా చేశారు. ఢిల్లీలో అదానీని విమర్శిస్తున్న కాంగ్రెస్ నేతలు... తెలంగాణలో మాత్రం ఆయన్ను సమర్థిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు అన్ని రాష్ట్రాల్లోనూ, అన్ని విషయాల్లోనూ ఒకే విధానం ఉండాలి కదా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్... అదానీ నుంచి ఏం ఆశించి, ఎంత ఆశించి రూ.12,400 కోట్ల ఒప్పందాలు చేసుకున్నారంటూ ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే... అదానీతో ఒప్పందాలు చేసుకున్న సీఎం రేవంత్‌పై పార్టీ పరంగా వెంటనే చర్యలు తీసుకోవాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

మోడీజీ.. మౌనమేల?

అదానీ విషయంలో జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ విధానాలొక్కటేనని కేటీఆర్ విమర్శించారు. దేశ ప్రతిష్ఠను మంటగలిపిన ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రధాని మోడీని ప్రశ్నించారు. ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ నిలదీశారు. అదానీతో దోస్తీ చేస్తోన్న సీఎం రేవంత్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ ప్రధానిని కోరారు.

స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టుకు పోతాం : కేటీఆర్

ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లకు సంబంధించి నిర్ణీత గడువులోగా అసెంబ్లీ స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టుకు వెళతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఇదే అంశంపై రాష్ట్ర హైకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో శుక్రవారం ఆయన స్పందించారు. స్పీకర్‌ను ఆదేశించే అధికారం కోర్టులకు లేదంటూ కాంగ్రెస్ నేతలు వాదిస్తూ వచ్చారని తెలిపారు. కానీ రీజనబుల్ పీరియడ్‌లో నిర్ణయం తీసుకోవాలంటూ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇప్పుడు స్పీకర్‌కు సూచించారని గుర్తు చేశారు. రీజనబుల్ పీరియడ్ అంటే మూడు నెలలంటూ ఆయన విశదీకరించారు. మణిపూర్‌కు సంబంధించిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేటీఆర్ ఈ సందర్భంగా ఉదహరించారు.

ఫార్మారంగంలో రూ.5,260 కోట్ల పెట్టుబడులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశంలో పేరొందిన ఆరు ఫార్మా కంపెనీలు హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. కాలుష్య రహితంగా ఏర్పాటు చేసే గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. సంబంధిత కంపెనీల ప్రతినిధులు శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో ఎంవోయూలపై సంతకాలు చేశారు. ఈ మేరకు ఆరు కంపెనీలు కలిసి దాదాపు రూ.5,260 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా ఫార్మా రంగంలో 12,490 మందికి కొత్తగా ఉద్యోగాలు లభిస్తాయి. ఎంఎస్ఎన్ గ్రూప్ లాబోరేటరీ తయారి యూనిట్‌తో పాటు ఆర్అండ్‌డీ సెంటర్ నెలకొల్పనుంది. లారస్ ల్యాబ్స్, అరబిందో ఫార్మా కంపెనీలు ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి. గ్లాండ్ ఫార్మా ఆర్అండ్‌డీ సెంటర్, ఇంజెక్టబుల్స్ యూనిట్లను స్థాపించనుంది. డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ ఇంజెక్టబుల్, బయో సిమిలర్ల యూనిట్‌లను ఏర్పాటు చేయనుంది. హెటిరో ల్యాబ్స్ ఫినిష్‌డ్ డోస్, ఇంజక్టబుల్ తయారీ పరిశ్రమ నెలకొల్పనుంది. మరో నాలుగు నెలల్లో ఆయా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించటంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, ఎమ్‌డీ విష్ణువర్ధన్ రెడ్డితో పాటు ఆయా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంట్ సమావేశాల్లో 16 బిల్లులు

(మొదటిపేజి తరువాయి)

బిల్లులు జాబితా చేశారు.

కొత్త బిల్లులు

1. రాష్ట్రీయ సహకార విశ్వవిద్యాలయం ఏర్పాటు బిల్లు
2. పంజాబ్ కోర్టుల (సవరణ) బిల్లు
3. మర్చంట్ షిప్పింగ్ బిల్లు
4. కోస్టల్ షిప్పింగ్ బిల్లు
5. ఇండియన్ పోర్టు బిల్లు

జేపీసీ రిపోర్టు ప్రవేశపెట్టి ఆమోదించాల్సిన బిల్లు

1. వక్ఫ్ సవరణ బిల్లు

లోక్‌సభలో ప్రవేశపెట్టి, లోక్‌సభలోనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు

1. విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు
2. **గోవా అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్విభజన బిల్లు**
3. ముస్లీం వక్ఫ్ (రీ పీల్) బిల్లు
4. ది బిల్స్ ఆఫ్ లాడింగ్ బిల్లు
5. సముద్రం నుంచి వస్తువులు తీసుకొచ్చే బిల్లు
6. రైల్వేస్ (సవరణ) బిల్లు
7. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు

లోక్‌సభలో ఆమోదం పొంది రాజ్యసభలో పెండింగ్‌లో ఉన్న బిల్లు

1. భారతీయ వాయుయన్ విధేయక్ బిల్లు

రాజ్యసభలో ప్రవేశపెట్టి పెండింగ్‌లో ఉన్న బిల్లులు

1. చమురు క్షేత్రాల (నియంత్రణ అండ్ అభివృద్ధి) సవరణ బిల్లు
2. బాయిలర్స్ బిల్లు

లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక

నవతెలంగాణ-పరిగి

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం దుద్యాల మండలం లగచర్ల ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డికి కాంగ్రెస్ నాయకులు నివేదిక అందజేశారు. నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి, అగ్రికల్చర్ కమిషన్ ఛైర్మెన్ కోదండరెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నివేదిక అందజేశారు. బుధవారం వీరు లగచర్ల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా లగచర్ల గ్రామ రైతులతో ముఖాముఖి నిర్వహించి, ఫార్మా ఏర్పాటుపై అవగాహన కల్పించారు. వారి డిమాండ్లను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను వారు సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక రూపంలో అందజేశారు. దీనిపై సీఎం స్పందిస్తూ.. రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.17 లక్షలు, ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం, ఉద్యోగం కల్పిస్తున్నామని హామీ ఇచ్చారని చెప్పారు. రైతులను అన్నివిధాలా ఆదుకుంటామని, వారికి అండగా ఉంటామని తెలిపారు.

కార్మికులకు మోడీ సర్కార్ ద్రోహం

(మొదటిపేజి తరువాయి)

కోరారు. పని సమయాల్లో నిబంధనలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. సేల్స్ ప్రమోషన్ ఎంప్లాయిస్ యాక్ట్‌ను పరిరక్షించాలని, మెడికల్, సేల్స్ రిప్రెజెంటేటీవ్‌ల ఉద్యోగాలను నియంత్రించాలని అన్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల నిర్ణయాలను అమలు చేస్తోందని విమర్శించారు. కార్మికులు, కార్మిక సమస్యలంటే మోడీ సర్కార్‌కు పట్టవని, కార్పొరేట్లకు ఊడిగం చేయడమే ఆయన నిరంతర పనిగా మారిపోయిందని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు, భద్రతకు సంబంధించిన చట్టాలను రద్దు చేసి, కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. మోడీ సర్కార్ కార్మికులను మాత్రమే కాకుండా రైతులు, పేదల, వ్యవసాయ కార్మికులు ఇలా అన్ని వర్గాల ప్రజలపై దాడికి పూనుకుందని దుయ్యబట్టారు. ఈ కార్మిక , ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నవచిత్రం

నేను.. అసలు లేను


అమృత అయ్యర్, అల్లరి నరేష్

అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న మాస్, యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బచ్చల మల్లి' చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. డిసెంబర్ 20న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం సంగీత దర్శకుడు తమన్ ఈ సినిమాలోని 'అదే నేను.. అసలు లేను..' సాంగ్‌ని లాంచ్ చేశారు.

ఈ పాటలో అల్లరి నరేష్, అమృత అయ్యర్ మధ్య బాండింగ్‌ని అందంగా ప్రజెంట్ చేసే మెలోడీగా మ్యూజిక్ డైరెక్టర్ విశాల్ చంద్రశేఖర్ కంపోజ్ చేశారు. అమృత అయ్యర్‌తో చేసే సోల్‌ఫుల్ జర్నీతో రగ్గడ్‌గా ఉండే అల్లరి నరేష్ క్యారెక్టర్‌లో వచ్చే మార్పును సాంగ్‌లో చాలా బ్యూటీఫుల్‌గా ప్రజెంట్ చేశారు. కృష్ణకాంత్ లిరిక్స్ లీడ్ పెయిర్ ఎమోషనల్ జర్నీని పొయిటిక్‌గా ప్రజెంట్ చేశాయి. ఎస్‌పి చరణ్, రమ్య బెహరా ఫ్లజెంట్ వాయిస్ మెలోడీని బ్యూటీఫుల్‌గా కంప్లీట్ చేసింది అని చిత్ర యూనిట్ పేర్కొంది. రోహిణి, రావు రమేష్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు, దర్శకత్వం - సుబ్బు మంగదేవి, నిర్మాతలు - రాజేష్ దండా, బాలాజీ గుత్తా, స్క్రీన్ ప్లే: విప్పర్తి మధు, అడిషినల్ స్క్రీన్ ప్లే: విశ్వనేత్ర, సంగీతం- విశాల్ చంద్రశేఖర్, డీవోపీ- రిచర్డ్ ఎం.నాథన్, ఎడిటింగ్- ఛోటా కె ప్రసాద్, ప్రొడక్షన్ డిజైన్- బ్రహ్మ కడలి.


మోహన్‌బాబు

మహాదేవ శాస్త్రిగా మోహన్‌బాబు

విష్ణు మంచు భారీ స్థాయిలో నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కన్నప్ప' అవా ఎంటర్టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. డా.మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. శుక్రవారం మోహన్ బాబు 50 ఏళ్ల నట ప్రస్థానంలోకి అడుగు పెట్టిన సందర్భంగా ఈ సినిమా నుంచి ఆయన లుక్‌ని రిలీజ్ చేశారు.

ఈ పోస్టర్‌లో మహాదేవ శాస్త్రిగా గంభీరమైన లుక్‌తో ఉన్న మోహన్‌బాబు ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన పోస్టర్స్, టీజర్ మూవీపై అంచనాలు పెంచగా, తాజాగా రిలీజైన మోహన్ బాబు పోస్టర్ మరింత బజ్ క్రియేట్ చేసింది. సినిమాలో ఈ క్యారెక్టర్ ఏ రేంజ్‌లో ఉండనుందా? అనే క్యూరియాసిటీ నెలకొల్పింది. కన్నప్ప ఏ తరానికి అయినా కొత్తగానే ఉంటుందని, భక్తి భావం, ధూర్జటి మహాకవి ఎలా రాశారు? శ్రీకాళహస్తి మహత్యం ఏంటి? అన్నది ఈ చిత్రంలో చూపించబోతున్నామని మేకర్స్ చెప్పారు. ఈ సినిమాతో మోహన్ బాబు మనవడు, మంచు విష్ణు తనయుడు అవ్రామ్ సినీ రంగ ప్రవేశం చేస్తుండటం విశేషం. ఓ వైపు షూటింగ్ చేస్తూనే, మరోవైపు ఈ సినిమాపై బజ్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు మేకర్స్. మోహన్ బాబు నటిస్తూ, నిర్మిస్తున్న ఈ సినిమా టాలీవుడ్‌లో ఓ మైలురాయి అవుతుంది అని చిత్ర బృందం తెలిపింది.

'ఈ సినిమాలో 'కన్నప్ప'గా మంచు విష్ణు నటిస్తున్నాడు. ప్రభాస్, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ భిన్న పాత్రలు పోషిస్తున్నారు. వీరి పాత్రలు, వాటి తీరు తెన్నులు ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేస్తాయి. మేం ఏ లక్ష్యంతో అయితే వీరిని ఈ సినిమా కోసం తీసుకున్నామో, అది ప్రేక్షకులకు బాగా రీచ్ అయ్యేందుకు వీరి పాత్రలు బాగా దోహదం చేస్తాయి. మహాభక్తుడు 'కన్నప్ప' గురించి నేటి తరానికి బాగా అర్థమయ్యేలా, అత్యంత రసవత్తరంగా ఆద్యంతం ఉండేలా దర్శకుడు ముకేష్ కుమార్‌సింగ్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో నేను మహాదేవ శాస్త్రిగా ఓ కీలక పాత్రలో ప్రేక్షకులకు కనిపించ నున్నాను. నా పాత్ర అందర్నీ అలరిస్తుంది'.

- మోహన్‌బాబు

అదే.. ఈ బర్త్‌డే గిఫ్ట్


మంచు విష్ణు

'మాకు స్ఫూర్తినిచ్చిన మా నాన్న (మోహన్‌బాబు) నటుడిగా 50వ వసంతంలోకి దిగ్విజయంగా అడుగుపెట్టడం, నా డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' తుది మెరుగులు దిద్దుకుంటూ, ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతుండటాన్ని ఈ బర్త్‌డే గిఫ్ట్‌గా భావిస్తున్నాను' అని అన్నారు మంచు విష్ణు.

మోహన్‌బాబు తనయుడిగా వెండితెరంగేట్రం చేసి హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్న మంచు విష్ణు పుట్టినరోజు నేడు (శనివారం).

బాలనటుడిగా 'రగిలే గుండెలు' (1985) సినిమాతో కెమెరా ముందుకొచ్చిన విష్ణు మంచు..2003లో 'విష్ణు' సినిమాతో హీరోగా పరిచయమయ్యారు. ఈ సినిమాకుగాను ఉత్తమ నూతన హీరోగా ఫిలిం ఫేర్ అవార్డు దక్కించుకున్నారు. ఆ తర్వాత 'సూర్యం, పొలిటికల్ రౌడీ, అస్త్రం, గేమ్' సినిమాల్లో నటించారు. 'ఢీ' మూవీ ఆయన కెరీర్‌ని మలుపుతిప్పింది. 'దేనికైనా రేడీ, దూసుకెళ్తా, ఈడోరకం ఆడోరకం, లక్కున్నోడు, గాయత్రి, ఆచారి అమెరికా యాత్ర, జిన్నా' లాంటి సినిమాల్లో విలక్షణ పాత్రలు పోషించి, మెప్పించారు. ప్రస్తుతం మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన 'కన్నప్ప'లో కన్నప్పగా నటిస్తున్నారు. ఈ సినిమా డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్


పూర్వాజ్

'శుక్ర', 'మాటరాని మౌనమిది', 'ఏ మాస్టర్ పీస్' వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకున్న దర్శకుడు పూర్వాజ్ 'కిల్లర్' అనే యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఏయు అండ్ ఐ, మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ కలయికలో నిర్మాణ మవుతున్న రెండవ చిత్రమిది.

శుక్రవారం 'కిల్లర్' పార్ట్ 1 - డ్రీమ్ గర్ల్ నుంచి పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. విడుదలైన ప్రతి పోస్టర్‌తో ఈ మూవీ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది అని మేకర్స్ తెలిపారు. జ్యోతి పూర్వజ్, పూర్వాజ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - జగదీశ్ బొమ్మిశెట్టి, మ్యూజిక్ - అషీర్ ల్యూక్, సుమన్ జీవరత్నం, రచన-దర్శకత్వం : పూర్వాజ్.

ఆ అపరిచిత వ్యక్తి ఎవరు?


దివి

సరికొత్త కంటెంట్‌ను ఎప్పటికప్పుడు ఓటీటీ లవర్స్‌కు అందిస్తోన్న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ 'హరికథ' అనే మరో కొత్త వెబ్ సిరీస్‌ను తీసుకొస్తోంది.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై మ్యాగీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించారు. దివి, పూజిత పొన్నాడ, రాజేంద్రప్రసాద్, శ్రీరామ్, మౌనిక రెడ్డి, అర్జున్ అంబటి, రుచిర సాధినేని, శ్రియా కొట్టం, ఉషా శ్రీ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. డిసెంబర్ 13 నుంచి ఈ వెబ్ సిరీస్ స్ట్రీమింగ్‌కు రాబోతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ సిరీస్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

ధర్మం నశించి, అధర్మం పెరిగినప్పుడు తాను మళ్లీ పుడతానని, ధర్మాన్ని స్థాపిస్తానని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్టు.. పరశురాముడు, నరసింహుడు, వామనమూర్తి.. ఇలా శ్రీవిష్ణు అవతారాల రూపంలో ఊరిలో నేరస్తులను శిక్షిస్తుంటాడో అపరిచిత వ్యక్తి. ఆ వ్యక్తి ఎవరు?, ఈ హత్యలు ఎందుకు చేస్తున్నాడు? అనే కోణంలో పోలీసుల ఇన్వెస్టిగేషన్ మొదలవుతుంది. ఈ విచారణలో పోలీస్ ఆఫీసర్‌కు ఎదురైన ఘటనలు ఏంటి అనేది ఆసక్తికరంగా చూపించారు. నాటకాల్లో దేవుడి పాత్రలు పోషించే నటుడిగా రాజేంద్రప్రసాద్ కనిపించగా..పోలీస్ ఆఫీసర్‌గా శ్రీరామ్ నటించారు. మైథాలజీ టచ్‌తో ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్‌గా సాగిన ఈ ట్రైలర్ అందర్నీ విశేషంగా ఆకట్టుకుంటోంది అని మేకర్స్ తెలిపారు.

'ఎర్రచీర' రిలీజ్‌కి రెడీ


కారుణ్య చౌదరి, సుమన్ బాబు

బేబి డమరి సమర్పణలో శ్రీ పద్మాలయ ఎంటర్టైన్మెంట్స్, శ్రీ సుమన్ వెంకటాద్రి ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'ఎర్రచీర - ది బిగినింగ్'. రాజేంద్రప్రసాద్ మనవరాలు బేబీ సాయి తేజస్విని నటిస్తోంది.

సుమన్ బాబు స్వీయ దర్శకత్వం వహిస్తూ ఒక ముఖ్య పాత్ర పోషించారు. డిసెంబర్ 20న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్‌కు రెడీ అవుతోంది.

శుక్రవారం ఈ సినిమా నుంచి 'తొలి.. తొలి ముద్దు' సాంగ్ రిలీజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

దర్శక, నిర్మాత సుమన్ బాబు మాట్లాడుతూ, 'హర్రర్, మదర్ సెంటిమెంట్, యాక్షన్‌తో ఈ సినిమా ఉంటుంది. ఇలాంటి సీరియస్ సబ్జెక్ట్‌లో ఒక మంచి రొమాంటిక్ సాంగ్ రూపొందించాలని అనుకున్నాం. భార్యా భర్తల మధ్య వచ్చే రొమాంటిక్ సాంగ్ ఇది. ముద్దు అనే పదంతో పాట ఉండాలని అనుకున్నాం. మా ఆలోచనకు తగినట్లే జయసూర్య మంచి లిరిక్స్ ఇచ్చారు. అలాగే ప్రమోద్ ఆకట్టుకునేలా కంపోజ్ చేశారు. ఈ పాటలో సెట్ వర్క్ ఆకర్షణగా నిలుస్తుంది. 3 రోజులు ఈ పాట చిత్రీకరించాం. మేము అనుకున్నట్లే బాగా వచ్చింది. డిసెంబ్ 15వ తేదీ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహిస్తాం. ఈ సాంగ్‌పై రీల్స్, షార్ట్స్ చేసి మాకు పంపిస్తే ది బెస్ట్ అనిపించిన వాటికి ఫస్ట్‌ప్రైజ్‌గా లక్ష రూపాయలు, సెకండ్ ప్రైజ్ యాభై వేలు, థర్డ్ ప్రైజ్ పాతిక వేలు బహుమతిగా అందిస్తాం' అని అన్నారు.

పెర్త్‌లో పేస్ పండుగ

పెర్త్ ఆప్టస్ స్టేడియంలో బంతులు బుల్లెట్లను తలపించాయి. పచ్చికతో కూడిన 'ఎక్స్‌ప్రెస్ హైవే' పిచ్‌పై పేసర్లు వికెట్ల పండుగ చేశారు. సీమర్ల సూపర్ షోతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టు తొలి రోజే 17 వికెట్లు పతనం అయ్యాయి. పేస్ దళపతి బుమ్రా (4/17) నిప్పులు చెరుగగా.. ఆసీస్ స్పీడ్‌స్టర్ హాజిల్‌వుడ్ (4/29) సైతం నాలుగు వికెట్ల ప్రదర్శనతో అదరగొట్టాడు. తెలుగు తేజం నితీశ్ కుమార్ రెడ్డి (41), రిషబ్ పంత్ (37) రాణించటంతో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులు చేయగా.. ఆసీస్ 27 ఓవర్లలోనే 67/7తో ఎదురీదుతోంది. ప్రస్తుతం ఆసీస్ మరో 83 పరుగుల వెనుకంజలో కొనసాగుతోంది.

- తొలి రోజు ఆటలో 17 వికెట్ల పతనం
- నిప్పులు చెరిగిన బుమ్రా, సిరాజ్
- హడలెత్తించిన హాజిల్‌వుడ్, స్టార్క్

భారత్ తొలి ఇన్నింగ్స్	ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్	తొలి టెస్టు తొలి రోజు
150/10	67/7	

నవతెలంగాణ-పెర్త్



భారత్, ఆస్ట్రేలియా బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ తొలి టెస్టులో పేసర్లు పండుగ చేసుకున్నారు. ఇరు జట్ల నుంచి సీమర్లు సూపర్ ప్రదర్శన చేశారు. దీంతో పెర్త్ పిచ్‌పై బ్యాటర్లు తడబాటుకు గురవగా.. సీమర్లు వికెట్ల జాతర సాగించారు. పేస్ దళపతి జశ్‌ప్రీత్ బుమ్రా (4/17) నాలుగు వికెట్ల విజృంభణకు మహ్మద్ సిరాజ్ (2/17), హర్షిత్ రానా (1/33) రాణించటంతో ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో కష్టాల్లో కూరుకుంది. ఆఖరు సెషన్లో బ్యాటింగ్‌కు వచ్చిన కంగారూలు 27 ఓవర్లలో 67 పరుగులకు 7 వికెట్లు కోల్పోయింది. భారత జట్టు తొలి ఇన్నింగ్స్‌కు మరో 83 పరుగుల వెనుకంజలో నిలిచింది. అంతకుముందు, నితీశ్ కుమార్ రెడ్డి (41, 59 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), రిషబ్ పంత్ (37, 78 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) విలువైన ఇన్నింగ్స్‌లతో మెరువగా భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 150 పరుగులు చేసింది. ఆసీస్ పేసర్లు హాజిల్‌వుడ్ (4/29) నాలుగు వికెట్లు పడగొట్టాడు. బుమ్రా మెరుపులతో పుంజుకున్న టీమ్ ఇండియా.. తొలి రోజు ఆటలో ఆసీస్‌పై పైచేయి సాధించింది.

టాప్ ఆర్డర్ విఫలం


టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆసీస్ పేసర్లు చుక్కలు చూపించారు. ఉదయం సెషన్లో స్టార్క్, హాజిల్‌వుడ్, కమిన్స్ అరవీర భయంకర బంతులు సంధించారు. యువ బ్యాటర్లు యశస్వి జైస్వాల్ (0), దేవదత్ పడిక్కల్ (0) సున్నా పరుగులకే అవుటయ్యారు. విరాట్ కోహ్లి (5) మరోసారి స్లిప్స్‌లో దొరికిపోయాడు. మరో ఎండ్‌లో నిలకడగా ఆడుతున్న కెఎల్ రాహుల్ (26, 74 బంతుల్లో 3 ఫోర్లు) థర్డ్ అంపైర్ తప్పిదంతో పెవిలియన్‌కు చేరాడు. ఫీల్డ్ అంపైర్ నాటౌట్ ఇవ్వగా.. ఆసీస్ డీఆర్ఎస్‌కు వెళ్లింది. బంతికి, బ్యాట్‌కు స్పష్టమైన దూరం కనిపించినా థర్డ్ అంపైర్ అవుట్‌గా ప్రకటించాడు. ఈ నిర?యంపై వ్యాఖ్యాతలు, భారత మాజీ క్రికెటర్లు విమర్శలు గుప్పించారు. దీంతో తొలి సెషన్లో 25 ఓవర్లలోనే భారత్ 4 వికెట్లు చేజార్చుకుంది. 51 పరుగులు చేసింది.

పంత్, నితీశ్ మెరువగా..

లంచ్ విరామం తర్వాత వికెట్ల పతనానికి తెర పడలేదు కానీ, స్కోరు బోర్డు వేగం పుంజుకుంది. రిషబ్ పంత్ (37) తనదైన శైలిలో పరుగులు పిండుకున్నాడు. స్టార్క్ ఓవర్లో విలక్షణ విన్యాసంతో అదుతేం సిక్సర్ బాదాడు. ధ్రువ్ జురెల్ (11) అంచనాలను అందుకోలేదు. వాషింగ్టన్ సుందర్ (4) సైతం నిరాశపరిచాడు. ఈ సమయంలో తెలుగు తేజం, అరంగేట్ర ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి (41) తోడుగా పంత్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ఆరు ఫోర్లు, ఓ సిక్స్ కొట్టిన నితీశ్ భారత ఇన్నింగ్స్‌లో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. పంత్ వికెట్ కోల్పోయిన కొద్దిసేపటికే భారత తొలి ఇన్నింగ్స్ కథ ముగిసింది. 49.4 ఓవర్లలో 150 పరుగులకు భారత్ ఆలౌటైంది. రెండో సెషన్లో 24.5 ఓవర్లలో 99 పరుగులు చేసిన భారత్.. ఆరు వికెట్లు కోల్పోయింది. ఆసీస్ పేసర్లు హాజిల్‌వుడ్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. కమిన్స్, స్టార్క్, మిచెల్ మార్ష్‌లు రెండేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నారు.

బుమ్రా..బూమ్‌బూమ్

వరుసగా స్వల్ప స్కోర్ల నైరాశ్యంలో ఉన్న భారత్‌కు కెప్టెన్ జశ్‌ప్రీత్ బుమ్రా సరికొత్త ఉత్సాహం అందించాడు. ఇన్నింగ్స్ మూడో ఓవర్లోనే మెక్‌స్వీనీ (14) వికెట్‌తో భారత్‌కు బ్రేక్ అందించాడు.



ఉస్మాన్ ఖవాజ (8), స్టీవ్ స్మిత్ (2) సైతం బుమ్రా బుట్టలో పడ్డారు. బుమ్రా ఓవర్లో లబుషేన్ ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్స్‌లో కోహ్లి నేలపాలు చేశాడు. అయినా, భారత బౌలర్ల జోరు తగ్గలేదు. లబుషేన్ (2) ఓ ఎండ్‌లో ఓపిగ్గా ఆడినా మరో ఎండ్ నుంచి వికెట్ల వేట కొనసాగింది. సిరాజ్, రానా సైతం వికెట్ల వేటలో బుమ్రాకు జత కలిశారు. లబుషేన్, మిచెల్ మార్ష్ (6)లను సిరాజ్ అవుట్ చేయగా.. ట్రావిశ్ హెడ్ (11)ను రానా సాగనంపాడు. డ్రింక్స్ విరామ సమయానికి 14 ఓవర్లలో 37/4తో నిలిచిన ఆస్ట్రేలియా.. తొలి రోజు ఆట ముగిసేసరికి 27 ఓవర్లలో 67/7తో కొనసాగుతోంది. అలెక్స్ కేరీ (19 నాటౌట్, 28 బంతుల్లో 3 ఫోర్లు), మిచెల్ స్టార్క్ (6 నాటౌట్) క్రీజులో అజేయంగా ఆడుతున్నారు.

స్కోరు వివరాలు :

భారత్ తొలి ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) మెక్‌స్వీనీ (బి) స్టార్క్ 0, రాహుల్ (సి) అలెక్స్ (బి) స్టార్క్ 26, పడిక్కల్ (సి) అలెక్స్ (బి) హాజిల్‌వుడ్ 0, విరాట్ కోహ్లి (సి) ఖవాజా (బి) హాజిల్‌వుడ్ 5, రిషబ్ పంత్ (సి) స్మిత్ (బి) కమిన్స్ 37, ధ్రువ్ జురెల్ (సి) లబుషేన్ (బి) మార్ష్ 11, వాషింగ్టన్ సుందర్ (సి) అలెక్స్ (బి) మార్ష్ 4, నితీశ్ కుమార్ రెడ్డి (సి) ఖవాజా (బి) కమిన్స్ 41, హర్షిత్ రానా (సి) లబుషేన్ (బి)హాజిల్‌వుడ్ 7, జశ్‌ప్రీత్ బుమ్రా (సి) అలెక్స్ (బి) హాజిల్‌వుడ్ 8, మహ్మద్ సిరాజ్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 11, **మొత్తం : (49.4 ఓవర్లలో ఆలౌట్) 150.**

వికెట్ల పతనం : 1-5, 2-14, 3-32, 4-47, 5-59, 6-73, 7-121, 8-128, 9-144, 10-150.

బౌలింగ్ : మిచెల్ స్టార్క్ 11-3-14-2, హాజిల్‌వుడ్ 13-5-29-4, పాట్ కమిన్స్ 15.4-2-67-2, నాథన్ లయాన్ 5-1-23-0, మిచెల్ మార్ష్ 5-1-12-2.

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ : ఉస్మాన్ ఖవాజా (సి) కోహ్లి (బి) బుమ్రా 8, మెక్‌స్వీనీ (ఎల్బీ) బుమ్రా 10, లబుషేన్ (ఎల్బీ) సిరాజ్ 2, స్మిత్ (ఎల్బీ) బుమ్రా 0, ట్రావిశ్ హెడ్ (ఎల్బీ) హర్షిత్ రానా 11, మార్ష్ (సి) రాహుల్ (బి) సిరాజ్ 6, అలెక్స్ కేరీ నాటౌట్ 19, పాట్ కమిన్స్ (సి) పంత్ (బి) బుమ్రా 3, స్టార్క్ నాటౌట్ 6, ఎక్స్‌ట్రాలు : 2, **మొత్తం :(27 ఓవర్లలో 7 వికెట్లకు) 67.**

వికెట్ల పతనం : 1-14, 2-19, 3-19, 4-31, 5-38, 6-47, 7-59.

బౌలింగ్ : బుమ్రా 10-3-17-4, మహ్మద్ సిరాజ్ 9-6-17-2, హర్షిత్ రానా 8-1-33-1.

ఆటలు

మార్చి 14 నుంచి ఐపీఎల్ 18

మే 25న ఐపీఎల్ టైటిల్ పోరు
రానున్న మూడు సీజన్ల విండో వెల్లడి



ముంబయి : గతంలో ఎన్నడూ లేని విధంగా భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) రానున్న మూడు సీజన్ల ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) షెడ్యూల్ విండోను వెల్లడించింది. పది ఫ్రాంచైజీలకు రాసిన లేఖలో బీసీసీఐ టోర్నమెంట్ తేదీలను తెలిపింది. మార్చి 14న ఐపీఎల్ 2025 ఆరంభం కానుండగా.. మే 25న ఫైనల్ జరుగుతుంది. 2026 ఐపీఎల్ మార్చి 15న మొదలై.. మే 31న ముగియనుంది. 2027 ఐపీఎల్ మార్చి 24న ప్రారంభమై.. మే 30న ఫైనల్‌తో ముగుస్తుంది. 2026, 2027 సీజన్ల మ్యాచుల సంఖ్యపై స్పష్టత లేకపోయినా.. వచ్చే సీజన్లో సైతం 74 మ్యాచులే ఉండనున్నాయి. ఇక వచ్చే మూడు ఐపీఎల్ సీజన్లకు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, అఫ్గనిస్థాన్, జింబాబ్వే, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల క్రికెట్ బోర్డుల తమ ఆటగాళ్లకు ఎన్‌ఓసీలు అందించినట్టు బోర్డు వెల్లడించింది.

వేలంలోకి జోఫ్రా ఆర్చర్!


జాబితాలో చేర్చిన ఐపీఎల్ నిర్వాహకులు



ముంబయి : గాయాలు, పని ఒత్తిడి అంటూ తరచుగా ఐపీఎల్ సీజన్ మధ్యలోనే స్వదేశానికి వెళ్లిపోతున్నారనే కారణాలతో కొందరు విదేశీ క్రికెటర్లను బీసీసీఐ ఈసారి ఐపీఎల్ 2025 ఆటగాళ్ల మెగా వేలానికి దూరం పెట్టిన సంగతి తెలిసిందే. ఆ జాబితాలో జోఫ్రా ఆర్చర్, మార్క్‌వుడ్ సైతం ఉన్నారు. సౌదీ అరేబియా రాజధాని జెడ్డా వేదికగా ఐపీఎల్ ఆటగాళ్ల వేలం ఈ నెల 24 నుంచి ఆరంభం కానుంది. రెండు రోజుల పాటు జరిగే వేలంలో.. తాజాగా జోఫ్రా ఆర్చర్ పేరును తిరిగి చేర్చినట్టు సమాచారం. ఈ మేరకు ఫ్రాంఛైజీలకు ఐపీఎల్ నిర్వాహకులు సమాచారం అందించారు. రూ. 2 కోట్ల కనీస ధరతో ఫాస్ట్ బౌలర్ల సెట్‌లో ఆర్చర్ వేలంలోకి తొలి రోజే రానున్నాడు. 2022 వేలంలో ఆర్చర్‌ను రూ. 8 కోట్ల ధరకు ముంబయి ఇండియన్స్ తీసుకుంది. యుఎస్ బౌలర్ సౌరభ్ నేత్రావల్కర్, ముంబయి ఆటగాడు హార్దిక్ తోమారెలు సైతం వేలంలో జాబితాలోకి వచ్చారు. దీంతో వేలంలో రానున్న ఆటగాళ్ల సంఖ్య 576కు పెరిగింది.

మెల్‌బోర్న్‌లో 150 ఏండ్ల టెస్టు

2027 మార్చి 11-15న ఇంగ్లాండ్, ఆసీస్ ఢీ



ముంబయి : ప్రపంచ టెస్టు క్రికెట్ 150 ఏండ్ల పండుగకు ఆస్ట్రేలియాలోని ప్రఖ్యాత మెల్‌బోర్న్ స్టేడియం వేదిక కానుంది. టెస్టు క్రికెట్‌లో తొలి, వందేండ్ల టెస్టు మ్యాచ్‌కు సైతం మెల్‌బోర్న్ వేదికగా నిలిచింది. 2027 మార్చి 11-15న 150 ఏండ్ల టెస్టు క్రికెట్ పండుగ సందర్భంగా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో ఏకైక మ్యాచ్‌లో తలపడనున్నాయి. 1977లో వందేండ్ల టెస్టు క్రికెట్ మ్యాచ్, 1877లో తొలి టెస్టు మ్యాచ్‌ల్లో ఆసీస్ 45 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో 150 ఏండ్ల టెస్టులో ఫలితంతో పాటు గెలుపు తేడాపై క్రికెట్ అభిమానుల్లో అంచనాలు ఎక్కువగా ఉన్నాయి. 150 ఏండ్ల టెస్టు క్రికెట్ మ్యాచ్ అనంతరం ఇంగ్లాండ్, ఆసీస్ క్రికెటర్లు నేరుగా ఐపీఎల్‌లో ఆడేందుకు భారత్‌కు వెళ్లనున్నారు!.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.